# ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

**3-1-51**

నాలుగు అణాలు



# విషయానుక్రమణిక

## 3 జనవరి 1951

**ముఖచిత్రం :**

మిస్ ఇజ్రేల్ 1950

**వ్యాసాలు :**



**కథలు :**



**నాటిక:**



**సినిమా :**




**బొమ్మరిల్లు :**



**గేయం :**





# ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0
విడిప్రతిక
4 అణాలు

ప్రతి బుధవారము
ప్రకటింపబడును
**Founder: K. NAGESWARA RAO**

సంపుటము **43**
సంచిక **17**

వికృతి సంవత్సర మార్గశిర బహుళ దశమి బుధవారము




"క్రిస్మస్ పండుగ శుభాశంసలు"

జనరల్ ఐసెన్‌హోవరుగారు పశ్చిమయూరపు రక్షణాసైన్యానికి సర్వసేనానిగా నియమింపబడినారు.

(నేషనల్ హెరాల్డ్)

# హిందూమహాసభ: ప్రజలు

## బయటపడ్డ చేప

భారత జాతీయోద్యమ నాయకులలో గొప్ప మతాభిమానులు, తిలక్, లజపతిరాయ్, మాలవీయ, సావర్కార్, మూంజీ మొదలైనవారు లేకపోలేదు. ఈ జాబితాలో గాంధీజీని చేర్చినా చేర్చవచ్చు. అయితే గాంధీజీ నాయకత్వం కింద జాతీయోద్యమచరిత్రలో నిజమైన ప్రజోద్యమం - సహాయనిరాకరణం ప్రారంభమైననాటినుండి మన జాతీయోద్యమంలో మతావేశానికీ, కేవల మతాభిమానానికీ చోటులేకుండాఉంది. మతాభిమానులైన పూర్వపు దేశనాయకులలో కొందరు పోగా మిగిలినవారు మతాభిమానానికో, జాతీయోద్యమానికో స్వస్తిచెప్పవలసిన పరిస్థితి ఏర్పడింది. మహనీయుడు పండిత్ మదనమోహనమాలవీయ ఒకడే ఆమరణాంతం హిందూమహాసభమీదా, కాంగ్రెసుమీదా సమానాదరం చూపాడు. అయితే ఆయన ఈ రెంటికన్నా తన విశ్వవిద్యాలయంమీద ఎక్కువ ఆదరం చూపాడు మరి. సావర్కార్, మూంజీ మొదలైనవారు జాతీయసేవ మాని మతసేవలో పడ్డారు. చెరువెండితే చేపలు బయటపడ్డట్టు ప్రజాబాహుళ్యంలో జాతీయ చైతన్యం ప్రబలే సమయానికి హిందూమహాసభ ప్రజలకు దూరం వెళ్లిపోయింది.

1930 లో మహాత్ముడు సాగించిన ఉప్పు సత్యాగ్రహంతో దేశంలో ఎన్నడూ లేని చైతన్యం కలిగింది. కాంగ్రెసు జరిపిన జాతీయోద్యమాలన్నిటిలోకీ అదే విస్తృతమైనది. ఆ సమయంలోనే భారత స్వాతంత్ర్యప్రకటనకూడా కాంగ్రెసు పక్షాన జరిగింది.

ఈ మహోద్యమం ప్రకటించబడిన రోజుల్లో ఒక హిందూమతాభిమాని అయిన నాయకుడు ఒకానొక విశ్వవిద్యాలయానికి వేంచేశాడు. చిన్నసభ ఏర్పాటయింది. యాభైమంది ఆప్రాంతాల విద్యార్థులు హాజరైనారు. హిందూమతాభిమాని చేసిన ప్రసంగం సారాంశమేమంటే; "గాంధీ దేశాన్ని వంచిస్తున్నాడు. దేశానికి నిజమైన శత్రువులు ఇంగ్లీషువారు కారు. వారివాళ ఉంటారు రేపు వెళ్లిపోతారు. కాని అసలైన శత్రువులు- ఎక్కడికీ వెళ్లకుండా ఇక్కడే ఉండి హిందూమతసంస్కారాలను విధ్వంసం చేసేవాళ్లు తురకలు. దేశభక్తిగల హిందూయువకులంతా తురకలను నరకటానికి నడుములు బిగించినరోజున దేశం విముక్తమవుతుంది!"

## నేతిబీరకాయ

"వాడు నా కులంవాడు కాడు, నా మతంవాడుకాడు," అనేభావాన్ని కొట్టేసి "వాడు నా దేశస్థుడు," అన్నభావం రావటమే జాతీయోద్యమానికి మొదటిమెట్టు. ఆ భావమే జాతీయోద్యమాన్ని ప్రజోద్యమంచేస్తుంది. ఏ వేదాలో, భగవద్గీతో, కొరానో, బైబిలో ప్రజలను కూడగట్టే రోజులు ఎన్నడో వెనకపడాయి. కాని హిందూమహాసభ ఆ విషయం గ్రహించదు, పాటించదు. దానికి మతమన్నది ఒక సాంఘిక- రాజకీయ సాధనమేగాని పరమార్థం కాదు. హిందూమహాసభకు హిందూమతం మీద గాఢాభిమానం ఉన్నట్టుగాని, అసంఖ్యాకులైన హిందువులమీద గాఢానురాగంగాని ఉన్నట్టు ఎక్కడా దాఖలాలేదు.

ఈదేశంలో అధికసంఖ్యాకులు హిందువులు. ఈ హిందువులలో అత్యధిక సంఖ్యాకులు నిరక్షరులు, నిర్ధనులు, శ్రామికులు. అయినా హిందూమహాసభ హిందూసంస్థానాధిపతులను ఆశ్రయించిందిగాని హిందూ కార్మికులను కూడగట్టలేదు. నిరక్షరులను అక్షరాస్యులు చెయ్యలేదు. దరిద్రులకు ఉద్యోగాలిప్పించలేదు. ప్రజాస్వామికసిద్ధాంతాలుగాని, దేశంయొక్క ఉమ్మడిక్షేమంగాని హిందూమహాసభకు పట్టలేదు.

కాశ్మీరుమహారాజు హిందువుడు. ఆయన అసంఖ్యాకులైన ముస్లిములపై నిరంకుశపరిపాలన సాగించినప్పుడు హిందూమహాసభకు చీమైనా కుట్టలేదు. అక్కడ ఏర్పడిన షేక్ అబ్దుల్లా ప్రభుత్వంపైఇప్పుడు హిందూమహాసభ కత్తి కట్టింది. కాశ్మీరు విభజన కూడదని హిందూమహాసభ అంటున్నది. కాశ్మీరుజాతీయ మహాసభా అంటున్నది. అయినప్పుడు హిందూ మహాసభకు కాశ్మీరుజాతీయమహాసభంటే కన్నెర్ర దేనికి? హిందూమహాసభకు కావలసింది కాశ్మీరు ప్రజలక్షేమం కాదు, పాకిస్తాన్‌తో లడాయి!

నేపాలు ప్రజాఉద్యమాన్ని బలపరచని భారతీయుడుండడు. హిందూమహాసభ వైఖరిని నిర్ణయించేది అచ్చగా మతమే అయితే నేపాలువిషయంలో అది తటస్థంగా ఉండవచ్చు; అక్కడ పాలకులూ, పాలితులూకూడా హిందువులే. అట్లాకాక హిందూమహాసభకు హిందూ ప్రజాబాహుళ్యంమీద ఆదరమే ఉంటే తానుకూడా ప్రజల తిరుగుబాటును బలపరచవచ్చు. హిందూమహాసభ ఏదీ చేయలేదు; విదేశీయులచేతి కీలుబొమ్మగా ఉండి దుష్టపరిపాలన సాగించే రాణానే వెనకవేసుకువస్తున్నది! ఇట్లా ఉన్నది హిందూమహాసభలో హిందూత్వం.

## అట్టడుగున రాజకీయాలు

హిందూ మహాసభ చెప్పే ధర్మపన్నాలన్నీ అకాల రాజకీయ పాత్రనిర్వహణానికే ననటానికి సందేహం లేదు. ఇది పచ్చి ఫాసిస్టుపాత్ర. పాకిస్తాన్ శరణార్థులపై దీనికిగల సానుభూతిలో కూడా అట్టడుగున రాజకీయ దురాశయాలు తప్ప ఇంకేమీ లేవు. ఇటీవల పూనాలో జరిగిన అఖిలభారత హిందూమహాసభా సమావేశంలో మాట్లాడుతూ డాక్టర్ ఎన్. బి, ఖరే, కాందిశీకులకు పునరావాసం కలిగించనందుకూ, పాకిస్తానుతో యుద్ధం తలపెట్టనందుకూ కూడా కాంగ్రెసు ప్రభుత్వాన్ని విమర్శించాడు. యుద్ధభారం లేకుండానే కాందిశీకులకు సరిఅయిన పునరావాసం కలిగించలేకుండా ఉన్న ప్రభుత్వం ఒకవంక పాకిస్తానతో యుద్ధానికి దిగి ఈపనిని విజయవంతంగా

చేస్తుందని డాక్టర్ ఖరే భావించి ఉండటం సాధ్యంకాదు.

దేశానికి స్వాతంత్ర్యం రావటంతో కాంగ్రెసు సంస్థ విరమించ వచ్చునని ఒక నాడు గాంధీజీ అన్నాడు. కాంగ్రెసు స్వతంత్రభారతంలో కూడా ఒక రాజకీయ పాత్రవహించటానికి యత్నిస్తూ ప్రాథమిక ప్రజాస్వామిక సూత్రాలను ఆమోదించింది. కాంగ్రెసు అగ్రనాయకులలోనే గొప్ప హిందూమతాభిమానులున్నారు. ఉధాహరణకు, వల్లభాయిపటేల్. హిందూమహాసభ అంతా గాలించినా పటేలును మించిన మతాభిమాని దొరకకపోవచ్చు. ఒక్కొక్కప్పుడు ఆయన ఈ మతాభిమానాన్ని ప్రజాస్వామిక సూత్రాలతో సమన్వయించుకోలేక పోయినాడా అన్నట్టు కూడా కనిపించేవాడు! కాని కాంగ్రెసుసాగించవలసిన ప్రజాతంత్రాన్నీ, అనుసరించవలసిన ప్రజాస్వామిక విధానాన్నీ గౌరవించి ఆయన తన మతాభిమానాన్ని అదుపులో ఉంచుకున్నాడు. ఇండియా పాకిస్తానులు సౌఖ్యంగా ఉండవలిసిన అవసరం గుర్తించి ఆయన ఢిల్లీ ఒప్పందాన్ని పూర్తిగా బలపరిచాడు.

చెప్పవచ్చిందేమంటే స్వతంత్రభారతంలో తాను రాజకీయ పాత్ర నిర్వహించటానికి గాను కాంగ్రెసు సరిఅయిన కృషి చేస్తున్నది. ఈకృషి సఫలం కాకపోవచ్చు. కాంగ్రెసులో ఈనాడు అనేక లోపాలున్నాయి. కాని వాటిని ఎత్తిచూపవలసినది హిందూమహాసభ కాదు. ఎందుకంటే, అసలే అల్పసంఖ్యాకులుగా ఉన్న ముస్లిములు, స్వాతంత్ర్యంతోబాటు దేశ విభజనానంతరం మరీ అల్పసంఖ్యాకులైపోవటంతో ఈ అల్పసంఖ్యాకులు అధిక సంఖ్యాకులకు రాజకీయంగాగాని, సాంస్కృతికంగాకాని, సాంఘికంగాని, ఆర్థికంగాగాని ప్రమాదపరిస్థితి కలిగించే అవకాశం పోయింది. అందుచేత ఈ మతసంస్థ రాజకీయాలు అవలంబించి చేయగల మహత్కార్యం ఏమీఉండదు.

ఒక మతోన్మాదులకూటమి గాంధీని హత్యచేసిన అనంతరం హిందూమహాసభ పరిస్థితులకు తలఒగ్గి, ఇకముందు తాను రాజకీయ రంగంలోకి రాననీ, సాంస్కృతిక రంగలోనే ఉంటాననీ ప్రకటించింది. కాని ఈ నిర్ణయం బుట్టదాఖలు అయింది. ప్రస్తుతం కాంగ్రెసు ఆంతరంగిక దౌర్బల్యంతో బాధపడుతున్నదనీ, నలుగురూ నాలుగురాళ్లు వేస్తే అది పతనమైపోతుందనీ హిందూమహాసభ విశ్వాసం.

ఈవిశ్వాసంతోనే, హిందూమహాసభ కొంతకాలంక్రితం బొంబాయిలో సోషలిస్టులు ఏర్పాటుచేసిన ప్రభుత్వ ప్రతిపక్షసమావేశం వేదికమీదికివచ్చి తన సిద్ధాంతాలతో ఏమీ సంబంధంలేనివారితో చేతులు కలప యత్నించింది.

పూనా మహాసభలో కూడా డాక్టర్ ఖరే, "కాంగ్రెసు పాపాలుపండి బద్దలు కానున్నాయి," అనే ఆశ వెలిబుచ్చాడు. హిందూ మహాసభ ఆశయాలకూ, సిద్ధాంతాలకూ ఎటువంటివిఘ్నమూ లేకుండా ఆ సంస్థను ఉంచుకుంటూ రాజకీయరంగంలో పనిచెయ్యటానికి విస్తృతమైన ప్రాతిపదిక మీద వేరొక సంస్థను నిర్ణయించాలని భోపట్కర్ సూచించాడు.

## గొంతెమ్మ కోరికలు

అయితే హిందూ మహాసభకు గల రాజకీయ ఆశయాలు కేవలం గొంతెమ్మకోరికలు. అవి ఫలించవు. కాంగ్రెసు కన్న ఇతోధికంగా పనిచేయగల ప్రజాసంస్థలున్నట్టయితే అవి ఎన్నికలలో కాంగ్రెసును ఓడించవచ్చు. అటువంటి పక్షాలు ప్రస్తుతదేశీయ సమస్యలను ఎట్లా పరిష్కరిస్తాయో, ప్రజావసరాలను ఇతోధికంగా ఎట్లా సాధ్యంచేస్తాయో చెప్పి ప్రజలను నమ్మించవచ్చు.

ఏదో రాజకీయ గూడుపుఠాణీ చేసి, పరస్పర వైరుధ్యంగల పార్టీలు నాలుగు చేతులు కలిపినంతమాత్రాన కాంగ్రెసును చంపటం సాధ్యంకాకపోవచ్చు. అటువంటి పరిస్థితులలో కాంగ్రెసు చావటమే జరిగితే ఆ తరవాత వచ్చేది ఏమిటోకూడా ఆలోచించాలి. కాంగ్రెసును ఓడించే శక్తులు కాంగ్రెసుకన్న ప్రజలకు సన్నిహితమైనవిగా ఉన్నట్లయితేనే కాంగ్రెసు ఓటమి వల్ల మేలుంటుంది గాని, హిందూమహాసభవంటి సంస్థలుచేరి కాంగ్రెసును ఓడించటంవల్ల దేశానికి క్షేమం ఉండదు. నిజమైన ప్రజాస్వామిక సిద్ధాంతాలపై పనిచేసే సంస్థ ఏదీ కాంగ్రెసును పడగొట్టటానికై హిందూమహాసభతో చేతులు కలపబోదు. అది కేవలం హిందూ మహాసభవారి భ్రమ.

ఈ భ్రమ హిందూమహాసభాసభ్యులందరికీ ఉన్నట్టు కనబడదు. మహాసభా సమావేశానికి ఆహ్వాన సంఘాధ్యక్షుడైన భోపట్కర్ చెప్పేదానికీ, డాక్టర్ ఖరే చెప్పేదానికీ వ్యత్యాస మున్నది. కాంగ్రెసు రష్యా అభిమానంగాని, అమెరికా అభిమానంగాని సంపాదించలేకపోయిందని హేళన చేస్తాడు ఖరే. రెంటికీ దూరంగా ఉండమంటాడు భోపట్కర్. హిందూమహాసభలోకి ఇతరవర్గాలని చేర్చుకోవాలని ఖరే; ప్రజాస్వామిక వర్గాలను కాంగ్రెసుకు ప్రతి పక్షంగా సంఘటితపరచాలని భోపట్కర్. మొరదాబాద్ మహాసభలో జరిగిన తీర్మానంగురించి మహాసభ అగ్రనాయకులలోనే అభిప్రాయ భేదాలున్నాయి.

రాజకీయాధిపత్యం కోసం సిక్కు అతివాదులతో చేతులు కలిపినప్పటినుంచీ ఉభయమతాలవారికీ అభేదమని చెబుతున్న హిందూమహాసభకు సేట్ రామకృష్ణ దాల్మియా అమూల్యమైన సలహా ఇచ్చాడు: కాంగ్రెసులో లాగ స్వార్థం పెట్టుకోవద్దని!

—రావు

# జపాను జర్మనీల భవిష్యత్తు

## "మీ తో మా కు పని లేదు"

ఇటీవలనే ఒక నాడు టోకియో నగరంలో అమెరికన్ సైనికాధికారి ఒకడు, కర్నల్ హోదాగలవాడు, కారులో వెళుతూ ముందున్నకార్లు నిలవటంచేత తానుకూడా నిలిచిఉండగా కాలినడక మీదనున్న కొందరు జపాన్ కాలేజివిద్యార్థులు ఆయనను పలకరించి ఏదో అన్నారు. ఆయన నవ్వుతూ తాను కూడా ఏదో అని వాళ్లకి చెయ్యిఊపి కారు కదిలించుకుపోయినాడు.

ఆ విద్యార్థులు జపానుభాషలో అన్న మాటలు కర్నలుగారికి అర్థమైనట్టులేదు. కాని ఆయనవెనకే మరోకారులో పోతున్న అమెరికన్ పత్రికావిలేఖరికి అర్థమైనాయి.

"నువు కొరియా ఎందుకు వెళ్లలేదు. నువ్వూ, నీవంటివాళ్లూ జపానుకు అవసరం లేదు." అన్నారు విద్యార్థులు. విలేఖరి వారిని ఇదేమిటని అడిగితే, వారు ఎదురు ప్రశ్నలు వేశారు. జపానుతో సంధిచేసుకుని జపానుకు స్వతంత్రప్రతిపత్తి ఎప్పుడిస్తారు ? ఇది మూడవప్రపంచయుద్ధానికి ప్రారంభమా ?

ఈ సంఘటన రాజకీయపరిణామాలకు దారితీసేది కాకపోయినా రాజకీయ దిక్సూచీమాత్రం అవును.

అమెరికా ప్రపంచమంతటా స్థాపించనున్న కమ్యూనిస్టు వ్యతిరేకనాగరికతకుగాను సాగే సంఘర్షణలో జపాను వహించవలసి ఉన్న పాత్ర జపానుప్రజల కభిమతమైనదికాదు. దూరప్రాచ్యంలో అమెరికాకుగల యుద్ధస్థావరాలన్నిటిలోకీ గొప్పది జపాను. యుద్ధం చాలునని జపాను మిత్రమండలి పాదాక్రాంతమైననాటి నుండీ అమెరికాపాలకులు జపానులోని ప్రబలవర్గాలపట్ల ఎక్కడలేని సానుభూతి చూపుతూవచ్చారు. అమెరికా జపాను పునరుద్ధరణకోసం ఖర్చుచెయ్యటమేకాక తనకు జపానునుంచి ముట్టగల పరిహారాన్ని కూడా వదులుకున్నది. రాజకీయంగా జపానులోని ధనిక, ఉన్నత వర్గాలకు లాభించే వాతావరణాన్ని జనరల్ మకార్థర్ ఏర్పాటుచేశాడు. యుద్ధనేరస్థుల శిక్షలు -టోజో మొదలైనవారి ఉరిశిక్షలు- తగ్గించడంగురించికూడా కొంత ఆందోళనజరిగింది. ఒకవిధంగా టోజోవంటి అహంభావులు మరణించటం జనరల్ మకార్థర్‌కు మంచిదేఅయింది. వాళ్లు ఈయన పెత్తనం ఒక్కనాడు సహించిఉండరు.

అయితే జపానుప్రజలు శాశ్వతంగా అమెరికాచెప్పుచేతలలో ఉంటూ, అమెరికా ఆదేశంప్రకారం అస్త్రధారణచేసి అమెరికాలాభంకొరకు చావటానికి సిద్ధంగాలేరు. అందుచేతనే జపాను ప్రధాని యొషీదా మకార్థర్ పరిపాలనచాటున బాగుపడుతూ కూడా, పైకి "పునరస్త్రధారణ జపానుకేంతమాత్రమూ ఇష్టంలేదు," అంటున్నాడు. అయితే ప్రచ్ఛన్నంగా అస్త్రధారణ జరిగిపోతూనే ఉన్నది. నేపథ్యంలో జపానుసైనికబలాలు ఆయుత్తంచేయబడుతూనే ఉన్నాయి.

స్పెయినువంటి ఫాసిస్టుదేశాన్ని బహిరంగంగా తన ఆప్తవర్గంలో చేర్చుకున్న అమెరికా జపాను సైనికబలాలను రహస్యంగా తయారుచేయవలసిరావటానికి కారణం: అమెరికను ఇంకా పెరల్ హార్బర్ ఉదంతాన్ని మరిచిపోలేదు. కాని జపానువాళ్లు హిరోషిమా, నాగాసాకీలను మరిచిపోయినా రనుకోవటంకూడా పొరపాటే.

జపాన్‌తో చేసుకవలసిన సంధిఒడంబడికనుగురించి రష్యా అమెరికాలకు గల వ్యత్యాసాలు ప్రస్తుతపరిస్థితులలో పరిష్కారమయ్యేవి కావు.

## అమెరికా వైఖరి

జపాను సంధి ఒడంబడిక గురించి సమావేశం జరపడం విషయమై అమెరికా రష్యాకు హెచ్చరిక చేసింది. జపానుకు పూర్తి స్వాతంత్ర్యం ఇవ్వాలనీ, అస్త్రధారణ చేయడానికికూడా జపానుకు పూర్తి అధికారం ఉండాలనీ అమెరికా అన్నది. రష్యా ఈ హక్కునుగురించి అభ్యంతరం చెప్పింది.

జపాను, జర్మనీలు తిరిగి యుద్ధశక్తి సంపాదించరాదని రష్యా వాదించటంలో ఇతర అంతరార్థా లేమున్నా, ఆ వాదన శాంతికి అనుకూలంగానూ, లోగడ అగ్రరాజ్యాలమధ్య జరిగిన ఒప్పందాలకు అనుగుణంగానూ ఉన్నది.

కొన్ని కారణాలచేత- ఈ కారణాలను ముందు చూతాం - అమెరికా తనకు అనుకూలమైన షరతులపై జపానుఒడంబడిక జరపాలని తాపత్రయపడుతున్నది. రష్యా దీనికి ఒప్పుకోక సవాళ్లు వేస్తున్నది. అందుకని అమెరికా, "మీ రిట్లా కలిసిరాక పోయినట్లయితే మీకోసం సంధిఒడంబడిక వాయిదా వెయ్యం. జపానుతో యుద్ధం చేసిన దేశాలు విడివిడిగా సంధిచేసుకోగలవు." అని రష్యాను బెదరిస్తున్నది. ఇది అర్థంలేనిమాట. ఈ సంధిఒడంబడిక విషయంలో ఏకపక్షనిర్ణయం చేస్తున్నది అమెరికాయే గాని మరొకరు కారు. మీదుమిక్కిలి, చైనాను తాను గుర్తించనికారణంచేత ఈ ఒడంబడికతో చైనాకుగల సంబంధాన్ని అమెరికా తృణీకరిస్తున్నది.

## "నా క్షేమం జగత్కల్యాణం"

ఇంతకూ అమెరికాకు ఎటువంటి జపాను కావాలి? ఈ రహస్యాన్ని పెద్దవాడే బయటపెట్టాడు. 1945 మొదలు 1948 వరకు జనరల్ మకార్థర్‌కు కుడిభుజంగా పనిచేసిన లెఫ్టినెంట్ జనరల్ ఐఖెల్బర్గర్ ఈ పెద్దవాడు. ఆయన ఈవిధంగా అన్నాడు.

"ఇప్పటికే (నవంబరు కు ముందు) 30 వేల సైన్యాన్ని కొరియాకు ఆహుతిచేశాం. ప్రపంచభారాన్ని ఎక్కువగా మోసే మనకు ప్రబలమిత్రులు కావాలి. ఆస్ట్రేలియా, న్యూజీలాండులలో అంగబలం తక్కువ. బ్రిటను హాంకాంగులోనూ, మలయాలోనూ ఇరుక్కున్నది. ఫ్రాన్సు ఇండో చైనాలో ఇరుక్కున్నది. అందుకనే అనేకమంది జపానుసఖ్యం కోరుతున్నారు. మనకు ప్రపంచబాధ్యతలు

ఎక్కువవుతున్న కొద్దీ 8 న్నరకోట్ల జపాను ప్రజలసఖ్యం అవసరమవుతున్నది. వారు, శిక్షణ ఉంటే, సైనావారికన్నా, కొరియా వారికన్నా బాగా యుద్ధంచేస్తారు. జర్మనుల లాగే వారు కమ్యూనిస్టుబలాలతో సమ ఉజ్జీలుగా పోరగలరు"(!)

పైధోరణి అమెరికాపాలకుల స్వార్థాన్ని దాచ్చు లేకుండా బయట పెడుతున్నది. అమెరికా ప్రపంచమంతటా తన బావుటా ఎగరవెయ్యాలంటే యుద్ధం - ముఖ్యంగా కమ్యూనిస్టుదేశాలతో - చెయ్యాలి. దీనికి గాను బలాలు కావాలి. బలాలు ఎక్కడి నుండి వస్తాయి? పశ్చిమజర్మనీనుండీ, జపానునుండీ, అయితే జపానుకు మళ్లా కోరలువస్తే ఇంకోసారి కాటేస్తుందేమో? ఏమీ భయంలేదంటాడు మకార్థర్ మాజీ కుడిభుజం:

"కొరియాయుద్ధం ప్రారంభమైనప్పటి నుంచీ జపాను సహకరిస్తున్నది." (కొరియా యుద్ధంవల్ల జపానువర్తకులు రెండుచేతులా గడించారు. మకార్థర్ విమానాల దౌష్ట్యం ధర్మమా అంటూ.) "జపాను గడ్డమీదనుంచి మనబలాలు ఆసియా భూభాగంపైకి దండెత్తిగా, జపాను మనకు సరఫరాస్థావరంగా ఉపయోగపడింది. దానికి చరిత్రలో సాటిలేదు." (దీని అంతరార్థమేమంటే "ఆసియా ఆసియావాసులకే" నన్నినాదం వొదిలేసి జపాను "ఆసియా అమెరికాపాలకులకే" అని నినదించటానికి సిద్ధంగా ఉన్నదని!) "జపానుకు మూడో మార్గం లేదు - చేరితే రష్యాతో చేరాలి, లేదా ప్రజాస్వామ్య దేశాలతో చేరాలి. జపానువారు రష్యాను ద్వేషిస్తారు. వారిలో అమెరికాపట్ల అభిమానం నిర్మించబడింది."

ఈ అభిమానాన్ని జనరల్ మకార్థర్ ఏవిధంగా నిర్మించాడో, జపానులోని ఏవర్గాలలో నిర్మించాడో ప్రపంచం ఎరిగున్న సంగతే. అయితే అచ్చుగా రష్యాపై జపానుకుగల విద్వేషాన్ని నమ్ముకుని జపానును యుద్ధోన్ముఖం చెయ్యటం క్షేమమా? దాని కొక యుక్తి ఉన్నది.

"జపానుకు అంగబలమున్నది. నౌకలూ, రైళ్లూ, విద్యుద్యంత్రాలూ తయారుచేయగల పారిశ్రామికశక్తి ఉన్నది.... సబ్మరీనులూ, బాంబర్లూ, యుద్ధావసరముడిసరుకూ లేని జపాను పెసిఫిక్‌లోని మన మిత్రులకు, ముఖ్యంగా అమెరికాకు, ఇంతలో ప్రమాదం కలిగించలేదు."

అమెరికా ఆయుధాలిస్తుంది. జపానురవాణా వగైరాసౌకర్యాలిస్తుంది. జపాను వారు యుద్ధేంధనాలుగా ముందుకు వచ్చి పోరాడతారు—అదే అమెరికా ఆలోచన.

మకార్థర్ మాజీకుడిభుజం ఇంకా ఈ కింది మహోన్నత భావాలు ప్రకటించాడు:

"జపానుతో జరిగే సంధి జపానుఆత్మరక్షణకు విరుద్ధంగా ఉండరాదు. అప్పుడు మనం మనసైనికులను అక్కడినుంచి కదిలించి ప్రపంచంనలుమూలలా మన బలాన్ని మరింత బాగా ప్రతిష్ఠించుకునేలాగు ఇతర చోట్లకు పంపగలుగుతాం. మన అమెరికను సైనికుడు ప్రపంచంలోకెల్లా ఖరీదైనవాడు. జపాను సైనికులు కారుచౌక."

అమెరికా ఆశయాలూ, ఆదర్శాలూ, అమెరికాపాలకుల మనస్తత్వమూ, వారి భావికార్యక్రమమూ నిరూపించటానికి ఇంతకంటె మంచి ఆధారం ఉండబోదు. ఇదంతా చూసి జపానుప్రజలు ఎట్లా ఉత్సాహం పొందుతారో ఊహించటంమాత్రం కష్టం.

## జర్మనీ తథా

గత ప్రపంచ సంగ్రామం ముగిసి జర్మనీ మిత్రమండలికి లొంగిపోయేతరుణంలో తూర్పురంగంలో ఉన్న నాజీయుద్ధనాయకు లందరూ చేతులు చాచి పశ్చిమరంగానికి పరుగెత్తి బ్రిటిషు, అమెరికను సేనలకు చిక్కిపోయారు. ముందు ముందు తమను ఉద్ధరించగలవా రెవరో అప్పుడే వారికి తెలిసిపోయింది.

దూరప్రాచ్యంలో అమెరికా జపాను సైనికబలాన్ని నమ్ముకున్నట్టే యూరపులో జర్మనీని - పశ్చిమజర్మనీని - నమ్ముకొని అమెరికా ప్రపంచాధిపత్యానికి పడగ ఎత్తుతున్నది. రష్యా పైనబడితే తట్టుకోవటానికి గాని రష్యాపైన పడడానికి గాని తాహతుగల సమష్టి యూరప్ సేనలో జర్మనీకి తప్పక స్థానం ఉండాలన్నారు. ఈ విషయం బహిరంగంగా బ్రిటను, ఫ్రాన్సులచేత ఒప్పించటానికి చాలా తంటాలు పడవలసివచ్చింది. చాలా తిరుగుడుగా నిర్ణయాలు చేయవలసికూడా వచ్చింది.

ఒక జర్మన్ పారిశ్రామికుడు గర్వంగా అన్నాడు. "ఇప్పుడు వాళ్ళకు మన అవసరం తెలిసొచ్చింది. అప్పుడే వాళ్లు హిట్లరుమాట విన్నట్టయితే ఈవిధంగా కొరియాలో నానా భ్రష్టూ అయేవాళ్లు కారు. ఇప్పుడు నిప్పుల్లోనుంచి వాళ్ళ జీడిగింజలను మన చేత్తో తీసి పెట్టాలంటున్నారు," అన్నాడు.

పశ్చిమజర్మనీలో ఒకవర్గం ఈ పరిణామానికి ఆనందిస్తూకూడా బిర్రబిగిసింది. హెస్‌నగరాధ్యక్షుడు ఫ్రాంక్‌ఫర్ట్‌లో మాట్లాడుతూ, "మిత్రమండలి హైకమిషను రద్దు కావాలి," అన్నాడు.

"న్యూరెంబర్గువిచారణలో అవమానం పొందిన మన సేనాపతులకు మానపరిహారం జరిగితే గాని పునరస్త్రధారణ గురించి మాట్లాడనే రాదు", అన్నారు మరికొందరు పెద్దలు.

ఈనాజీ మనస్తత్వాన్ని అమెరికా పాటించి ఆటవిడుపులో ఉన్న నాజీనాయకులకు పని కలిగిస్తున్నారు. ఉత్తర అట్లాంటిక్ బలాలకు సర్వసేనానిగా నియమించబడిన ఐసెన్ హోవరును అమెరికాలో కొందరు తల్లులు, "నువ్వు నాజీసైనికులకు నాయకత్వం వహిస్తావా?" అని కన్నీటితో అడిగారు. ఎదటపడి సమాధానం చెప్పటానికి మొహంచెల్లక ఐసెన్ హోవర్, "నాదేముంది? ఏంచెయ్యమంటే అది చెయ్యాలి," అని సమాధానం చెప్పించాడు మరొకరిచేత.

## పశ్చిమ జర్మనీలో విభేదాలు

"పశ్చిమ రక్షణ బలాలలో జర్మనీని పాల్గొనమని పశ్చిమరాజ్యాలు కోరిన పక్షంలో... జర్మనీకి మిగతా దేశాలతో సమాన ప్రతిపత్తి ఉండేషరతుపైనా, ఈ బలాలు రష్యాదాడి అసంభవం చేయగల ప్రమాణంలో ఉండే షరతుపైనా పశ్చిమజర్మనీ ఒప్పుకుంటుంది." అని పశ్చిమ జర్మనీ అధ్యక్షుడు కొన్రాడ్ ఆడినొవర్ నవంబరు 8వ బోన్ పార్లమెంటులో ప్రకటించాడు. ఆఖరుక్షణంలో ఆయన పశ్చిమరాజ్యాల హైకమిషనరుతో గుసగుసలాడినమీదట ఈ ప్రకటన చేశాడు.

వెంటనే సోషలిస్టునాయకుడు కర్ట్ షుమాచర్ లేచి, చౌకగా అమ్ముడుపోయినందుకు అధ్యక్షుణ్ణి దుయ్యబట్టాడు. అయితే పునరాయుధధారణ చెయ్యటానికి జర్మనులకింకా ఇతరకారణాలు లేకపోలేదు. గత యుద్ధంలో జర్మనీ చాలా పెద్ద దెబ్బతిన్నది. ఆ దెబ్బతాలూకు విషఫలితాలింకా ప్రత్యక్షంగా, శిథిలమైన నగరాల రూపంలోనూ, మగదిక్కు లేకుండా పోయిన అనాథకుటుంబాల రూపంలోనూ కనుపిస్తున్నాయి. అదీకాక జర్మనీ అస్త్రధారణచేస్తే రష్యా దెబ్బతీయకుండా

(44 వ పేజీ చూడుడు)

వ్రాయ డెందుకు కవిరాజు గాడొక్కడూ
: కొరకు వాని ప్రెస్సు కొరకు వాని
అతను రచన చూచు ఆద్యంత మంత్యాది
. లేదు వాడె చదువు లేక వాడు

" వాణి మెలగు నేరి పాణి చలువ కోరి? "
" ? రాలు ఆట ఎవని రాలు అక్క "
" రాక్షసాల కెవడు రామభద్రుడు గాడు "
. ఎవడు అవడు-అన్న అవును అతడు

అతను యెవ డటంచు ఆర్ద్రాగ్ని గోళాలు
—కొండి వదలు రూక్ష లెండి వలదు
మనకు వాడు గాక మరియొక డుండునా?
: కుండు పార ప్రథమ లెండి వాడె

ఎవడు నాగ్గలట్టి ఏకైక పతియుతా
; సుండి వాడె ప్రెస్సు లెండి వాడె
కనుక వాడు మటుకు ఖచ్చితమ్ముగ జూచు
. కాని కొత్త రచన, కాని చెత్త

ఆ మృదూకృతాత్మ ఆత్మ సంతృప్తియే
, కాగ నాంది కింక కవిత నాదు
వ్రాయుచుంటి లక్ష్య లక్షణ స్ఫూర్తికి
. వెలది ఆట లాంటి విడుపు ఆట

ఆ ద్యం త ర హి తా !

చదువుకో గదోయి చంద్రార్క-శాశ్వతం
! వాడ పేర్చు లైపు వద్ద ప్రెస్సు

[ఈ పద్యాలు సరిగా చదవలేకపోతే 46 పేజీ చూడండి—సం]




నాకు కర్నాటకసంగీతమంటేనూ, అందులో ముఖ్యంగా త్యాగరాజ కృతులంటేనూ భక్తి కలిగించిన వ్యక్తి మా లలితపిన్ని ఒక్కతే. అదివరలో త్యాగరాజకృతులు చాలామంది పాడగా విన్నాను. ఎక్కువగా అయ్యర్లనోట విన్నానేమో, అవంటే నాకు పరమ అసహ్యం పుట్టుకొచ్చేది. 'శాస్త్రకట్టు' సంగీతమంటే సరిగమలతో ముడుతప్ప మరేమీ లేదనే దురభిప్రాయంలో పడ్డాను.

లలితపిన్ని నాకంటె రెండేళ్లు చిన్న. ఆవిడకి పెళ్లికాకముందు ఏడాది కొకసారైనా మా యింటికి వచ్చేది. మా యింట్లో వున్న పాతహార్మోనియం వాయిస్తూపాడేది మొదటి సారిగా నేను ఆమెనోటివెంట 'సంగీతజ్ఞానమూ భక్తివినా' అనే కృతి విన్నాను. లలితపిన్ని సంగీతం పాడుతుందని నాకు తెలియదు. ఆమె పాట వినేసరికి సంగీతమంటే ఇదని నాకు మొదటిసారిగా తెలిసింది. అదివరకు నే నెన్నోసార్లు విని విసుగెత్తిన కృతులే ఆమెకంఠంలో కొత్త అర్థాలు వ్యక్తంచేసేవి.

"పిన్నీ! ఇంత చిన్నతనంలో ఇంత గొప్ప సంగీతం ఎక్కడ నేర్చావు?" అని నే నడిగితే,

"నిజంగా అంత బావుందా నా పాట?" అని అమాయికంగా అన్నది.

నిజానికి ఆమెకా సంగీతం నేర్చుకుంటే వచ్చిందని నేను నమ్మను. ఆమెకి మా తాతగారు సంగీతంమేష్టరును పెట్టి వీణ నేర్పించారు. కాని ఆమె వేసే స్వరాలు, సంగతులు ఇదివర కెక్కడా నేను వినలేదు. అయినా ప్రతిస్వరం అదివరకే పరిచితం' సన్నిహితం అయినట్టుగా నాలో కరిగిపోయేది. తరవాత కొన్నేళ్లకి ఫిడేలునాయుడు

గారి గానం విన్న తరవాతగాని మా పిన్ని కంఠానికి సరియైన ఉపమానం దొరకలేదు.

ప్రతి వేసవికాలం సెలవులకీ మా అమ్మమ్మగారి వూరు వెళ్లేవాణ్ణి. చాలాసార్లు ఆరుబయట వెన్నెల్లో కూర్చుని ఆమె వీణవాయిస్తూ పాడుతుంటే విన్నాను.

"ఒరే నువ్వు పాడరాదురా, అస్తమానమూ నన్ను పాడమనకపోతే?" అని ఒకసారి నవ్వుతూ అడిగింది పిన్ని.

"సరిసరి, నువ్వు పాడింతరవాత గొంతెత్తటానికి ఎన్ని గుండె లుండాలి?" అన్నాను.

కాలేజీలో స్నేహితులముందు సినిమా ట్యూనులు పాడి గర్వపడే నేను మా పిన్ని ముందు కంఠమెత్తటానికి కూడా జడిసేవాణ్ణి.

"ఒక్క సినిమాపాట పాడరా, వినాలనుంది. ఆయ నెవరు సైగలా, ఎవరో? ఆయనపాట వినిపించు," అని బలవంతం చేసింది పిన్ని.

చివరికి పాడక తప్పింది కాదు. కాని రెండు చరణాలు పాడానో లేదో, పిన్ని పాట తలపుకు వచ్చి, సిగ్గుపడి ఆపేశాను.

"పిన్నీ! ఇప్పుడు కాదు. తరువాత చెప్తున్నా పాడతానులే. నీ పాట నా చెవుల్లో మోగుతున్నంతసేపూ నేను పాడటం అసాధ్యం," అన్నాను.

ఆమె పాడిన కృతులు సముద్రమంత విశాలమూ, అగాధమూ అయినవి. నా పాటలు పిల్లకాలవల్లాంటివి. పిల్లకాలవల్లో సౌందర్యం లేకపోలేదు. కాని సముద్రంముందు కాదు వాటి దర్పం.

మా పిన్ని కొంచెం చామనచాయగా వున్నా, కళా కాంతీ ఉట్టిపడే ముఖం. ఆమె ఎక్కడ ఉన్నా సరే ఆచోటుకి ఒక నిండు, శోభవచ్చేది. ఎక్కడో దూరాలను చూస్తున్నట్టుగా ఉండేవి ఆమె విశాలమైన కోలకళ్లు. బరువుగా అడుగులు వేస్తూ, నిదానంగా నడిచేది. మాటకూడా నిదానంగా, సౌమ్యంగా ఉండేది. ఆమెకి కోపంరావటంగాని, తొందరపడటంగాని నే నెప్పుడూ చూడలేదు.

ఆమె వ్యక్తిత్వంలోని గొప్పతనమంతా ఆమె సంగీతంలో ప్రతిఫలించేది.

ఆమె నాకంటే రెండేళ్లు చిన్నది కావటంవల్లనేమో మొదట్లో "పిన్నీ!" అని పిలుస్తుంటే ఏమిటోగా వుండేది. కాని ఆమె పాట విన్నప్పుడల్లా ఆమెదగ్గిర చంటిపిల్లడివలె అయిపోయేవాణ్ణి. ఆమెని ఆమె సంగీతంనుండి వేరుగా చూడలేకపోయాను. ఆమె కళాప్రతిభమీద నా కుండే ఆరాధన ఆమెమీదకూడా ప్రసరించేది.

సముద్రతీరాన ఒంటరిగా విశాలాకాశం కింద నిలబడినప్పుడు మానవుడికి తన అల్పత్వం గోచరిస్తుంది.

ఎప్పుడూ మే మిద్దరం కలిసి తిరిగేవాళ్లం. మా దొడ్లో జామచెట్టెక్కి ఆమెకి పళ్లు కోసిపెట్టేవాణ్ణి. సెలవులకి వచ్చినప్పుడల్లా ఏవో కథల పత్రికలూ, నవలలు తెచ్చి చదివించేవాణ్ణి. కొత్తగా చూసిన సినిమాకథలు, పాటలు వినిపించేవాణ్ణి. నాకు ఆమె కృతులు నేర్పేటట్టు, నే నామెకి సినిమాపాటలు నేర్పేటట్టు ఒడంబడిక చేసుకున్నాం. కాని నాకు ఆ స్వరాలు నోరు తిరిగేవే కావు. ఆమె నా సినిమా పాటల్ని ఎంత నేర్చుకున్నా ఎక్కడో కర్ణాటకబాణీ దొర్లేది. దాంతో మా ఒడంబడిక రద్దుచేసుకున్నాం.

## 2

నైజాములో ఏదో పల్లెటూరిసంబంధం వెదికి మా పిన్నికి పెళ్లి చేశారు.

ఆమెఅత్తవారు చాలా భాగ్యవంతులు. ఆమె భర్తకి పాతికేళ్లుంటాయి. కొత్తగా కరిణీకంలో ప్రవేశించాడు. సాంప్రదాయం గల కుటుంబమనీ, డబ్బున్నవాళ్లనీ మా తాతగారు ఆ సంబంధం చేశారు. లలిత పిన్ని ఆ మారుమూల పల్లెటూరికి కాపరానికి వెళ్లిపోయింది.

వెళ్లిన కొత్తలో ఆమెని అత్తవారు మూడు నాలుగు సార్లు పుట్టింటికి పంపించారుగాని తరవాత క్రమంగా మానివేశారు. నే నొకసారి కాలేజీనుంచి పెద్ద ఉత్తరం రాశా నామెకి "పిన్నీ! నీ సంగీతం ఎప్పటికీ మర్చిపోలేను; నీ కంఠంలాంటి కంఠం నాకు మళ్లీ వినబడలేదు. నువ్వు నా ఆరాధ్యదేవతవి," అని. ఆ కవర్లో నే నా అడ్రసు రాసి మరోకవరు కూడా వుంచాను, ఆమె సమాధానం రాయటానికి పనికొస్తుందిగదా అని. దాని కామె సమాధానం రాయలేదు అప్పటికీ, యిప్పటికీ.

నాలుగైదేళ్ళతరవాతగావును, మాఅమ్మ ఒకసారి చెప్పింది పిన్ని సంగతి.

"విన్నావురా? లలితమ్మని దాని అత్తారు నానాబాధా పెడుతున్నారుట."

"ఏం, ఎందుకూ?" అన్నాను ఆశ్చర్యపోయి.

"ఏమో మరి. కొత్తలో దాన్ని బాగానే చూశారు. తరవాత వాళ్ల కేం పొయ్యేకాలం వచ్చిందో మరి? పాపం 'లలితమ్మ ఆ లంకలో ఎన్ని కష్టాలు పడుతున్నదో? ఎప్పుడన్నా వెళ్లి చూద్దామంటే దగ్గిరా, దాపా?"

"నే నోసారి వెళ్లి చూసొస్తానే, అమ్మా! లలితపిన్నిని చూసి చాలా ఏళ్లయింది"

"సరేలే. నువ్వు వెళ్ళటంకూడానా! వాళ్లసలే దానిపై లేనిపోని అపనిందలు మోపి హింసపెడుతున్నారు. వీళ్ల అనుమానాలూ, వీళ్లూ విరగడైపోనూ," అని అమ్మ లోపలికి వెళ్లిపోయింది.

లలితపిన్నిని చూసి ఎన్నేళ్ళయింది? ఆమె నా ప్రపంచానికి ఎంత దూరమైపోయింది? ఎప్పుడో విని మరచిపోయిన ఆమె మధురకంఠపు జ్ఞాపకం ఇప్పటికీ నన్నెందుకిలా ఆరాటపెడుతుంది?

ఇంతకాలమైనతరవాత వెనక్కి తిరిగి చూసుకుంటే, ఆ చిన్నతనంలో జరిగిన సంఘటనలు మసకచీకట్లో నీడల్లా అస్పష్టంగా కళ్లకి కట్టి వేధిస్తాయి.

ఆమెపెళ్లి జరుగుతున్నప్పుడు నేను తీవ్రంగా గాయపడ్డాను. నన్ను లోకమంతా వంచించినట్టు, నాకొక్కడికే చెందిన ఒక అమూల్య వస్తువును ఎవరో దొంగిలించినట్టు, ఎందుకో ఆవేదనపడ్డాను. ఆమె అత్తవారింటికి వెళ్లినతర్వాత నా జీవితంలో గొప్ప వెలితి ఏర్పడ్డట్టు బాధపడ్డాను.

అది వైశాఖమాసం. నాకు మావాళ్లు పెళ్లి నిశ్చయపరిచారు. బంధువులందరికీ శుభలేఖలు పోస్టుచేశాము. లలితపిన్నిప్రసక్తి వచ్చింది.

"నేను వెళ్లి పిన్నిని తీసుకువస్తానమ్మా" అన్నాను మా అమ్మతో.

"ఎందుకురా వెళ్లటం? వాళ్లు పంపిస్తారా, ఏమన్నానా? శుభలేఖ వేస్తే సరిపోతుంది," అన్నది మా అమ్మ.

"కాదమ్మా! నేను వెళ్లి పట్టుబడితే వాళ్లు తప్పక పంపిస్తారని నా నమ్మకం," అన్నాను

నా కామెని పంపిస్తారని నాకు ఏకోశానా నమ్మకం లేదు. కాని యీ వంకతో

వెళ్ళి పిన్నిని చూసినట్టవుతుందికదా అని నా ఉద్దేశ్యం.

చివరి కెలాగయితేనేం మా అమ్మని వొప్పించి లలితపిన్నిని పిలుచుకురావడానికి బయల్దేరాను. ఆవూరు మా అమ్మమ్మగారి వూరికి నలభైమైళ్ళ దూరం వుంది. అడవుల్లో పడి, మట్టిరోడ్డుమీద, బండి కట్టించుకుని పోవాలి. మా తాతయ్యా, నేనూ కలిసి వెళ్లాం.

మా తాతయ్య బలే సర్దామనిషి. పూర్వకాలపువాడు కావటంమూలాన ఏ పది మైళ్లో తప్ప తక్కిన దూరమంతా చకచక బండివెనకాలే నడిచాడు. దోవపొడుగునా ఏవో కబుర్లు చెప్పి నన్ను నవ్వించాడు.

"తాతయ్యా! ఇక బండి ఎక్కరాదా?" అని నే నంటే,

"ఒరేయ్. ఇదో నడకట్రా? నా చిన్నతనంలో పాతిక ముప్ఫయి మైళ్లు చులాగ్గా ఒకరోజులో నడిచేవాణ్ణి. ఇప్పటికాలపు సన్నాసులు మీ రెందుకు పనికివస్తార్రా? పట్టుమని పది మైళ్లు నడవలేరు!" అన్నాడు.

## 3

లలితపిన్ని అత్తారూరు ఆ మర్నాటి మధ్యాహ్నానికి చేరుకున్నాం. ఎండ మంచి తీవ్రంగా వుంది. వడగాలి ఆ చెవినుండి ఈ చెవికి రివ్వున కొడుతోంది. ఆ పల్లెటూరి వీథుల్లో ఆ మధ్యాహ్నవేళ పిట్టయినా తిరగటంలేదు. నాగరిక ప్రపంచానికి ఎటు చూసినా యాభైమైళ్ల దూరంలో వున్న ఆ గ్రామపు దృశ్యం నాకు చెప్పలేని దిగులుపుట్టించింది. ఈ వూళ్లో లలితపిన్ని యిన్నాళ్లూ ఎలా నివసించగలిగిందా, ఆమె నిశ్చలమైన చూపులు ఇంకా అలానే అందరాని దూరాలకు చూస్తూనే వుంటాయా, అనిపించింది.

వెళ్లగానే లలితపిన్ని మొగుడు వాకిట్లో కనిపించాడు. మనిషి గాలికొట్టిన ఫుట్‌బాల్ బ్లాడర్‌లా, దొందగా వున్నాడు. కోరమీసాలు, నీరుకావిబట్టలు, నోట్లో చుట్ట అంతా పల్లెటూరి వాలకం. ముప్ఫయ్యేళ్ళ మనిషైనా నలభైఏళ్ల వాడిలా వున్నాడు. మామగార్ని చూడగానే ఆశ్చర్యం కనబరిచాడు.

"అమ్మా! మామగారొచ్చారు. కాళ్లు కడుక్కోటానికి రెండు చెంబుల్తో నీళ్లు తీసుకురా," అని కేకేశాడు నాకేసి తేరిపారచూస్తూ. "కొంచెం పనుంది, వెళ్లివస్తాను," అని మళ్లీ నాకేసి ఒకసారి చురచుర చూసి వెళ్ళిపోయాడు.

"అంతా క్షేమమా?" అని లలితపిన్ని అత్తగారిని మా తాతయ్య కుశలప్రశ్న వేశాడు. నన్ను ఫలానా అని తెలియజేశాడు.

"ఆ పెళ్లప్పుడు చూశాగా యీ అబ్బాయిని!" అని మూతి తిప్పుకుంటూ అన్నదావిడ.

ఇంతలో అయిదేళ్ల మగపిల్లడొకడూ, మూడేళ్ళ ఆడపిల్లా అక్కడికి వచ్చారు. తాతయ్య వాళ్లని దగ్గిరికి తీసుకుని, "వీళ్లనెప్పుడేన్నా చూశావురా?" అని నన్నడిగాడు.

"చూడలేదు. లలితపిన్ని పిల్లలేనా?"

"ఊఁ. మరింకేవ రనుకున్నావ్? ఒరే అబ్బి! ఆయ నెవరో తెలుసా?" అని తాతయ్య పిల్లవాడి నడిగాడు.

"తెలవదు." అన్నాడు వాడు.

"మీ అన్నయ్యరా ఆయన."

"నా కన్నయ్యేంటి? ఆయ నెవలో?" అన్నాడు వాడు.

నిజానికి ఆ పిల్ల లెవరో, నే నెవరో? వాళ్లకీ నాకూ ఏమిటి సంబంధం? వాళ్లకేసి చూస్తుంటే వెయ్యామడల దూరంలో నుంచున్నట్టుగా కనిపించారు.

ఇంతలో లోపలనుండి ఒకావిడ వచ్చింది, చంకలో చంటిపిల్లని వేసుకుని.

"ఏం నాన్నా! ఎప్పుడొచ్చావు? అంతా కులాసాగా వున్నారా? ఏమయ్యోవ్ నువ్వేనా? పెద్దవాడివయ్యావే? జ్ఞాపక మున్నానా?"

"అహా, జ్ఞాపకం లేకేం?" అన్నాను

కాని ఆమె ఎవరు? లలితపిన్నిపోలికలు కొద్దికొద్దిగా స్పష్టపడుతున్నాయి. మొహాన ముడతలు, లోతుకు పోయిన కళ్లు, వాటికింద నల్లటి చారలు, కుంగిపోయిన బుజాలు, పుల్లల్లాంటి కాళ్లు ఎత్తెత్తి వేసుకుంటూ... నా లలిత పిన్నేనా ఈమె? ఇలా గయిపోయిందేం? ఏడేళ్లనించీ ఏ స్త్రీరూపం నా మనస్సులో నిరంతరం నటించిందో ఆ లలితపిన్నేనా ఈమె?

నేను నిశ్చేష్టుణ్ణయి ఆమెకేసే చూస్తున్నాను. ఆమెని చూశాక నాకు పూర్వపు లలితపిన్ని ఎంత గుర్తుకుతెచ్చుకున్నా జ్ఞాపకం రావటంలేదు.

ఆమె చంకలోని చంటిపిల్ల కొత్తవాళ్లని చూసి కాబోలు కావురుమంది. అప్పటికి నేను తెప్పరిల్లాను.

"అదేమిటే, అమ్మాయ్! మరీ అంత నీరసించిపోయావ్?" అంటున్నాడు తాతయ్య.

"అబ్బే. ఏంలేదు, నాన్నా!" అన్నదామె.

"ఏమీ లేకపోవట మేమిటి? కిందటిసారి నేను చూసినప్పటికంటే బాగా చిక్కావ్, వంట్లో బాగుండలేదా?" అన్నాడు తాతయ్య. రెండు కన్నీటిబొట్లు ఆయన కళ్లచివరలదాకా వచ్చి ఆగిపోవటం చూశాను నేను.

"ఆ, ఏమోనండి! మీ పిల్ల వట్టి రోగిష్టిమనిషి," అని ఇంకేదో సణుక్కుంటూ అత్తగారు లోపలి కెళ్లిపోయింది.

నేనూ, తాతయ్యా దొడ్లో నూతిదగ్గర స్నానాలు చేశాం. పిన్ని అప్పటికప్పుడు మడికట్టుకుని మాకోసం వంట చేసింది.

భోజనాలదగ్గిర ఎవ్వరం మాట్లాడలేదు. తరవాత పిన్ని ఆకు వక్క చుట్టి నాకూ, తాతయ్యకీ యిచ్చింది. ప్రయాణంబడలిక మీద వున్నామేమో, వసారాలో మంచాల మీద వళ్లు వాల్చామో లేదో సుఖమైన నిద్రపట్టింది.

సాయంత్రం ఆరుగంటలకి కొద్దిగా చల్లపడింది. నేను బట్టలు వేసుకుని ఊరిబైటకి షికారుగా వెళ్లాను. ఊరంతా పూరిగుడిసెలే. పెంకుటిళ్లు అరుదుగా కనిపించాయి. నేలంతా ఎర్రదుమ్ము. ఆ వూళ్లోవాళ్లు ఇస్త్రీబట్టలు వేసుకున్నవాళ్లని ఎప్పుడూ చూసివుండరేమో, దోవపొడుగునా నిలిచి వింతజంతువుని చూసినట్టు చూశారు నన్ను.

ఆరాత్రి భోజనాలదగ్గిర మా తాతయ్య మేము వచ్చిన సంగతి చెప్పాడు. నా పెళ్లికి అందర్ని రమ్మని అడిగాడు.

"మా కెక్కడ వీలుకుదురుతుందీ రావటానికి" అన్నది అత్తగారు.

"పోనీ లలితపిన్నినైనా పంపించండి. పెళ్లికాగానే ఎవరమన్నా వచ్చి దిగబెడతాము," అన్నాను నేను.

"ఆ, అదెక్కడ వస్తుందిలే. జబ్బుమనిషి, చంటిపిల్లతల్లి," అందావిడ.

మా కింక ఏమనాలో తోచలేదు. తలుపుచాటునే నుంచుని వుంది పిన్ని.

"ఆర్టై రోజు లుండను, అత్తయ్యా! పెళ్లి అయినవెంటనే వచ్చేస్తాను. మా అక్కయ్యని, పిల్లల్ని చూసి చాలా ఏళ్లయింది," అన్నది బెరుకుగా.

"ఊఁ, వెడతావు; మా చక్కగా వెడతావు. నీ పాడుమొహం పెటుకుని అక్క

డికి వెళ్లకపోతే వచ్చిన నష్టమేమీ లేదులే. చూశావుగా నువ్విన్నాళ్లూ కలవరిస్తున్న మీ అక్కయ్యకొడుకుని," అని కసిరాడు పిన్ని మొగుడు.

పక్కన పెద్దవాడు, మామగారు ఉన్నారన్నైనా ఆలోచన లేకుండా ఆ మాట లన్న వాడిని పీటపెట్టి నెత్తి పగలగొడదామా అన్నంత కోపం వచ్చింది. అన్నందగ్గిర్నించి లేచిపోవా లనిపించింది. మా తాతయ్య 'శాంతించు' మన్నట్టు నాకేసి చూశాడు. పిన్ని తలుపుచాటునించి అవతలికి వెళ్లిపోయిన చప్పుడు వినిపించింది.

భోజనాలు అయినాయో లేదో పిన్ని మొగుడు చెప్పులుతొడుక్కుని కర్రపట్టుకుని ఎక్కడికో వెళ్లిపోయాడు.

పిన్ని నాకూ తాతయ్యకీ దక్షిణపువేపున మల్లెపందిరికింద పక్కలు వేసింది. తాతయ్య వీధిఅరుగుమీద చుట్ట కాలుస్తూ మా బండి తోలుకొచ్చిన వెంకన్నతో మాట్లాడుతున్నాడు. నేను పందిరికింద మంచంమీద పడుకుని, ఎర్రగా నిప్పుముద్దలా, కళా కాంతీ లేకుండా ఉదయిస్తున్న తదియచంద్రుణ్ణి చూస్తున్నాను. మల్లెచెట్టు విరగబూసింది. కన్నీటిబొట్లలా అప్పుడప్పుడు బాగా విచ్చిన పువ్వులు నామీద రాలుతున్నాయి.

మరచెంబులో నీళ్లు తీసుకుని పిన్ని వచ్చింది. తలవేపున చెంబు పెట్టి తాను తాతియ్యమంచంమీద కూర్చుంది.

"పిన్నీ! నువ్వు వచ్చెయ్యి. వీళ్లేమన్నా సరే, నేను తీసుకువెళ్లదలుచుకున్నాను," అన్నాను.

"ఎల్లా రమ్మంటావయ్యా, వాళ్లు వద్దంటూంటే? పట్టుకు లాక్కెళతావా?" అన్నది నీరసంగా, రాని నవ్వు తెప్పించుకుని.

"పిన్నీ! ఎందుకిలాగైపోయావ్ నువ్వు?"

"ఏంచేస్తాను, నా ఖర్మ! ఏ జన్మలో ఏం పాపం చేసుకున్నానో యీ యింట్లో పడ్డాను."

"కాదు, పిన్నీ! ఇది నీ పాపం కాదు. దీనికి బాధ్యత పూర్తిగా తాతయ్యదే."

"ఆయన తప్పేముంది? పెళ్లిచేసినప్పుడు కలగన్నాడా, వీళ్లిట్లాంటివాళ్లని?"

"నువ్వు ఇంకా సంగీతం పాడుతున్నావా, పిన్నీ!"

ఈ ప్రశ్న వినగానే ఆమె మొహం మరోవైపుకి తిప్పింది. ఆ గుడ్డివెన్నెల్లో ఆమె జొటజొట కన్నీళ్లు కార్చటం కనిపించిది.

"ఎందు కేడుస్తున్నావు, పిన్నీ!"

ఆమెకి దుఃఖం పుక్కిలింతలుగా వచ్చింది. వెక్కి వెక్కి బిగ్గరగా ఏడ్వసాగింది.

"ఊరుకో, పిన్నీ! ఇంట్లో వాళ్లు వింటారు," అన్నాను, నా కళ్లనీళ్లు తుడుచుకుంటూ.

ఆమె ఏడుపు నాపింది కాస్సేపటికి—

"ఇన్నేళ్లలోనూ నన్నీ ప్రశ్న అడిగినవాడివి నువ్వొక్కడివే. అందుచేత ఏడుపు నాపుకోలేకపోయాను. నేను ఇక్కడికి కాపరానికొచ్చేటప్పుడు నా వీణ తెచ్చుకున్నాను. జ్ఞాపకం వుందా?" అన్నది.

"అవును. జ్ఞాపకముంది. ఆ వీణని ప్రాణంతో సమానంగా చూసుకునేదానివి కూడాను."

"దాన్ని మా ఆయన విరగ్గొట్టిపారేశారు. పాడుతున్నట్టు వినిపిస్తే గొంతు పిసికిచంపేస్తానన్నారు. నాకు సంగీతంరావటం వాళ్లకిష్టంలేదు. ఒకటి రెండు సార్లు నేను పాడుకోబోయాను. 'భోగందానిలా ఆ పాటలేమిటే?' అని మా అత్తగారు నన్ను గదమాయించి పాటలు మానిపించారు. ఇప్పుడు నాకు సంగీతంమీద ఇదివరకటి శ్రద్ధా లేదు, పాడుకునే ఓపికా లేదు," అన్నది పిన్ని నిస్పృహగా.

"పిన్నీ! ఒక్కమాట అడుగుతాను, కోపం రాదుగదా?"

"ఏమిటది?"

"నీమీద ఏవో అపనిందలు వేశారుట, నిజమేనా?"

"ఆ, అవన్నీ యిప్పుడెందుకులే?"

"కాదు, చెప్పు పిన్నీ. నిజమేనా?"

"నువ్వు కొత్తలో ఉత్తరం రాశావు చూడు. ఆ ఉత్తరం మా ఆయన చూశారు. దాంతో అనుమానపడి నన్ను నానా మాటలూ అని కొట్టారు. ఆ తరవాతకూడా ఊళ్లోవాళ్లతో లేనిపోనివి కల్పించి బాధపెడుతూనే వున్నారు. ఏ పాపమూ ఎరక్కపోయినా నాకీ అపనిందలు తప్పలేదు. ఇక నా బతుకంతా యిలాగే తెల్లవారిపోవలసివుండేమో?"

రెండు నిమిషాలసేపు ఎవ్వరం మాట్లాడలేదు.

"నే నా వుత్తరం రాయడం చాలా తెలివితక్కువే. నా పొరపాటు క్షమిస్తావా, పిన్నీ?"

"ఇందులో నువ్వు తెలిసి చేసిందేముంది, క్షమించటానికి? అప్పుడు నా పెళ్లిలో నువ్వు అస్తమానమూ నా కూడాకూడా తిరిగేవాడివి జ్ఞాపకం వుందా? అప్పుడే మా ఆయన తల్లితో అన్నారుట, 'ఎవరా అబ్బాయి, పోకిరీమొహం వేసుకుని దాని వెంట తిరుగుతున్నాడు?' అని."

"పిన్నీ! నువ్వెంత కాదన్నా, నీ కష్టాలకు కొంతవరకు నేనుకూడా కారణమైనట్టు తోస్తున్నది. నిన్నీ నరకంలోనుంచి ఎలా రక్షించగలనా, ఏం చేస్తే నీ కష్టాలు గట్టెక్కుతాయా అని వేదనపడుతున్నాను."

"సర్లే, నువ్వేం చేస్తావు నాకోసం? నువ్వు రేపు లక్షణమైన పిల్లని చేసుకోబోతున్నావు. నువ్వు సుఖంగా వుంటే నాకదే చాలు. ఈ పిల్లల్ని చూసుకుంటూ ఇలాగే కాలం గడుపుతాను."

"ఎంత మారిపోయావ్, పిన్నీ! మన చిన్నప్పటిరోజులు తలుచుకుంటే ఏడుపు వస్తున్నది. ఆ సుఖదినాలు మళ్లీ ఎప్పటికన్నా వస్తాయా? నీమీద నాకు అంత గౌరవం కలిగించింది నీ సంగీతమే. నీ కంఠంలో అప్పటి అమృతపు నదులు ఎక్కడ యింకిపోయాయి? అప్పుడు పాడేదానివి, 'శ్రీరామపాదమా! నీ కృప చాలునే' అని అమృతవాహినిరాగంలో ఒక కృతి. జ్ఞాపకం వుందా? ఆ ఒక్క ముక్క అనవూ, వినాలనుంది."


"సర్లే. ఇప్పు డేమిటి? అవన్నీ ఎప్పుడో మర్చిపోయాను," అన్న దామె.

ఇంతలోకే అత్తగారు "ఓ లలితమ్మా! ఎక్కడున్నావమ్మా తల్లీ!" అని కేకేసింది. పిడుగుపడ్డట్టు ఉలిక్కిపడ్డాం యిద్దరమూ. పిన్ని లేచి వెళ్లిపోయింది గబగబ, కాళ్లు ఎత్తెత్తి వేసుకుంటూ.......

నాకా రాత్రి నిద్రపట్టనేలేదు. తెల్లవారుకట్ట ఏ గంటో నిద్రపోయివుంటాను. లేచేసరికి పక్కమీద ఒత్తుగా మల్లెపువ్వులు రాలి వాడి నలిగిపోయివున్నాయి. అవన్నీ ఏరి పొట్లంకట్టి నా సంచీలో పదిలపరిచాను.

పొద్దున్నే మొహం కడుక్కుని నేనూ, తాతయ్యా బండికట్టుకుని తిరుగుముఖం పట్టాము. ముసలాయన ఆ ఒక్కరోజులోనే నెలరోజులు లంకణాలుచేసినవాడల్లే

(15వ పేజీ చూడుడు)



# పాలెంలో బొమ్మలాటలు

రచన:

**శ్రీ మా. గోఖలే**

ఎంకటసుబ్బయ్యగోరి బుడ్డజీతగాడు నూరాయి నెత్తిన కండువా ఏసుకుని ముక్కు ఎగదోసుకుంటూ లోన ఏందేందో గొనుక్కుంటూ సత్రంకాడ రావి సెట్టు దగ్గిర కొచ్చే తలికి ఆడ తోలుబొమ్మలాట పందిరి అప్పుడే లెగిసి కూకుంది. పందిరి అట్ట సూసీ సూడక తలికే నీలకుండ పగిలి నీలు కార్నట్టు నూరాయి పానం అటనే దిగజారి పోయింది.

అసలు నూరాయి యిసుమంటి బొమ్మలాటలు సూసేపద్దతే వేరు. బొమ్మలాట ఆడే నాటికి పద్దినాల ముంగల బలానిదినం బలాని పోట, బలాని మటావోరు, బలాని తోల్బొమ్మలాట ఆడ్తారని వూరికి ముంగల నూరాయి పెతోరికీ సెప్పాల. ఆ మయిన మటావోరు వూళ్లో కొచ్చి దిగినాక ఆ రందర్నో పరాసికాలాడ్తా, దగ్గిర దగ్గిర తిరిగి పందిరి ఏసేయాలా, బొమ్మలాట మొదలు కాట్టేముంగలా కుర్రసంచును పందిరి సాయలకు రానీకుండా ఓ కోపు కాత్తా, మద్దె మద్దె మటావోర్కి వుసా రెక్కిత్తా వుండాల. అసుమంటి పద్దతి యిప్పుడు పెడదిరిగింది.

ఎప్పుడో పద్దినాలకి ముంగలే తెల్సింది నూరాయికి నాంచారిమటా వొచ్చి పాలెంలో సత్రంకాడ రావిసెట్టుకింద బొమ్మలాట ఆడబోతుండారని. ఈ సమాచారం అట్ట తెల్సిందో లేదో ఎంటనే నూరాయి గెహించాడు. అయ్యతనిని ఎంకటసుబ్బయ్యగోరింటో జీతానికి కుదురుస్తా ఆరి గొడ్డ సాయిట్నో గొడ్డతో బాటు కట్టేసి పొయ్యాడని:

కన్నీకటి పడే యాలకి పుగాకు పాయలు సీల్సుకుంటూ ఎంకటసుబ్బయ్యగోరు పాలెంలో బొమ్మలాట యవారాలేందో యిశారిద్దామని బయలెల్లి అట్ట ములుపు తిరిగాడో లేదో నూరాయి గొడ్డ సాయిట్నొంచి సల్లగా జారి సత్రంకాడి కొచ్చి నిలబడ్డాడు.

తెల్లారి నాంచారి మటా సెరువుగట్టు మీనకుండా పాలెంలోకి రాటం గొడ్డ సాయిడి గోడెక్కి ఎప్పుడో సూశాడు నూరాయి. ఇంకూసేపటికి నాంచారి మటా బాపనయ్య బజార్లో కొచ్చి వొత్తావుంటే ఎనికత్తే కొండాయ్, కోటాయ్, కాంతాయ్, రంగాయ్ రత్తాయ్లో బాటు జడెగిర్కుంటా సీతాయి రాటం సూసిన నూరాయి సాయిడి సూరుకు అటనే కరుసుకు బొయ్యాడు.

నాంచారి మటా పాలెంలోకి జేర్నిట్టు తెలిసి మోత లెగిసి పోతావుంటే. యీడ గొడ్లసాయిట్లో సందేలదాకా సెవకేత్తా కూకుండ నూరాయికి ఎంకటసుబ్బయ్యగోరు అట్ట ఎల్లి సందు తిరగనే తిరిగే తలికి కూతకూసి యలకాడ కొచ్చి పట్టెట్టు సత్రం కాడికొచ్చి పడ్డాడు.

అయితే ఏం—పందిరి అప్పుడే లెగిసి కూకుందది. తన సెయి తగలందే ఆ పందిరి లెగిసి కూకుందది! ముందనించి దారి దప్పిన దూడకి మల్లే బందిరి సుట్టూతా సూత్తుండ నూరాయికి పందిరికి కాత్తే పెడగా కోపు గాసిన పోలీసులకి మల్లే కొండాయ్, కోటాయ్, కాంతాయ్, రంగాయ్, రత్తాయిలు సోల్పున నిలబడుంటం వయినంగా అగుపించింది. ఒక్కపాలి యీపుమీన ఖురదమట్ట పాకి నట్టయింది నూరాయికి.

అయ్య తనని ఎంకటసుబ్బయ్యగోరి గొడ్డసాయిట్నో కట్టెయ్యకనే బోతే తన కన్న ముంగలగా కొండాయి మటా ఆవజాన ఆడ నిలబడుండేగేనా!

"ఆర్నీ నూరాయ్!" అని అరిశాడు కొండాయి.

"ఆర్నీ నూరాయ్!" అనరిశారు కోటాయి, కాంతాయ్, రంగాయ్ రత్తాయిలు.

"ఆళ్లదే యీడ పెత్తనం. తనని ఖదామడ ఎనిక్కి నెట్టారాళ్లు." అనుకుండాడు నూరాయి.

"ఓరి రార్రార నూరాయోవ్!" అనరిశారు కొండాయిమటా.

"ఆళ్లెయ్యాళ్ళ ఆళ్లని యీడికి బోతానంటే ఆడకి పోనిత్తారు. ఆళ్లెయ్యాళ్ళ మంచోళ్లు" అనుకుండాడు నూరాయి.

"ఇంటి కెల్లి యిప్పుడే వొత్తా లేరా!" అంటా నూరాయి అట్ట ముంగలికి ఒక్క అడుగు ఏశాడో లేదో లంబాడి కోట్టు పక్కనించి కడ్డీకి మల్లే వొత్తుండ ఎంకటసుబ్బయ్యగోరు అట్ట అగుపించే తలికి యిగ అట్టనే ఎనిక్కి తిరిగి లగత్తిన లగత్తడం రత్తమ్మ సందు ములుపుకాడి కొచ్చి పడ్డాడు నూరాయ్.

"ఒరేయ్?" అంది ములుపు మొత్తనుండ ఆ యిగ్రహం.

"అమ్మ సత్తిన్రో రయ్యో-" అంటా అటనే ఆ యిగ్రహం మీన్నకు వొరిగాడు నూరాయ్ సేకట్లో ఏది ఏదయిందీ తెలవక.

"అమ్మ సంపావురా నూరాయో." అందా యిగ్రహం నూరాయిని గట్టిగా వాటేసుకుంటూ.

"ఎవురూ?" అన్నాడు నూరాయి యిగ్రహం జడ సేతికి తగిలే తలికి కాత్తే తెప్పరిల్లుకుంటా.

"సీతాయిన్రా నేనూ, సంపితివి గదంట్రా నూరాయ్."

"సీతాయ్? నువ్వేనంటే?"

"నేనేరా నూరాయ్."

"ఆసి నువ్వేనంటే నిజంగా? అడలుకు సత్తిని గదంటే దెయ్యం పీకనే పీకిందనీ–"

"ఛీ సచ్చినోడా అరవమాక."

"అరవన్లేయే సీతాయ్, ఇదిగో, ఏందే ను వీృడ సేత్తుండడ్ ?"

"నువు అట్నుంచి లగెత్తుకురాటం నూసి యీడ యిట నిలబడ్డాన్నూ, ఆ మైనవొచ్చి నాట యినిపిచ్చుకోకుండానే మీదబడ్తివి."

"సంపావుగదంటే."

"సాల్లే వూరోక్క - యింకా మీనబడే, నూపయ్య పాపం"

"తెలవలేదు లేయే సీతాం- దెబ్బ తగిలిందంటే! పోనీలే. మరి యెందుకే మూలనుంచుండావూ ?"

"నీ కోసమే రా"

"నా కోసమంటే?"

"అవున్రా"

"ఎందుకే నా కోసం?"

"ఒరే నూరాయోవ్, సే బొమ్మలాట కెల్తుండాగా!" అంది సీతాయి.

"ఏందీ ? అన్నాడు నూరాయ్.

"నే నాంచారయ్య బొమ్మలాట కెల్తుండాగా! మా జేజి నన్ను తీసికెల్తా నంది!" అంది సీతాయ్,

"నిజింగా నంటే?"

"నిజంగా నేరా. కావాలంటే మాజేజి నెల్లి అడుగు. తెల్సుద్ది"

"మీ అయ్య ఎల్లమన్నాడంటే?"

"మా అయ్యా, మా అమ్మ అంతా ఎల్లమన్నారు నన్ను"

"పోనీలేవే సీతాం, నీ కేం, నువు ఎట్టన్నా ఎల్తావు."

"అదేందిరా నూరాయ్! మరి నువ్వు గూడా రాటంలేదంట్రా ?"

"మా అయ్య నన్ను పోనీయడు."

"ఎందుకని పోనియ్యడ్రా మీ అయ్య నిన్ను ?"

"ఎంకట సుబ్బయ్యగోరి గొడ్డసాయిడి యిడిసి రావద్దంటాడు."

"అదేందిరా ? బొమ్మలాటన్నా నూడనియ్యడంట్రా మీ అయ్య?"

"నీకు తెలవదులేయే. మా అయ్య సంగతీ"

"మొదులు నీ వడిగా వంట్రా మీ అయ్యనూ?"

నే నడిక్కోం. ఎందుకనమ్మ, నాలుగు తన్నించుకోనా?"

"వృత్తినే తంతా డంట్రా మీ అయ్యా"

"వృత్తినే ఏం తంతాడో తెలువదుగానీ- ఎట్టనబ్బా-?"

"ఎట్టనేందిరా ఎల్లి అడక్కు. మొదులు అడక్కుండానే ఎట్టనంటా వేం? ఒరేయ్ అంతమంది బొమ్మలాట నూత్తారు, నువు నూత్తే మీ అయ్య తప్పంటా డంట్రా?"

"అన డనుకో. మరి యీ ఎంకట సుబ్బయ్యగోరి గొడ్డ సాయిడి సంగతేమంటా?"

"అల్లుమటుకు రారంట్రా బొమ్మలాట నూడనూ?"

"ఎందుకు రారూ! అల్లోచ్చే నన్ను గొడ్డ సాయిట్లో పండుకో మంటారు."

"ఏందిరా అనేదీ, ఆరి గొడ్డసంగతి ఆరికన్న నీ కెక్కువెట్టా?"

"బలేదానివే యింకా నయం! అయితే నాకు డబ్బిచ్చి జీతానికి పెట్టుకుండది పని ఎగోట్ట మనెట్టా?"

"ఎవు రన్నారూ, రేత్తిరి గొడ్డు నిదర బోతుంటే నువ్వాడ దేనికంటారుగానీ ? ఒరేయ్ బొమ్మలాటన్నా నూడక బోతే యింగ నువేం మడ్సివిరా?"

"అదే నూత్తుండా. పేసీ వొత్తే ఎట్ట నబ్బా-?"

"ఎహా ఏం పేసీ రాదులే. ఒక్కపూట- అందుట్లో యిట్టాటి సమయంలో-ఎల్లి అడగరా మీ అయ్యనీ! మీ అయ్య మంచోళ్లేరా నాకు తెల్సా"

"ఏం మంచో నాకు తెలవటంలా-"

"సక్కగా మా జేజి వొళ్లో పొండుకుని, తెల్లార్లూ బొమ్మలాట నూత్తా" అంటున్నది సీతాయి.

"ఆఁ నూశావులే." అన్నాడు నూరాయి.

"రావణాయుద్దం సెబతాడంట నాంచారయ్య. అబ్బ! నువ్వు నైగాల్సిందే నంట! నాంచారయ్య అల్లుడు కేతిగాణ్ణి పడ్తే కడుపుబ్బిపోవాల్సిందే నంట! నాంచారయ్య పెళ్లాం బంగారక్కపాటలు బహు యిసురుగా పాడుద్దంట! సెన్నాపట్టందాకా మోత బుట్టిందంట నాంచారయ్య బొమ్మలాటంటే-" అనుకుంటున్నది సీతాయ్.

"ఇదిగో సీతాయోవ్-" అన్నాడు నూరాయ్ కొకబుట్టి.

"ఓరి పోరా; నీకన్న ఆ కొండాయోళ్లే నయం" అంది సీతాయి.

"యిదిగో! ఇయాల అర అర బొమ్మ దేవులు అడ్డాం ఒచ్చి నిలబడ్డాచరే, యీ నక్క నూరాయి బలాని సత్రంకాడ, రావిసెట్టు ఇవకాడ, ఏపసెట్టు వాలుకొమ్మ మీన కూకుని, నాంచారయ్యబొమ్మలాట గనక నూడక నేబోతే - హా రాభణా ! -" అంటా గిరుక్కున సెక్రం దిరిగినట్టు తిరిగి బఁయ్‌మంటా యింటేపు లగెత్తుకెల్లాడు నూరాయి? సీతాయి అటనే నోరు దెరుసుకు నూత్తుంటే.

ఆమయిన యియాల బొమ్మలాట యవారం ఐసా పైసా తేలవాల్సిందే ననుకుంటా వుసిమీన ఇంటికాడిదాకా వచ్చిన నూరాయి ఇంటిముంగల అరుక్కాడ అటనే జారిపొయ్యాడు అంతరిచ్చావ దారం తెగిన గాలిపటానికి మల్లే.

ఇంటో అయ్య వుండాడు. అమ్మ, అయ్యా ఏంగో జోరుమీన మాట్టాడ్తుండారు. యింగ అటనే అరుగుమొత్తకాడ సీకట్లో నక్కాడు నూరాయి.

"ఏందయ్యోవ్ పెట్టిలోంచి ఎర్రకండవా తీత్తుండావ్ ?" అంటుండది అమ్మ.

"తీత్తే తీశాక్లేం నువాడ కూకో. పతిదీ నీకు కావాల్సిందే నెట్టా?" అంటుండాడయ్య.

"పెతిదీ ఎవురిగ్గావాలా? రేత్తిరిపూట పెట్టెలో వుండ ఎర్ర కండవాతో ఏం పనొచ్చిందా అనడిగా, తప్పేట్టా?" అంది అమ్మ.

"ఎవుడన్నాడు తప్పనీ. దురగమ్మకు మల్లే అదేదో మూల కూకుండా వచ్చుంటే అపుడే తగుల్తుంటివి. వూరకనే పెట్టిలో వుంటే ఏసుకుంటుండా. కొనుక్కు తెచ్చుకుండది ఏసుకుంటానికి కాదెట్టా?" అన్నాడు అయ్య.

"ఏసుకుంటే ఎవురికేం బట్టిందీ. యిన్నాలనించి పెట్టెలో వూరకనే వుండదిగా. యీ రేత్తి రేం పనొచ్చిందీ?" అంది అమ్మ.

"బువ దిన్నాక ఎంకయ్య ఓ పాలి రామం టే ఎల్తుండాలే-సానా పనుందెది-నువ్వూరికే బురదమట్టి ఎగిరిన కైగరమాక" అన్నాడు అయ్య.

"బురదమట్టు గిరదమట్టు అనమాక. అయితే ఎంకయ్య ఎర్రకండవా ఏసుకుని గాని రావద్దన్నాడెట్టా?" అంది అమ్మ.

"ఎహె రమ్మన్నేదులే, రెక్కంప తగుల్తుంటట్టు తగుల్తుండావూ. పెట్టిలో సెదపురుగేమన్నా సేరిందేమోనని నూసి పానీగందా అని వూరకనే కండవా ఏసుకుంటే రాగం మొదులుబెట్టావే యిడవకురదా?" అన్నాడు అయ్య.

"ఆహాఁ అట్టనా-అయితే కూసేపుండు. నా ఆకుపచ్చ కోకన్గూడ సెద లేమన్నా పట్టినయ్యేమో నూడనీ-"

"సెదలేం పట్టలేదు గానీ ఇపుడు నీ కోకలు గీక లేం తియ్యమాక-అహాఁ-అదేందీ పచ్చకోక కట్టుకుంటుండదీ!" అంటున్నాడు అయ్య.

"వూరకనే కట్టుకుంటుండాలే. కోకలు కొనుక్కుండది కట్టుకుంటానిక్కాదెట్టా? వుంపెట్టా-" అంటున్నది అమ్మ.

"ఇదిగో - అదేందీ తలగూడ దువ్వ్వగ్గే ఇదిగో ఏందమ్మోవ్ నీ యవారం!" అంటున్నాడు అయ్య.

"యవారమా? సెబతాలే పద-"

"ఇదేంది -యీ ంకి అటుబోతావు తలుపు కాడికే?" అంటుండాడు అయ్య.

"ఎంకయ్యకాడ నాకూ పనంది. ఎల్దాంపదా" అంది అమ్మ.

"ఎంకయ్యా! ఎంకయ్య ఎవురూ? అయితే ఎంకయ్యని అట్టాంచు. ఇదిగో నమ్మోవ్ నువు బొమ్మలాట గిమ్మలాటకని పచ్చకోక గట్టి బయలెల్తుండావుగావాఁల మరదేందో-" అన్నాడు అయ్య.

"ఎంకయ్య ఎవురంటం కాడికొచ్చిందీ? అయితే ఎర్రకండవా ఏసింది బొమ్మలాట కాడికా అయ్యా? హుఁ అంత దొంగ సాటుగా ఎల్దాలొచ్చిందా అయ్యా! నాకు తెలవదనుకుండా నీ ఏసిగాలూ-వుండు తెల్లాగ్గెగు నేమావూరు మాఅమ్మ అయ్య కాడి కెల్లకబోతేనూడు. ఎల్లకబోతే నాపేరు దురగమ్మ కాదనాల్సిందే. ఎంతన్యాయం! ఎంత మాయా! అన్నీ దొంగమాటలే, అంతా బూటకమే! మామ్మా, మాఅయ్యే గనక వుంటే ఈ మడిసి ఇట్టా జెత్తాడూ - హుఁ హూఁ - అమ్మాఁ!"

"దురగమ్మతల్లీ యాడవమాకే నీకు దణ్ణం పెడతా, బుద్ధి గెడ్డి తిందిలేవే -"

"వుండూ-నన్నంటుకోమాకా-అమ్మా-"

"పెద్దగా అరవమాకే తల్లా - యీ సూరాయన్నా వొత్తే బాగుండు. యదవ రాడేం ఏ యాలకూ - బొమ్మలాటకెల్దాం యిగ వూరుకోవే -"

"ఏం అక్కర్లా నువే ఎల్లు ఎర్రకండవాతో, సూరాయి నేనూ ఎటుబోతే నీకేం"

"అహాఁ అదుగందుకే - ఎదవ పనే జేశా-యాడో గెజ్జల సప్పుడవుతుందే - యీ సూరాయి వొత్తే బాగుండు. దబ్బున బొమ్మలాట కెల్లొచ్చు - పాటలు యినొస్తుండయి మొదులు బెట్టలేదుగెందా - ఎవురా డా- సూరాయ్? ఏందిరా తలకాయి లోనికి బెట్టి అట్ట సూత్తుండావూ - చా యదవా-దబ్బున రామంటుంటే - ఎంకట్సుబ్బయ్యగోరితో సెప్పొచ్చావంట్రా?"

"మరే - ఆరు అటెత్తేనీ -" అన్నాడు సూరాయి లోనకొచ్చి అటనే గోడ కానుకుని యీపు రుద్దుకుంటూ.

"చా యదవా-" అంటున్నాడు అయ్య.

"ఆడిమీదకి లెగవమాక వుత్తపున్నానికి-యీ మూండదిరా నీగళ్ల సొక్కాయా - ఎల్లి ఏసుకోవేందిరా?" అంది అమ్మ కళ్లు ఆడిస్తూ.

"ఆ పెట్టెలో వుంది ఏసుకోలేరా దొబ్బనా?" అన్నాడు అయ్య.

ఆమయిన బయల్దేర్దం బయల్దేర్గం దాగ్లో అమ్మ, అయ్యల్ని సందు నూసుకుని సల్లగా దాటేసి, బొమ్మలాటపందిరికి అసంట ఆళ్ల జేజికాడ కూకుని అటిటు నిక్కి నిక్కి నూత్తుండ సీతాయి జడతోక ఎనకమాలే ఎల్లి గబిక్కిన ఓ గుంజు గుంజి, సెక్కలు, చీనారేకు డబ్బాలు దన్దనామంటూ కేతిగాడు, బంగారక్క తెరమీనకు వొచ్చే యాలకి, యీపసెట్టుమీన కూకుండ కొండాయిమటూను ఎడా పెడా తోసుకుంటూ ఎల్లి సెట్టుమయాన వాలుకొమ్మ మీన కూకుండాడు సూరాయి.

---

# లలితపిన్ని

(1౪-వ పేజీ తరువాయి)

అయిపోయాడు. బండిలోనే కూర్చుని, తల వంచుకుని కుమిలికుమిలి ఏడ్చాడు.

బండితోలే వెంకన్న అన్నాడు:

"తాతయ్యగోరూ! బంగారబొమ్మ లాంటిపిల్లని యీ రౌదవసచ్చినోళ్ల కిల్లా గిచ్చారండీ! మీ యల్లుడి వూసు ఈ వూళ్లో ఎత్తితే సాలు అంతా తిట్టేవాళ్లే. ఎప్పుడూ మాలగూడెంలోనే ఘుండలమ్మట తిరుగు తాడంట. ఒళ్లంతా గోనా లేనంట, నా యాలకి," అన్నాడు.

"ఒరే, నువ్వూరికే వాగబోకురా. అసలే ఆయన కష్టపడుతున్నాడు," అన్నాను నేను కోపంగా.

"నీకేం తెలుసుద్దయ్యా? నేను మీ తాతయ్యగోరింటో యింతప్పట్నించీ పని సేశా. ఆ పిల్ల ఎసుమంటి పిల్లో నాకు తెలవదనా? మాలచ్చిమంటి తల్లి. ఎన్ని కష్టాలు పడుతుండదో ఆళ్ల సేతుల్లో." అన్నాడు వెంకన్న. ఆ మాటలు విని తాతయ్య మరీ కుంగిపోయాడు.

## 4

ఎక్కడ త్యాగరాజకృతి విన్నా నాకు మా లలితపిన్నే జ్ఞాపకం వొస్తుంది. ఆమె సంగీతం గాని, కంఠం గాని ఇప్పుడు జ్ఞాపకం తెచ్చుకుందామన్నా జ్ఞాపకం రావు. పెళ్ళి కాకముందు ఎలా వుండేదో కళ్లు చించుకున్నా గుర్తుకు రాదు. కాని చంటిపిల్లని చంకన వేసుకుని ఎత్తెత్తి కాళ్లు వేస్తూ వచ్చి నన్ను పలకరించిన ఆ లలితపిన్నే జ్ఞాపకం వచ్చి మనస్సును రంపంకోత కోస్తుంది ఇప్పటికీ. ఆమెవ్యక్తిత్వానికి కేంద్రమైన వీణలాగానే ఆమెజీవితంకూడా భగ్నవీణ.

---

# వేమూరి వారి కోడలు



డికూసినప్పుడు లేచిన కామాక్షమ్మ గంగా దేవి మేలుకొలుపు పాటలు పాడుతూ చల్లచేయటము ప్రారంభించింది. నాలుగు బర్రెల పాడిగనుక అరగంటకు పైగా పట్టింది వెన్నతీయటానికి. వెన్న ముంత, పెరుగుకుండ ఉట్టిమీద సర్ది ఆమె పెరట్లోకి వచ్చేసరికి అరుణరాగాలతో బాల భాస్కరుడు తూరుపుదిశనుండి తొంగి చూస్తున్నాడు.

మిగతా పాచిపను లన్నీ కోడలికి వప్పచెప్పి, పెరట్లో పడమటిదిశగా ఉన్న జేమ చెట్టుదగ్గరకు వెళ్లింది కామాక్షమ్మ. ఆకుకూరల మడి చెట్లపాదులు వేసి శ్రద్ధగా నీళ్లు పోసి పెంచుతూ ప్రతిఉదయమూ వాటి అభివృద్ధిని చూసి ఆనందపడుతూ ఉంటుంది. చెట్ల నన్నిటినీ పరిశీలించి ఏదో ఒకటి కోసి ఆరోజు వంటలోకి ఉపయోగిస్తూ ఉండటమువల్ల చెట్లముఖము చూస్తేనేగాని ఆ పూట చేయ్యవలసిన వంటకాలు నిర్ణయమయేవి కావు. ఈ పాదులకు కొంచెమ వతల పెద్ద జేమచెట్టొకటి ఉన్నది. పిందెలు పడి కాస్త ఎదుగుతున్న దగ్గర

నుండే వాటిని కాపాడటము పెద్దపనిగా ఉన్న దామెకు. పిందెలు దోరకాయలుగా మారిన తరువాత రెండుదినాలక్రిందట నాలుగు గజాల బట్ట చింపి దృష్టితగులకుండానూ. చిలుకలు కొరకకుండానూ ఆ కాయలకు కట్టివేసింది. రోజూ తెల్లవారి లేవగానే కట్టిన బట్టలన్నీ సరి చూసుకుంటూ ఉంటుంది.

ఆరోజు బచ్చలికూర ఏరి పప్పులో వేయాలని చేట చేత పట్టుకొని మడిదగ్గరకు వెళ్లుతూ జేమచెట్టు వైపు దృష్టిని పోనిచ్చింది. చూసీ చూడటముతోటే ఆమెగుండె అదిరి పోయింది?

గతరాత్రివరకూ వంటయింటి వసారాలోకి కూడా స్ఫుటంగా కనబడ్డ జేమకాయలకు కట్టిన బట్టలు, ఇప్పుడామె కంటికి రెండు తక్కువనిపిస్తున్నాయి! తెల్లవారేలోపల జరిగిన ఈ పని ఎవరిదై ఉంటుంది? ఈ ఆలోచనలో ఆమె కనుబొమలు కలుసుకొన ప్రయత్నించాయి. ఆమె దృష్టి నిశితమై రెట్టింపువేగముతో గోడదాటి నైరుతిదిశగా ఉన్న సుంకరవారి పెంకుటింటి మీద పడ్డది.

నిముషము తడవులో కామాక్షమ్మ బయటికివినపడని మంత్రమొకటి పళ్ళుకొరుకుతూ జపించి- చేతి వేళ్లను లోపలికిముడిచి, ఒక చేతి కొకటి తాకిస్తూ పటపటలాడించింది.

ఆమె ప్రాణము ఉసూరుమన్నది. అనకాపల్లినుండి ప్రత్యేకముగా తెప్పించివేసిన జేము చెట్టుఅది. దాని కాయలు చిన్న కొబ్బరికాయలంత పరిమాణములో ఉంటాయి. తగిన ఎరువు వేస్తు, జాగ్రత్తగానీళ్ళుపోస్తూకామాక్షమ్మపెంచుతున్నదా వృక్షాన్ని. దాని మొదటికాపు ఇంటి యజమాని ఆఖరురోజులలో వచ్చింది. 'పెరట్లో కాసిన కాయగదా! ఆయనకు పెట్టకుండా ఎట్లా తినటమని ఆపేక్షకొద్దీ జబ్బుగా ఉన్న పెనిమిటికి ఎవరూ చూడకుండా పెట్టింది. ఆయన చనిపోయినతరువాత కొన్ని వస్తువులతోపాటు పెరటిలోని ఈ జేమచెట్టుకూడా ఆమెకు బహిఃప్రాణమయింది.

'ఇంతకూ ఎన్ని గుండెలు ఉండాలి... రాత్రి వేళ ఎవరూ చూడకుండా పెరట్లో ఉన్న జేమచెట్టుమీద చెయ్యి వేసి, గుడ్డ

(26-వ పేజీ చూడండి)



## 1-వ రంగము

కరణం చిట్టన్నపంతులుగారి చావిడి. చిట్టన్నపంతులు ఇటూఅటూ పచారు చేస్తూ ఉంటాడు. ఒడ్డూ పొడుగూ గల మనిషి; పడ్ఫింజలూ విరిచి కట్టిన పంచ, పైమీద తడిగావంచా, క్రాపూ, విభూతిపిండికట్లూ, మెళ్లో రుద్రాక్షతావళం, కుడిచేతిలో సిగరెట్టు;

ఎడంచేతికి రిస్టువాచీ, కలిసి కరణంగారికి ఒక వింత గాంభీర్యాన్నిస్తూ ఉంటాయి.

కరణం : (తనలో) ఏం చెప్మా బారికాడింకా రాలేదు. (అని పరకాయించి వీధి వేపు మాస్తూ ఉంటాడు)

(బారిక రాముడు ప్రవేశం. తలకి పాగా, చేతిలో దుడ్డుకర్ర ఉంటాయి. గోచీపెట్టి పైన తుండుగుడ్డ కడతాడు. కరణాన్ని సమీపించగానే నోట్లో చుట్ట తీసి, తల పాగాలో పెట్టుకుంటాడు)

రాము : దండాలు బాబు దండాలు.

కరణం : ఏం రా? ఒచ్చేవ్రా ? ఇప్పడైనా తీరుబడయిందా? ఈవాళ తాలూకా ఆఫీసులో సాగుబడిలెక్కలు దాఖలు

చెయ్యాలని చెప్పలే. ఝాంపొద్దెక్కింది. ఇంకెప్పుడు వెళతావ్.

రాము : సిత్తం. బాబయ్యా! సిత్తం. పెందలాడే ఒచ్చిందును బాబయ్యా! నిన్న రైతులుకాడికి మామూళ్ళ కెళ్లమన్నారు కాదండీ.

కరణం : ఆఁ ఆఁ మరిచే పోయేను. ఏమన్నారు?

రాము : ఆఁ ఏటుంది బాబూ! మాకీ మామూళ్ళివ్వవలసిన అవుసరం లేదన్రు.

కరణం : (కోపంతో ఆశ్చర్యంతో) నిజమే? నువ్వన్నమాట అక్షరాలా నిజమే?

రాము : (గంభీరంగా) నిజం బాబయ్యా ముమ్మాటికి నిజం. అచ్చరాలా నిజం. ఆళ్లిప్పుడు మునపటోళ్లా.

కరణం : (మండిపడుతూ) అయ్. మన పటివాళ్లు కారేం? పాతిపెట్టేస్తా. వెధవలు; ముష్టివెధవలు; గుండా చెరువానన్నెదిరించడానికి. చిట్టన్న పంతులు తడాఖా - హా - ఎరగరూ?

రాము : అలా గేదో తగలాలి బాబయ్యా, సిన్న సురక తగుల్తేగాని, ఎదవలకి బుద్ధిరాదు. మీ నాన్నగారి హయాంలో, ఇలాగే సేస్తే, పెంటలకేసు లెట్టేసి ఎదవల్ని పాతిపెట్టేసన్రు.

కరణం : ఛస్. అంతవర కెందుకురా. ఇప్పుడే నే నీ వెనకాలే వస్తున్నా; పద; ఎవడియ్యడో చూతాం.

రాము. రండి బాబయ్యా రండి; ఈ ఎదవల కొక సురక తగలాలి; నాన్నిద్ద గోవాల; ఎదవనుండాకొడుకులు నా మామూలుకూడా ఇవ్వరంట. (కొంచెం దూరంగా వెళ్లి నిలుచుంటాడు).

కరణం : (ఇంట్లోకి చూస్తూ) ఏమేవ్. ఇలా నేను వీధులో కెళ్ళొస్తా - కొంచెం సేపట్లో నే; తలు పేసుకో.

(కరణంగారి భార్య రంగమ్మ ప్రవేశం. ఒయ్యారం నడక; ఓరచూపు; బాగాడు జడ; చారడేసి కళ్లు. లావణ్యంతోడి చామనచాయ శరీరం; - ఆమె కొక వింత చక్కదనాన్ని కల్పిస్తాయి సామాన్యంగా చూస్తే ఆమె కొంచెం పొడుగైన మనిషే కాని, ఆ పొడుగే ఆమెనడక్కొక ఠీవి నిచ్చిందని చెప్పాలి.)

రంగమ్మ: ఎందుకండీ ఇప్పుడు వీధులోకి. ఒక్క గడియేనా ఇంటిదగ్గరుండరాదా? మీరు లేకపోతే అదోలాగుంటుంది.

కరణం: ఆఁఆ ఎందుకా భయం. నేనిప్పుడేగా ఒచ్చేది. ఇదిగో ఈ రైతువెధవలకి కొంచెం కళ్లు నెత్తిమీది కొచ్చేయిట. వాళ్ళ సంగతేదో కొంచెం చూసొస్తా. (మీసంమీద చెయ్యివేసి) చిట్టన్న పంతులు తడాఖా.

రంగ: అదేవిటండీ. తిండిలేక మలమల మాడిపోతూన్న ఆ రైతు లెందుకండీ పీడిస్తారు. వాళ్లు మీ కేం అపకారం చేసేరు. నిన్నగాక మొన్న T. S. O. గా రొస్తున్నారని భయపెట్టి, ఆరువందల రూపాయలు లంచానికి దండేరు. అందులో సగం మీరే కాజేసేరు. మళ్లీ ఇప్పుడు వాళ్లిళ్ళమీద పడితే, గోచిపాతరాయిళ్లు వాళ్లేమిస్తారు పాపం.

కరణం : (జాలిగా చూస్తూ) ఎంత అమాయకురాలివి. వాళ్లా గోచిపాతరాయిళ్లు! దొంగవెధవలు. అయినా ఇలాటి రాచకార్యాలు మాలాంటి వ్యవహారస్తులికిగాని నీ కెందుకులే. (దగ్గరగా వెళ్లి నవ్వుమొగంతో ఆమె చెక్కిలి పట్టుకొని) చూడు రంగూ! నాకీ ఆర్జనంతా ఎందుకు చెప్పు; నీ కోసమేగా. నువ్వు చక్కగా అలంకరించుకొని రంభలాగుంటే నా కదే ఆనందం.

రంగ: చాల్లెద్దురూ. మన ఆనందం కోసం ఒకళ్లని హింసపెట్టడం నా కిష్టం లేదు. అయినా ఆడదాని కానందం, బట్టల్లోనే నగల్లోనే వస్తుందా? మీ భ్రమ కాని.

కరణం : (రిచ్చపోయి) సరే; నువ్వు తలుపేసుకో. నేను త్వరలోనే వస్తాను. (నిష్క్రమించును. రంగమ్మ చురచుర చూస్తూ చరచర నడిచి లోనికి పోవును).

## 2 - వ రంగం

కరణంగారి ఇంటిముందర వీధి. కరణం, బారిక రాముడు నడుస్తూఉంటారు. కరణం మధ్యలో ఆగి,

కరణం : ఒరే రాముడూ!

రాము: (అదరిపడి) సిత్తం బాబయ్యా!

కరణం: నేను మూడో పెళ్లి చేసుకున్నా ఎంపిక మంచిదే చేసేనుకదరా?

రాము (పళ్లిగిలిస్తూ) అవును బాబయ్య! ఎంపికంటే ఎంపికా! మాణిక్కంనాంటి పిల్ల

కరణం (సంతోషంతో) అద్గదీ మాట. అలా తోవకి రా. కాని పాపం ఒట్టి అమాయకురాలు. ఈ రైతువెధవల నక్క వినయాలు, దొంగదండాలు చూసి మోసపోయి, వాళ్లు నిజంగా మంచివాళ్లని, దరిద్రులని, అనుకుంటూంది. ఈ వెధవల్నా - కందగింజ వేపేసినట్టు వేపేవాలి; నల్లిని నలిపేసినట్టు నలిపేవాలి. (మీసంమీద చెయ్యివేసి) చిట్టన్న పంతులు తడాఖా. హా.

రాము : అనాగే బాబయ్య! ఎదవలికి మా పొగరుబోత్తనం గుంది. ఆల కేటి? మాంతపైన కరువొచ్చేసింది. ఏది పండించినా దక్కే. ఇప్పుడు ఉద్యోగాలకంటె, యవసాయమే నాబం.

కరణం : సరి; దానికేం లే. ఈమారు ప్రొక్యూరుమెంటు బాగులేదని T. S. O. ని రప్పించి, మళ్ళీ డబ్బు గుంజుతాను. రేపు పోలీసువాళ్లని రప్పించి, వీళ్లిళ్లల్లో ధాన్యాలు దాచేసేరని సోదా చేయించి, హడావిడి చేస్తాను.

రాము : అదేటి అబద్ధవా బాబియ్య!, ఎదవలిళ్ళల్లో దాన్నాలు మూలుగుతుంటే గంజి తాగి, అడ్డకి పడ్డా, నాబాల కమ్ముకుంతన్నారు, చావుకార్లకి. దొంగ ఎదవలు.

కరణం ; పావుకారు మన చెప్పచేతల్లో వాడే. ఇంక వీళ్ళ కా — చూడు నా తడాఖా — కాని చూడు రావుడూ! నేనూళ్లో లేనప్పుడు, మన పెద్దబుగతకొడుకు ఆ శంకరంగాడు, మనింటి ప్రక్క తారాడతాడేవో - కొంచెం కనిపెట్టు'

రాము : ఎందుకేటి బాబు?

కరణ : ఛట్ వెధవా! ఇలాటి రాచకార్యాల విషయమై అడగొద్దని నీ కెన్నిమార్లు చెప్పాలి. ఏదొచ్చినా అట్టు పుట్టనవాళ్ళ కావాలి.

రాము : (చేతు ల్నలుపుకుంటూ) నేదండి బాబయ్యా! నేదు.

కరణం : (చీదరిస్తూ) ఏవిట్రా లేదు.

రాము : (కంగారుగా) కాదు బాబియ్యా!

కరణం : (చిరాగ్గా) ఏవిట్రా వెధవా! కాదు లేదూను. కనిపెట్టి చూస్తూఉండ్రా అంటూఉంటే.

రాము : సిత్తం బాబియ్యా! సిత్తం.

కరణం : అలా దారికి రా.

(పెద్దబుగత ప్రవేశం. లావుపాటి మనిషీ అరవైయ్యోపదిలో ఉన్నప్పటికీ, మంచి సంరక్షణ చేత నలభైఏళ్ళవాడిలా కనబడతాడు. మీసం గడ్డం కొంచెం నెరిసి ఉంటాయి. సన్నని పంచకట్టి, పైన జలతారు ఉత్తరీయం వేసుకుంటాడు. కళ్లకి సులోచనాలు.)

పెద్దబుగత : ఏవండోయి కరణంగారు ఆడబోయిన తీర్థవెదురయిందట. మీకోసమే నేను చూస్తూఉంటే మీరే ఎదురుపడ్డారు.

కరణం : ఏమిటి రాచకార్యం?

పెద్దబుగత : చూసేరు ఆ అప్పన్నగాడు

ఆ పొగరుబోతువెధవ, మా పాలిక ఒదల నంటున్నాడు.

కరణం: ఒదల్డు! చేతకాకపోతే ఒదల్డు. జమీందారీబిల్లుతో పాటు ఇనాంబిల్లు పాసయిఉంటే పిల్లాటలు సాగేవే. కాని ఇప్పుడు తోసిరాజు ఆటకట్టు—అయినా నా కెందుకు లెండి. మీ కోసం వాళ్ళతో నాకు నిష్ఠూరం. మీ కేదేనా అవసరంవస్తే నే మేం కనపడతాం. లేకపోతే కరణం గారికి పుట్టెడు ధాన్యం బదులుకూడా పుట్టదు.

పెద్ద బుగత: నాయన్నాయన. ఆ పాత సంగతులన్నీ మరిచిపో. ఒక పుట్టెడు కాదు అయిదుపుట్లు - తీసుకో, ఆ పెనుపోత్రపు వెధవనిమాత్రం హతమార్చాలి.

కరణం: అదెంతసేపు బావగారు! రెండు నిమిషాలు. కాని వ్యవహారం ముదిరిరంధిలోపడితేమట్టుకు మీరు వెనకంజ వెయ్యకూడదు. కాని అంతవరకు రాదు లెండి. గోచిపాత ముండాకొడుకులు, పిసినిగొట్లు. ఊదేస్తే ఎగిరిపోతారు.

పె. బు: ఏదో ఆ ఊదడం కానివ్వు.

కరణం: ఊదడం గీదడం, ఒట్టినే అవుతుందా. అన్నిటికీ కీలకం పైసా; పైసా. డబ్బుకి బ్రహ్మైనా లొంగుతాడు. మీకూ డబ్బుకీ లంకె. మీరు కాని ఖర్చుపెట్టరు. మాట కడితేనేగాని ఆఫీసరన్నవాడు మన మొహం చూడడు.

పెద్దబుగత: అప్పుడే ఆఫీసర్లే. ఏదైనా గందరగోళం తెచ్చిపెట్టేవుకద బాబూ! నీ ఘోస్త్రీమూ నా కొంపంతా వస్తు [illegible]. ఈ ఆఫీసర్ల బాధ నేను పడలేను. ఏదో ఇంత పలుకుబడీ, నోరూ, ఉన్నవాడివని, పైగా గ్రామయజమానివని, నీ సహాయం కోరేనుగాని, అక్కడికి పట్నా ఖర్చుచేయించడానికి కాదు. అందుకు నువ్వెందుకు నాయనా ప్లీడర్లే చాలు.

కరణం: (మొగం చిట్లిస్తూ ఎగతాళిగా) అహా! డబ్బు నేసరి కొచ్చిందే పరకాయింపు. నేను మొదటే అన్నాను ఈ వ్యవహారంలో నేను జోక్యంచేసుకోనని. నా మొగుడి సత్తువ నాకు తెలియదా అందిట ఒక మహాయిల్లాలు. పాతపిల్లిని నాకు తెలియదూ, ఈ ఊళ్ళో ఏ మనుషు లెటువంటివాళ్ళో. సరే. శుభం. సెలవు.

పెద్దబుగత: మరొస్తావుకదూ పోలానికి.

కరణం: ఏ పొలానికి? ఎందుకూ?

పెద్దబు: ఓహోహో: మళ్ళీ మొదటికొచ్చిందీ కథ. మా ఊడవలమడిపాలికి; అప్పన్నగాడు దున్నుతాట్ట. వాణ్ణి వెళ్ళగొట్టొద్దూ.

కరణం: దున్నుతాడో; తన్నుతాడో. అసలు నే నీవ్యవహారంలో జోక్యం చేసుకోను. మీరు, మీరు, ఏ గంగలోనైనా దిగండి.

పెద్దబుగత: పంతులూ నామాట విను. నీక్కావలసిం దేదో నువ్వడిగి పుచ్చుకో. ఇవ్వనంటే చెప్పుట్టుకు కొట్టు. ఆ ఆఫీసర్ల గొడవమాత్రం లేదు. నా భూమి నా స్వాధీనం చెయ్యి.

కరణం: (తల నిమురుకుంటూ) ఏవిటో; బావగారు! మీరు పెద్దలు మీమాట కాదనలేను. ఒరే రావుడూ!

రాముడు: (అదిరిపడి) సిత్తంబాబియ్యా!

కరణం: వింటున్నావా?

రాము: ఇంతన్నాను బాబియ్యా, ఇంతన్నాను.

కరణం: ఏవిటి వింటున్నావురా?

రాము: మా ఆడదాయి మీ గులాపో జ్ఞాత్తుకొని, పదం పాడుతుంటే, ఇంతన్నా.

కరణం: ఛీ! వెధవా! అదావింటున్నా వింతసేపాయి. (కొట్టబోవును)

రాము: (భయంతో) నేదు బాబియ్యా! నేదు. సెప్పండి బాబియ్యా! ఇనుకుంతా.

కరణం: ఒరి వెధవా! విను మరి. ఆనక పెద్దబుగతగారింటి కెళ్ళి, అయిదుపుట్ల ధాన్యం కొలిపించుకురా, తెలిసిందా.

రాము: తెల్సింద బాబియ్యా! తెల్సింది.

కరణం: బావగారు! మీరు పదండి. ఒక చిన్న రాచకార్యం సరిచేసుకుని మీ వనకాలే వస్తా.

పెద్ద: మరిచిపోకు నాయినా! నువ్వు వెయ్యికాళ్ళ జెర్రివి. (నిష్క్రమించును)

కరణం: చూడు రావుడూ! ఆ అప్పన్నగాణ్ణి నేను రమ్మన్నానని లాక్కురా.

రాము: సిత్తంబాబియ్యా! (నిష్క్రమించును).

(అప్పన్న, రాముడు ప్రవేశం. కోర మీసాలతో, కండలుతేరిన శరీరంతో, వస్తాదులాగుంటాడు అప్పన్న. శరీర బలమే కాని బుద్ధిబలం ఏ కోశంలోనా లేదని, వాణ్ణి చూడగానే తెలుస్తుంది. ఒక తుండుగుడ్డ తలపాగా చుట్టి, ఇంకొకటి కట్టుకుంటాడు)

అప్పన్న: దండాలు పంతులుగోరు.

కరణం: శుభం; శుభం; ఏం అప్పన్నా ఏవిటి విశేషాలు?

అప్పన్న: (పళ్ళిగిలిస్తూ) ఏటున్నాయి బావో! యిశేసాలు తమకు తెలియనివి.

కరణం: (గంభీరంగా) అవున్లే! ఇప్పుడు మా కెందుకు చెబుతావు. ఆ పెద్దబుగత భూమ్మీకొంచి వెళ్ళగొడితే, అప్పుడే కుయ్యో మొర్రో అంటూ మా దగ్గర కొస్తావు.

అప్పన్న: (నిర్ఘాంతపోయి) అదేటి బాబు! అలా గంటున్నారు. పెద్దబుగత గోరా! నన్నా! బూమ్మీకొంచి పొమ్మంతారా?

కరణం: అవును. నిన్నే! పెద్దబుగతే, భూమ్మీకొంచి గెంటెయ్యడం నిజం.

అప్పన్న: (నిర్ఘాంతపోయి) ఏటీ ఇసిత్రం.

రాము: ఏటయ్యా అనాసూత్తా నక్కపోతునా పళ్ళిగిలించి, పంతులుగోరు పెట్టీకుగా సెబుతుంటే ఇంకా తెల్దా?

అప్పన్న: (కోపంతో అదురుతూ) ఎవుడు నా బూమ్మీద కాలెడతాడో

సూత్తా. నిన్నగాక మొన్న అయిదొందల రూపాయిలు సాగుచిస్తు చ్చుగోని, మూణేళ్లు సరతెట్టి, యియ్యాళ కాదంటాడా! పెద్దబుగత కాదు బమ్మదేవుడైనా సరే నా బూమ్మీద కాలెట్టాడా ఒక్క దెబ్బతో సఫా.

కరణం: (శాంతంగా) అవుతే పెద్దబుగతనే కొడతావురా?

అప్పన్న: కొడతానా కొట్టిసూత్తానా! నా రగతం దారపోసి కూడేసిన సొమ్మంతా ఈ క్షౌత్తిని కొడితే, నిన్నగాక మొన్న బూమిచ్చి, యియ్యాళ మరి నాకుక్కంటే మరి నా గతేటి బాబు సెప్పండి. ఇదుగో ఇయ్యాళ నాను పెబ్లీకుగా సెబుతున్నా; ఎవుడు నా బూమ్మీన కాలెట్టినా ఒక్క దెబ్బతో సఫా. నా ఒళ్ళు మండితే నా నీరబ్రమ్మణ్ణి. అళ్ల రగతం సూత్తా. (రావుడు చేతిలో కర్ర తీసుకొని గిరగిర తిప్పుతాడు). జంఝున కరి; జంఝున కరి; ఝుణుకుతా.

కరణం: ఒరే అప్పడూ! కొంచెం శాంతించు. మరి నువ్విచ్చిన సొమ్ముకి రసీదు పుచ్చుకున్నావట్రా.

అప్పన్న: (నిర్ఘాంతపోయి) రసీదా! ఏటి బాబు?

కరణం: అవున్రా రసీదే. ఇంత సొమ్ము ఫలానావారు ఫలానావారి కిచ్చినందున ముట్టినది అని లిఖితం.

అప్ప: ఆఁఆఁ! రసీదుచ్చుకోనే. బుగతబద్ధ వాడెత్తాడా?

కరణం: ఆడతాడని కాదులే, కాని, కీడెంచి మేలెంచమన్నాడు. నువ్వివ్వడం ఎవరైనా మూసేరా?

అప్పన్న: ఎవుడూ సూణ్లే. నా నొక్కణ్ణొల్లి, మంచి రేతిర్ని బుగతసేతుల్లో నోట్లు సుట్ట సుట్టేసి ఎట్టేహినా.

కరణం: ఏడిసేవు కదూ. ఇక చావు.

అప్పన్న: ఏటి బాబు! అలా గంటన్నారు. పెద్దబుగ తబద్దమాడతాడా?

కరణం: మరి; ఆడకపోతే యీవాళ నా భూమ్మీదనుండి అప్పన్నగాణ్ణి వెళ్లగొట్టాలని యెందుకంటాడు.

అప్పన్న: (ఆశ్చర్యంతో) నిజవేనేటి బాబు! పెదబుగ తనా గంటన్నాడా?

కరణం: నిజవేన్రా; ముమ్మాటికి నిజం;

రాముడు: ఏటోయ్ అప్పన్నా, నోరాగలించి అలా సూత్తావేటి? పెదబుగత కరణంగోరితో అంతే, నా నింతే—

అప్పన్న: (గభీమని లేచి) అదంతా నాను తేల్దు. బగవంతుడు సాచ్చిగా నాను డబ్బిచ్చెన్ను. బూమ్మీది కవుడొచ్చినా ఆడి కియ్యాల్లో అవగ్గాయం చరి; చరంతె చరే. (కర్రతీసి తిప్పుతూ) జంఝునకరి; జంఝునకరి;

కరణం: (కొంచెం దూరంగా పోయి) అప్పడూ! కొంచెం శాంతించు. ముందుంది ముసుళ్లపండుగ. అప్పుడే ఆడతావేం. అసలు కీలకం విన్నావా?

అప్పన్న: ఏటి బాబూ.

కరణం: అస లాభూమి బుగతది కాదు. అతని చెల్లెల్ది.

అప్పన్న: (చెయ్యి విసురుతూ) అయితే ఇతగా డెందుకు డబ్బుచ్చుకున్నాడు.

కరణం: (శాంతంగా) నువ్విచ్చేవు గనక.

అప్పన్న: మరి నా డబ్బెగనేస్తాడా?

కరణం: మంచిమీదవుతే నీడబ్బు నీ కిచ్చేస్తాడు. ఒకమారు కాకపోయినా దఫదఫాలు.

అప్పన్న: మరి బూమో!

కరణం: అది నువ్వు తలబాదుకున్నా ఇవ్వడు.

అప్పన్న: ఏంది బాబు? డబ్బిచ్చెన్ను.

కరణం: అదే కీలకం; దాని కేదో పోటె తగిలింది. నీకు లిఖితం లేదు.

అప్పన్న: అద్దదే సిక్కొచ్చింది; మావోళ్లకే బుద్దుంటేనా...మరి నా గతేటి బాబు!

కరణం: నీడబ్బు నీ కిప్పించేస్తా.

అప్పన్న: ఆ కాగితమ్ముక్కలు నాకేటి సేసుకుంటాను బాబు? పిల్లలోణ్ణి బూమి లాక్కుంతే సచ్చిపోనా?

కరణం: ఏమో; ఉన్నసంగతిది. నీ మేలుకోరేవాణ్ణి, నాలుగు వ్యవహారాలు తెలిసినవాణ్ణి, కాబట్టి చెప్పేను. ఇంక నీ యిష్టం. అతగా డిష్టం.

రాము: అప్పల్ చ్వామేవ్! సూత్తావేటి బాబుగోరి కాళ్లమీ దొడు. ఆరే రచ్చించాలి. (కరణంతో) బాబు! ఏటో పిల్లలోడు. రచ్చించండి. తాంబోళం కర్సిచ్చుకుంటాడు.

అప్పన్న: (కరణంకాళ్లు పట్టుకుంటూ) రచ్చించండి బాబు; రచ్చించండి; తమ గులాపోణ్ణి; తాంబోళంకర్సు...

కరణం: ఒరే అప్పన్నా! నువ్వు నాకు డబ్బివ్వాలి? ఎంత మాట! కాపులేని కరణం బ్రతకలేడన్నమాట నువ్వు వినలేదూ? ఒక్క ఖర్చుమాత్రం నీకు తప్పదు. బుగత పోలీసుల్ని తీసుకొద్దామని చూస్తున్నాడు. వాడికంటె ముందు మనవే వాళ్లకి మూతి కట్టాలి. తెల్సిందా?

అప్పన్న: దాని కెంతొద్ది బాబు!

కరణం: అట్టే ఎంతా కాదు. ఓ రెండు వందలు. అంతే.

అప్పన్న: అమ్మయ్యో! అంత సొమ్ము నా నియ్యలేను.

కరణం: ఓరి వెర్రిభడవా! ఇంత సొమ్ము అని అనబోకు. నీ కా భూమి శాశ్వతకదపా అయీమాదిరి నే చూస్తా కదూ.

రాము: అప్పల్ చ్వామేవ్! ఇయ్యాళ నీరేక బాగుండే. తే చొమ్ము; తేవయ్యా! గుడ్లెక్క పెట్టుక చూత్తావేటి?

అప్పన్న: మంచో; సెడ్డో; ఆ పాప్పన్నా లన్నీ మీవే. (లేచును; రాముడు కొంచెం నడిచి)

రాము: అప్పల్ చ్వామేవ్! నామాట మరిసిపోతావేటి? అళ్ళ నీళ్లని పిలిచేవోణ్ణి నాను చుమా.

(అప్పడు నోట్లు పట్టుకొనివచ్చి కరణాని కిచ్చును)

కరణం: ఇదుగో! నువ్వు మామూలుగా ఏరు పుయ్యి. బుగ తొస్తాడు, ఏ రిప్పడానికి. ఏ రిప్పనియ్యకు. అంతగా బలాత్కారాని కొస్తే చెయ్యిచేసుకో. భయంలేదులే. నే నున్నాను కదూ. సరే, పద; (కొంచెం నడిచి) ఇదుగో! అప్పడూ! నువ్వు మంచి పొగాకు పండించేవుట. ఓ వీసెడు పంపించు; చూతాం.

అప్ప: అనాగే బాబు! ఎటు సూసినా మీ పాదాలే గతి.

కరణం: ఫరవాలేదు; పద. (అపుడు నిష్క్రమించును)

కరణం: రావుడూ!

రాముడు: సిత్తం బాబియ్యా!

కరణం: మనింటివేపు చూస్తున్నావురా?

రాము: సిత్తం బాబియ్యా!

కరణం: ఆ శంకరంగాడు కనపడ్డాడ్రా?

రాము: సిత్తం బాబియ్యా!

కరణం: ఛీ వెధవా! నిజం చెప్పు?

రాము: నేదు బాబియ్యా!

కరణం: అద్దదీ మాట. అలా తోవకి రా.

కరణం: రావుడూ! ఇప్పుడు మా రంగేవి చేస్తూవుంటుందో చెప్పు చూతాం?

రాము: (పరాగ్గా) ఆఁ ఏటుంది. చంకరంగారితో చతాగా లాడుతుందాది.

కరణం: (గుడ్లెర్రచేసి) ఛట్ వెధవా! ఏం పేలుతున్నావు. మళ్లీ అనామాట. (కొట్టబోవును.)

రాము: (భయంతో) బాబ్బాబు! తమ గులాపోణ్ణి; రచ్చించండి. రచ్చించండి.

కరణం: నిజం చెప్పు వెధవా?

రాము: సెపుతా బాబియ్యా! సెపుతా! అమ్మగోరు మీకోసం బెంగెట్టుకోనె, దద్దరిల్లిపోతుంతారు.

కరణం: అద్గదీ మాట; అలా తోవకి రా. రావుడూ! మా రంగు మహా సాధ్వీసుమా!

రాము: (చిరాగ్గా) అద్గదే అనుద్దంతా! బమ్మదేవుడు సెప్పినా నా సనాటిమాట నమ్ముతానా?

కరణం: (రెచ్చిపోయి) ఏవిట్రా వెధవా! నీ కేం మతోయిందా? ఏవిటా పేలుడు.

రాము: (చిరాగ్గా) పేలు డేటి బాబు పేలుడు. నా పాణం పోయినా, నా సనాటి మాటంతానా; ఇంతానా!

కరణం: ఓరి వెధవా! నే నన్నమాట నీ కర్థమయిందీ?

రాము! (పళ్లికిలిస్తూ) ఓహోహో! ఈ పాటి మాటే అరదం కాలేటి బాబు! అమ్మగోరి నాదం లే, నా నాగుకుంతానా? నాదం లే భెరెగోడు కాదా?

కరణం: ఓరి వెధవా! నీ అర్థం కాని నగే ఉంది. మహాసాధ్వి అంటే మంచి పతివ్రత అన్నమాట. అంటే మగో మగవాణ్ణి కన్నెత్తైనా చూడదన్న మాట.

రాము: ఓహో! అనాగైతే  మ్మగోరు గాదే. (కొంచెందూరం పోగానే) బాబు!

కరణం. ఏం రా!

రాము: ఎంకమ్మగోరి మాటే మరిసిపోనారు.

కరణం: (చీదరిస్తూ) ఏ వెంకమ్మరా?

రాము: ఏ యెంకమ్మగో రంటారేటి బాబు! పెదబుగతోరి సెల్లెలు చోకమ్మ. సింగసవితినాడే నేస్తం కట్టుకున్నారు కాదా?

కరణం: (కంగారుగా) మెల్లిగా, మెల్లిగా: ఎవరేనా వినగల్రు. అయితే ఏవిటి కథ?

రాము: కథేటి బాబు! కథ! అయిపో దిన్నేసుంకున్నాను. (తలగోక్కుంటూ) ఏం బాబియ్య! ఏ సిక్కొచ్చినా ఈ చోకమ్మలకే రావాలా? నిన్న మంచి రేతిర్ని మాయింటికాడ కొచ్చేసరను. నా నుంకు నీళ్ళోసుకోని, తిండి తిని, నిద్రకోకుం లే, మీ సులాపుదాయి, నన్ను నేపి యెంకమ్మగో రొచ్చ్రనని సెప్పింది. నాది మా సురుకైన బుర్రకదా. ఇ పసికట్టేహినా. దగ్గర కొచ్చి సూతునా, ఎన్నెట్లో బలబల ఏడుస్తుంది. బాబు! సెప్పకేం నాగుండె నీరై పోనాది.

కరణం: పాపం! రాత! దాన్నలా చేసిన భగవంతు ణ్ణనాలి.

రాము: మీ బొమ్మల్లు సేసిందానికి భగవంతు ణ్ణంతా రేటి బాబు! పెద్దజాతులేగాని బుద్ది తక్కువ బాబియ్యా? చమించండి.

కరణం: దానికేం లే. ఏవిటి దాని సొద.

రాము: (చిరాగ్గా) ఎరగనోళ్లలా గంతా రేటి బాబు! ఊరల్లా కోడై కూస్తుంతే. ఇప్పటి కేడో నెల.

కరణం: ఓరి దీనికేనా ఇంత గడబిడ. ఏదో అనుకున్నాను. ఇలాటి రాచకార్యాలు పెద్దబుగత చేతిమీదుగా వందలు నడిచేయి. ఆ పీడ ఒదిలేమార్గం అతగాడే చూసుకుంటాళే. కాకపోతే ఒక్క పాట్లాంతో పైసల్. సరేగాని నీ కేపాటి లాభం?

రాము: ఏదో తను గులాపోణ్ణి. కాని బాబియ్యా! మామూళ్ల మాటే మరిచిపోను.

కరణం: నా శెక్కడి కెళ్తారా మామూళ్లిస్తక. ఈ గ్లోగే ఉంచాను కంఠానికి సరిగ్గా. పద పద. నేను పెరటిగుమ్మం ద్వారా పోయి రంగుసంగతి కనిపెడతా.

(నిష్క్రమణం)

## 3-వ రంగము

(రంగమ్మ వంట చేస్తూఉంటే చిట్టన్న పంతులు వెనకనుండి వచ్చి ఆమె కళ్లు మూయును; ఆమె తబ్బిబ్బగును. చిట్టన్న పంతులు రాగం తీస్తూ)

"నే నెవరో చెప్పుకోవాలి"

రంగమ్మ: (విదిలించి) బాగుంది సరాగం. ముసిలికి ముచ్చట్లు లావట.

చిట్టు: అదుగో! ఆ మాటే అనొద్దన్నా. నన్ను ముసిలన్నవాడి చెంప్రూడగొడతా. నాకంటే పడుచువెధ వెవడే?

రంగ: ఆఁ ఎవరూ లేర్లెండి. (చనవుగా) ఏవిటండీ ఏదో మాటవాసికంటే అంత కోపం. పోన్లెండి నేను మాటే ఆడను. (మొగం ముడుచుకుంటుంది)

కరణం: అల్లే; కోప మేవిటి? అప్పుడే; ఈ పాటి మాటకే. చూడు "రామ చిలుకా నాతో చాల పోరే నే, కుమ్మెదలు ఝుంఝుమ్మని" (పాడును)

రంగమ్మ: ఛా! ఆదేం పాటండీ. పాడు భాగోతంబాణీ. కొత్తరకం పాటలు ఎంతో ముచ్చటయినవి వుంటేను.

కరణం: ఓహో హో! అవి నాకు రావనుకున్నా వేవిటి చూడు.

"చిలుకా! పలుక వేల నే" (పాడును)

రంగ: మీ కెంతెక్కొ పాడతారండీ

కరణం: అద్గదీ మాట; అలా తోవకిరా. ఇటు చూడు (నోట్లు కనబడేలాగ చెయ్యూంచి) ఈ చేతిలో వేవుట్లో చెప్పుగోవాలి (దీర్ఘం దీయును) చెప్పుకుంటే ఇచ్చేస్తాను.

రంగమ్మ: (చిరునవ్వుతో) మీకు నామీద ప్రేముంటే చాలు. ఇవన్నీ ఎందుకండీ. ఈ రూపాయలు మీకంటే విలువా నాకు?

కరణం: అవున్లే నీమనసు నాకు తెలియదూ? అయినా, నా ముచ్చట నాకు తీరొద్దూ? ఏదీ, తీసుకో? (అందిస్తూ ముద్దుపెట్టుకోబోగా రంగమ్మ తప్పించుకొనును)

(తెరలో కేకలు)

రంగమ్మ: ఏవిటా కేకలు?

కరణం: (విని) అదో చిత్రకథ లే. నువ్వింట్లోనే తలుపేసుకో ఉండు. నే నిప్పుడే వస్తా. (నిష్క్రమించును)

(పెద్దబుగత ప్రవేశం చెంప తడుముకుంటూ).

"పాడు వెధవ! కొడతాడూ, వీణ్ణి పాతిపెడతా. మహమ్మారి వంటే స్తా. సెంట్రల్ జైల్లో తోయిస్తా."

కరణం: (ప్రవేశించి) ఏవిటి బావగారూ!

పెద్దబుగత: (కోపంతో) ఆఁ మంచి బావగారే. ఇదంతా నువ్వే చేయించేవు. ఆ పెడపోత్రపు వెధవకి మద్దతిచ్చి నన్ను కొట్టించి హాయిగా యింట్లో కొత్తపెళ్ళాంతో సరాగా లాడుతున్నావా? నిన్ను...

కరణం: (కోపంతో) ఏవండోయి! కథ ముదురుతోంది. మాటలు తిన్నగా రానీయండి. లేకపోతే రెండో చెంపకూడా పగలగలదు.

పెద్దబుగత: (మండిపడుతూ) ఏవిటయ్యా మాటలు తిన్నగా రానిచ్చేది? ఈ పన్నాగమంతా నువ్వు పన్నింది కాదూ. చూడు నిన్నేం చేయిస్తానో! కొడతావా? ఏదీ కొట్టు? (ముందుకు వచ్చును)

కరణం: కొట్టడం కానితేవాలా, ఏదీ యిందాకటి మాట మళ్ళీ అను.

పెద్దబుగత: ఆహా! మళ్లీ అంటాను. ముమ్మారంటాను. ఆ వెధవకి పొగరెక్కించి నన్ను కొట్టించి, నీ కొత్తపెళ్లాంతో...

కరణం: ఆఁ (అని మీద కురుకును; బుగతకూడా కలియబడును. ఇంతలో బారిక రాముడు మధ్యకొచ్చి వాళ్లని విడిపించును.)

ఇద్దరు: ఛీ వెధవా! మమ్మల్ని ముట్టేసుకున్నావురా. మా మధ్యకి నువ్వెందు

వ పేజీ చూడండి)

# నైతికషరాబు

అంగారకుడు

ఈమధ్యతలవని తలంపుగామాకుటుంబపు పాతస్నేహిడు ఒకాయన్ను కలుసుకున్నాను. పెదనందిపాడు పన్నుల నిరాకరణదగ్గిరనుంచి ఈనాటి వరకూ జాతీయోద్యమంలో ముందడుగు వేసినుంచున్న వ్యక్తి ఆయన.

కుశలప్రశ్న లయినతరవాత, ప్రస్తుతం ఏం చేస్తున్నావోయ్అని ఆయన అడిగాడు.

“విశ్వరూపంపత్రికలో విలేఖరిగా ఉంటున్నాను. అయితే మీరు ఇప్పుడువక్కడ ఉండటం?” అని తిరిగి ప్రశ్న వేశాను.

“మనవూళ్లోనే. కాంగ్రెస్ నైతిక షరాబుగా ఉంటున్నాను.” అన్నాడాయన.

“ఇదేమిటండోయ్. ఈ పేరు ఎక్కడా వినలేదే” అన్నాను.

“పేరుమాత్రమే కొత్త అంతే. మామూలు షరాబు వెండి, బంగారాలకు ధరలు కట్టి చెలామణీ చేసినట్లే నేను నీతికీ, అవినీతికీ, ధర్మాధర్మాలకూ ధరలుకట్టి, ఏ విషయం ఏ తరగతికి చెందుతుందో నిర్ణయిస్తూ ఉంటాను.”

నాకు చాలా ఆశ్చర్యం వేసింది. అసలు ఇటువంటి విషయాలన్నీ స్వార్థపరులు కల్పించినవేననీ, ప్రజలకు మేలు చేయటమే అసలైన ధర్మమనీ చెప్పే వ్యక్తి ఈ రొంపిలో ఏట్లా దిగాడా అని ఆశ్చర్యం వేసింది.

ఆయన నా మొహంలో ఆశ్చర్యాన్ని కనిపెట్టి “అది కొంచం పెద్ద కథలే!” అన్నాడు.

“అయితే కాఫీ తీసుకుంటూ మాట్లాడదాం రండి.”

“ఎబ్బెబ్బే! ఇప్పుడే తాగానోయ్.”

“మరీ మంచిది. మనం వెళ్లే హోటలు కూర్చుని మాట్లాడటానికే ఉపయోగిస్తుంది గాని, తినటానికి రుచించే సరుకు ఉండదు.” అని ఆ మహాహోటలుకి దారి తీశాను.

*     *     *     *

“మొత్తానికి చాలా తమాషాగానే ఉన్నది మీ సంగతి” అన్నాను.

“అవునోయ్. వింతగానే ఉన్నది. అయితే దానికి ఒక అర్థం అంటూ లేకపోలేదు.”

“అదేదో చెప్పమనే నా మనవి.”

“దగ్గర డబ్బులేని సమయంలో పసిపిల్లవాడు అవీ, ఇవీ కొనిపెట్టమని అడుగుతాడనుకో. అప్పుడేం చేస్తావ్ ?”

“ఏవో మాయమాటలు చెప్పి మరిపించాలని చూస్తాను.”

“సరిగ్గా అదేపని నేనూ చేస్తున్నాను. అధికారంలోకి వచ్చినతరవాత మేము అనుకున్నట్లు ఏదీ చేయలేకపోతున్నాము. జనం గోలపెట్టకుండా వాళ్లని ఏదో జోకొట్టాలంటావా లేదా ? అందుకోసం ఈ పని చెయ్యాలి.”

“అందుకని ?”

“అందుకని వాళ్ల దృష్టిని నిత్యవ్యవహారాలమీదనుంచి మళ్లించటానికి ఏదో ఒకటి చెప్పాలి. దానికి ధర్మపన్నాలు బాగా పనికొస్తయ్.”

“ఆ ఒక్క పనికే అయితే ఆట్టే శ్రమ ఉండదేమో!”

“అదిఒకటే కాదు. వేరే ఇబ్బందికూడా ఉన్నది. అధికారం మన చేతిలోకి వచ్చినతరవాత అనేకమంది బోలెడు ఉద్యోగాల్లో ఇరికారు. అహా, దడపా ఏవో ప్రకటనలు చేస్తుంటే కాని, పబ్లిక్ దృష్టిలో ఉండమేమోనన్న భయం వాళ్లకి పట్టుకున్నది. అందుకని అయినదానికీ, కానిదానికీ ఏదో నెపం పెట్టి ఏదో ప్రకటన చేస్తూఉంటారు.”

“అవును. వాటిని ప్రకటించేవరకూ మా గొంతు కోరుకుతూ ఉంటారు.”

“అంతే కాదు బ్రిటిష్ పరిపాలనలో డిపార్ట్మెంట్ సెక్రటరీలు మాత్రం ఉండే వాళ్లు. ఇప్పుడు మంత్రులు, పనిలేని మంత్రులూ, డిప్యూటీమంత్రులు, స్టేట్ మంత్రులు– ఈ విధంగా సబ్ అసిస్టెంట్ జాయింట్ డిప్యూటీ స్టేట్ మంత్రివరకూ–”

“ఏమేమిటీ? సబ్ అసిస్టెంట్ —”

“నీ ఇష్టంవచ్చిన వరస పెట్టుకో– అటువంటివాళ్లంతా ఉన్నారు. ఒక్కొక్కళ్లకూ పార్లమెంటరీ సెక్రటరీ, ప్రైవేట్ శెక్రటరీ, పర్సనల్ ఎసిస్టెంట్ ఈ విధంగా ఎంతోమంది ఉన్నారు. ఇంకా రాష్ట్ర పార్టీసంఘాలు, పోటీసంఘాలు వగైరా నాయకులు ఎంతోమంది ఉన్నారు. వీళ్లతో పనిఉన్నవాళ్లు ఏదో ఒకటి ఏర్పాటుచేసి కొంతమందిని అధ్యక్షులుగానూ, కొంతమందిని ప్రారంభకులుగానూ, కొంతమందిని జండా ఎగరెయ్యటానికీ, దిగలాగటానికి కొంతమందినీ పిలుస్తారు, మరి వీళ్లంతా ఏదో ఒకటి చెప్పాలిగదా?”

“తప్పనిసరిగా మాట్లాడా లంటారా?”

“ఇదుగో, కొంటెగా మాట్లాడబోకు, వీళ్లంతా ఈ గంభీరోపన్యాసాలు, ఉద్ఘాటనలు చెయ్యకపోతే మీ పేజీలు నింపటం కష్టమని నీకుమాత్రం తెలియదూ?”

నేను నవ్వి ఊరుకున్నాను.

“మరి ఇంతమంది మాట్లాడాలంటే కొత్తవిషయాలు ఎక్కడినించి వొస్తయ్?”

“వెనక చేసిన పనులు, చెయ్యబోయే పనులు వివరించవచ్చునుగా!”

“అవన్నీ ఎప్పుడో పూర్తి అయినయ్. స్వరాజ్యంవచ్చేలోపలే వెనక చేసిన పన్లను చెప్పుకోటం పూర్తి అయింది. స్వరా[illegible] వొచ్చినతరవాత, తాము ఏ మేమి[illegible]య బోతున్నదీ చెప్పటం జరిగింది. కా[illegible] రోజులు గడుస్తున్నకొద్దీ, మాటలు చూస్తే గడపలు దాటుతయ్, చేతలు చూస్తే గడపలు దాటవు. అన్నట్లుతయారయింది.”

“పోనీ, ఒక్కొక్కరూ ఒక్కొక్క విషయాన్ని తీసుకుని ప్రత్యేకంగా కృషి చెయ్యొచ్చునుగా ?”

“కొంతమంది ఆపనీ చేస్తున్నారు. ఒక నాయకుడు కళాసేవకుడై కళామయం జగత్ అంటుంటే మరొక ఘనాపాఠి సాహిత్యంమీద సవారీ చేస్తున్నాడు. ఒకాయన నాన్కోఆపరేషన్రోజుల్ని దాటలేకపోతే, మరొక ప్రముఖుడు కోఆపరేటివ్ వ్యవహారాలను ముక్కున పెట్టుకుని ఉంటాడు. ఒక హేమాహేమీ గడిచిన వైభవాన్ని స్పెషలయిజ్ చేస్తే మరొక ప్రబుద్ధుడు ప్రతిక్షణం రామరాజ్యస్మరణ చేస్తుంటాడు.”

“అంతేకాని జరుగుతున్న చరిత్ర పట్టరంటారు”

“దానిని మరుగుపరచటమే అసలు ఉన్న సమస్య. ఈ స్పెషలిస్టుల ప్రసంగాలుకూడా జనానికి విసుకు పుట్టిస్తున్నవి. అందుకని అందరికీ అందుబాటులో ఉండే రెండు సంగతుల్ని కనిపెట్టాను.”

“ఆహాఁ! ఏమిటి అవ్వి?”

“ఒకటి– వేదాంతం చెప్పటం; రెండు– అన్యాయం పెరిగిపోతున్న దనటం.”

“ఇవిమాత్రం అంతా చెపుతుంటే విసుకు పుట్టదూ”

“అక్కడే ఉంది తమాషా! వేదాంతం చెప్పటానికి ఎన్నిమార్గాలున్నవో లెక్కపెట్టటం చాల కష్టం. ఒకాయన భగవద్గీతను వల్లిస్తూ ఒకరిమీద విజృంభిస్తాడు. ఇంకో

కాయన రామాయణపఠనంతో ప్రజల గుండెల్ని కరిగించటానికి ప్రయత్నిస్తాడు. మరొక మహానుభావుడు మహాభారతంలో నుంచి భారతరాజ్యాంగాన్ని ఎత్తి చూపటానికి తంటాలు పడతాడు. అడుగడుక్కీ మానవత్వం, అహింస, సత్యం, నిష్కామ కర్మ, త్యాగం, బలిదానం, అమరజీవి—ఈ పద్ధతిల్లో కోలాహలంగా మాటల్ని గుప్పిస్తారు."

"ఆ తరవాత?"

"అధర్మం పెరిగిపోతున్న దనీ, ధర్మం నశించిపోతున్న దనీ గోలపెడతారు. నీతి అనేది నశించిపోతున్న దని అడావుడి చేస్తారు."

"అట్లా చేస్తేనే కాని, తాము నీతిపరులని జనం నమ్మరనుకుంటారేమో!"

"అసలు కిటుకు కనిపెట్టేశావ్!"

"అందులో వాళ్ల ఉద్దేశం వేరే ఏమయినా ఉన్నదా?"

"ఒక్కటే ఉద్దేశం. అధికారంలో ఉన్నవాడెవడయినా, ఎప్పుడూ ఒక్క విషయాన్ని కోర్తాడు. తనని అధికారంలోకి ఎత్తిన పరిస్థితులు మారకూడదని అభిలాషపడతాడు. వాటిని మార్చే విషయాలన్నిటినీ నీతివిరుద్ధాలనీ, ధర్మవిరుద్ధాలనీ అంటాడు.

"మీ వాదనని బలపరిచి చూపాలి."

"అయితే విను. బ్రిటిష్ 'హూణ' ప్రభువులు పరిపాలిస్తుండగా మన ధర్మరక్షకులు కొందరు వాళ్లకి తలఒగ్గి తాజీం ఇస్తుండేవాళ్లు. జాతినంతటినీ కూడగట్టటానికి గాంధీజీ హరిజనోద్యమం లేవదీస్తే, ఈ ధర్మరక్షకులు నానా గోలా చేసి, అసలు ఒకటే కాలుమీద నడుస్తున్న ధర్మాన్ని ఆయన నేలమీద పొర్లిస్తున్నాడన్నారు."

"అయినా ధర్మం మూడు, నాలుగు కాళ్లమీద నడవటం ఏమిటి?"

"అందులో ఆశ్చర్యం లేదు. తగిన ఏర్పాటు చేస్తే ఈ రోజునకూడా ధర్మాన్ని 34 కాళ్లమీద నడిపించవచ్చు."

"చండశాసనాలు చేసి నేరస్తుల ముక్కూ, కాళ్లూ తెగ్గోయిస్తేనా?"

"అబ్బే! అది మూర్ఖపద్ధతి. ధర్మాధర్మాల నిర్ణయం మనకి అనుకూలంగా మారిస్తే సరి."

"అది ఏవిధంగా జరగాలి?"

"కృతయుగంలో ధర్మం నాలుగుకాళ్లమీద నడిచేదట. చేసిన ప్రతిదీ ధర్మమే అయినప్పుడు ఎందుకు నడవదు? ఆ రోజుల్లో రాక్షసం, పైశాచికం, ఆసురం మొదలైన వాటిని పెళ్లిళ్లుగానూ, గూఢోత్పన్నుడు, కానీనుడు మొదలైనవాళ్లు కొడుకులుగానూ జమ అయినారు. కాని కలియుగం కర్మంకాలి అవన్నీ అధర్మాలయినయ్. రాక్షసం అంటే ఎబ్డక్షన్ అన్నారు. పైశాచికం అంటే రేప్ అన్నారు. గూఢోత్పన్నుడు సర్టిఫికెట్టుకి వల్లినా కొడుకు చెలామణి కాడుగదా!"

"ధర్మశాస్త్రకారులే ధర్మదేవతకి కాళ్లు తెగ్గోశారంటారా?"

"సందేహం లేదు. చేసినవన్నీ ధర్మాలైనరోజున ధర్మదేవత నాలుగుకాళ్లమీద నడిచింది. సంగనాలు తీసింది అవన్నీ పనికిరావని కొట్టేస్తే ఒకే కాలు మిగిలింది. ఇప్పటికయినా మించిపోయిందిలేదు. నలుగురు సంస్కృత పండితుల్ని తీసుకుంటే, ధర్మదేవతని 44 కాళ్లమీద నడిపించవచ్చు."

"మీ నైతికపరాబులంతా ఇప్పుడు చేయిస్తున్నది అదేనా?"

"కాదు ఉన్నకాళ్లని కోసేస్తున్నాం. కాంగ్రెస్‌వాళ్ల దృష్టిలో ఇదివరకు ధర్మంగా కనిపించిన నాన్‌కోఆపరేషన్ ఇప్పుడు అధర్మమయింది. పరమ పాపిష్ఠి శాసనంగా కనిపించిన డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ ఇప్పుడు శాంతిరక్షణ చట్టాలుగానూ, ప్రివెంటివ్ డిటెన్షన్ ఆక్టుగానూ అవతరించినయ్. 1947 మార్చి 14వ తేదీ అర్ధరాత్రి 11 గంటల 59 నిమిషాల వరకూ దేశాభివృద్ధికి జాతీయసంస్కృతికి, ముఖ్యమార్గంగా తోచిన భాషారాష్ట్రనిర్మాణం, ఒక్క నిమిషంలో సకల జాతీయైక్యతకు వేరుపురుగయిపోయింది. కార్మికులకు, విద్యార్థులకు సమ్మె చేసే అధికారం పోయింది."

"అయితే ఫ్యాక్టరీలూ, స్కూళ్లు మూతబడా లంటారా?"

"ఏమి టయ్యా నువ్వుకూడా అట్లా మాట్లాడతావ్? రాత్రింబగళ్లు రెక్కలు విరుచుకున్నా కడుపునిండని కూలీలకూ, ఫస్ట్‌క్లాసులో పాసయినా ఉద్యోగం దొరకని విద్యార్థులకూ సమ్మెలు చేయటం సరదా అనుకున్నావా? ఇబ్బందుల్ని తొలగించుకోటానికి వాళ్లకి ఉన్న సాధనం అదొక్కటేగా? అసలు కుర్రాళ్లని మొదట స్కూళ్లు మానిపించింది కాంగ్రెస్ వాళ్లే తెలుసా?"

"ఇవన్నీ తెలిసే, మీరు ధర్మాన్ని అధర్మంగానూ, అవినీతిని నీతిగానూ, ముద్ర కొట్టటానికి ఎందుకు తయారయినారు?"

"ధన మూల మిదం జగత్,"

"మీ అసలు అభిప్రాయాలు అధికారులకి తెలియవా?"

"తెలుసు. అయితే ఏం? డాక్టర్ చేత విషం పెట్టించటం, ఆడిటర్ చేత దొంగ పద్దులు రాయించడం, క్రిమినల్ ప్లీడర్ సలహాతో నేరాలు జరిపించడం, జరిగినట్లే అసలు విషయం తెలిసిన నాబోటివాడిచేత ముద్ర వేయించటం మంచి దనుకున్నారు. అవి రాన్ని పట్టి వాటిని నిర్ణయించి, వాటిమీద డబ్బా వాయించమని నేను చెపుతూ ఉంటాను."

"విదేశాల్లోకూడా ఇంతేనా?"

"చాలా భారీఎత్తులో జరుగుతున్నది. అందుకనే ప్రజాస్వామ్యం, వ్యక్తిగత స్వేచ్ఛ, నియంతృత్వ ప్రతిఘటన, స్వేచ్ఛా మానవుడి రక్షణ—అని ఎన్నో రంకెలు వినిపిస్తున్నయ్. మాది అసలు డాలర్ మార్కు ప్రజాస్వామ్యం అని చెప్పుకునే అమెరికా, ఆసియా దేశాలను కమ్యూనిస్టు నిరంకుశత్వంనుంచి కాపాడుతుందట కాని, మాడి చస్తున్న జనానికి ఒక గింజయినా ఇచ్చిన పాపాన పోదు. ఆసియా దేశాలకు స్వాతంత్ర్యం ఇప్పించటానికి ఆటంబాంబులనూ, సూపర్ ఫోర్ట్ బాంబర్లనూ పంపుతున్నది. శ్రేయోరాజ్యాన్ని స్థాపించానని చెప్పుకునే బ్రిటన్ సూయజ్ ప్రాంత శ్రేయస్సును మహా చక్కగా కాపాడుతున్నది. ఇండియా అప్పులక్రింద అడిగింది తప్ప ఏదయినా ఇస్తుందట. మలయా రబ్బరుతోటల యజమానులకు శ్రేయోరాజ్యాన్ని కట్టపెడుతున్నది."

"ముస్సోలిని అబిసీనియాకు నాగరికత ఇస్తానన్నట్లేనా, ఇది కూడా?"

"ముస్సోలినీ పాశ్చాత్యనాగరికత అన్నాడు. వీళ్లు ప్రజాస్వామ్యం అంటున్నారు. ఇటీవల క్యాథలిక్కుర్చికూడా రంగంలోకి దూకింది."

"మీ నైతికపరాబుల అవసరం ఎంతవరకూ ఉంటుంది?"

"జనంకళ్లల్లో కారం కొట్టటం అవసరమని అధికారులు భావించినంతవరకూ"

"దానికి ఎక్కువకాలం పట్టదేమో?"

"అందుకనే మేము దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకుంటున్నాము. ఈ మధ్య మా సంపాదన మహా ముమ్మరంగా ఉంది."

"నిజం?"

"నీతో అబద్ధం చెపుతానా? నువ్వుకూడా నా మాట విని మాలో చేరు. విదేశాల్లో లెక్చర్లివ్వటానికి బయలుదేరు. ఆ దేశాల్లో భారతీయ ఆధ్యాత్మికఘనతను ప్రశంసించు. మనదేశంలో వాళ్ల ప్రజాస్వామ్యాన్ని ఆకాశానికి ఎత్తు. అప్పుడు నీకు కనకాభిషేకమే జరుగుతుంది......సరే, సాహిత్య సేవక మంత్రిగారికి వ్యాసం రాసి పెట్టాలిట. మళ్ళీ కలుద్దాం" అంటూ బయటికి దారితీశాడు నైతికపరాబు. ★

# "చైనా ప్రజా విజయం"

విశాలాకాశాన అరుణకాంతులు విరజిమ్ముతూ నిడివైన నదిలోని అలలమీదుగా, దూరాన గల దిజ్మండలంమీద నుంచి సూర్యుడుదయిస్తాడు. స్వర్ణ జలాలు కాంతితో కిల కిల లాడతాయి. ఈ విధంగా నవ చైనా కాంతి ప్రపంచానికి వెలుగు నిస్తుంది. "చైనా ప్రజావిజయం" అనే నూతన చిత్రం తాలూకు తొలి దృశ్యాలలో ప్రదర్శించబడిన చైనా ప్రజల ఉత్సాహ శక్తులు అదృష్ట పూర్వమైనవి.

సోవియట్ డాక్యుమెంటరీ స్టూడియో, పెకింగ్ ఫిలిం స్టూడియో కలిసి నిర్మించిన తొలి చైనీయ వర్ణ చిత్రం "రాజకీయ దృష్టిలోనూ, కళాదృష్టిలోనూ కూడా అత్యుత్తమమైనది" అని చైనా కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీ శిఫార్సు చేసింది.

నాలుగుసార్లు స్టాలిన్ బహుమానం పొందివున్న లియోనిడ్ వార్లామోవ్ నాయకత్వం కింద 25 మంది ప్రవీణులు 1949 సెప్టెంబరు 30 న పెకింగ్ చేరి, వెంటనే పనికి ఉపక్రమించారు. ఎందుకంటే ఆ మర్నాడే చైనా ప్రజా రిపబ్లిక్ అవతరణ మహోత్సవం. సమగ్రమైన రాజకీయ పరిజ్ఞానమూ, శిల్పదక్షతా ప్రదర్శిస్తూ వారా మహోత్సవాన్ని చిత్రించారు.

తరువాత వారు నాలుగు ముఠాలుగా చీలి, మధ్య దక్షిణచైనా ప్రాంతాన్ని విముక్తం చెయ్యడానికి పురోగమించే సేనల వెంట కదిలారు. నాన్కింగ్, షాంగ్ హై, నైరృతిచైనా, చౌషాన్ దీవులు మొదలైన చోట్ల జరిగిన యుద్ధదృశ్యాలనూ, విమోచనా దృశ్యాలనూ ఫిలిం కామెరాలు నేర్పుతో రికార్డు చేసినవి. అనంతరం కామెరాలు వెనుకకు తిరిగివచ్చి, చించో, ముక్డెన్‌ల వద్దా, పెకింగ్, టౌన్‌సిన్‌ల వద్దా, హువాయ్‌హోయ్ రంగంలోనూ జరిగిన ప్రచండయుద్ధాలనూ, యాంగ్సీనదీ తరణాన్ని కృత్రిమంగా రికార్డు చేసినవి. ఈ నాలుగూ చైనా ప్రజా విజయంలో విశిష్ట సంఘటనలు.

బాహ్యదృశ్యాలను తీయటానికి 8 నెలలు కష్టపడి పనిచేసి, దేశంలో చాలా ప్రాంతాలు పర్యటించినమీదట పూర్తి అయినవి. ఈ దృశ్యాలు ఎడిట్ చేసి, వాటికి రష్యను, చైనీయ భాషలలో కామెంటరీ జతపరిపించడానికిగాను సినిమటోగ్రాఫిక్ ఆర్ట్స్ బ్యూరో వారు ప్రసిద్ధ యుద్ధవ్యాఖ్యాత అయిన లియుపాయ్‌యూనూ, మరి ముగ్గురినీ మాస్కో పంపారు. కామెంటరీ తయారుచేసినవాడు విఖ్యాత సోవియట్ రచయిత కాన్‌స్టాన్టిన్ సిమొనోవ్. చైనా రష్యాలు కలిసి తయారుచేసిన ఈ కళాఖండం ఈ విధంగా ప్రజలలో పడింది.

చిత్రం ప్రారంభంలోనే ప్రజారాజధాని అయిన పికింగ్ నగరంపై బ్రహ్మాండమైన ఎర్రజెండా విచ్చుకుంటుంది. అధ్యక్షుడు మావో చైనా ప్రజారిపబ్లిక్ ప్రకటించడం తాలూకు ఉత్సవంయొక్క దృశ్యాలు ఉదాత్తంగా చూపబడ్డాయి. అనంతరం "ఫ్లాష్ బాక్"గా శ్రామికప్రజాజీవితం వివరించబడింది.

చైనా కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం కింద నడచిన విప్లవ సంఘర్షణలోని ప్రధాన ఘట్టాలు ఉద్దీపనకరంగా చిత్రించబడ్డవి. చికాంగ్‌షాన్ వద్ద పర్వతమయ ప్రదేశంలో మావోసేటింగ్, చూటేల నాయకత్వం కింద పోరాడే కొద్దివేలమంది దీక్షాపరులైన యోధులు, పది లక్షుల బలంగల కోమింటాంగ్ అభ్యుదయ నిరోధక సైన్యాన్ని తిప్పిగొట్టడం చూపబడింది. ఆ తరువాత పదేళ్లపాటు నడిచిన భూ విప్లవ దశలో ప్రజావిమోచనసేనలు ఏ విధంగా సంఘటిత పరచబడింది, 8 ఏళ్లపాటు జరిగిన జపాను వ్యతిరేక పోరాటమూ, నాలుగేళ్లపాటు జరిగిన విమోచనా యుద్ధమూ చూపబడ్డవి. విముక్తప్రాంతాలపై అమెరికా సామ్రాజ్యవాదులూ, వారి కీలుబొమ్మలైన కోమింటాంగ్ వారూ జరిపిన క్రూరమైన దాడులను చైనా ప్రజలు నిర్జించారు. అమెరికను ఆయుధాలు స్వాధీనపరచుకోబడి విమోచనార్థం వినియోగించబడ్డాయి. చైనా భూప్రాంతంమీదినుండి సామ్రాజ్యవాదులూ, వారి తొత్తులూ తరిమివేయబడ్డారు. అయిదు నక్షత్రాల జెండా (చైనా రిపబ్లిక్ జెండా) విజయోత్సాహంతో గగన వీధిన ఎగిరింది.

ఈ చిత్రాన్ని చైనాప్రజలు అమితంగా ఆదరించారు. వారు ప్రతి సూక్ష్మవిషయాన్నీ గ్రహించి హర్షించారు ! భేరీ వాయించేవాడి రౌద్రమూ, నూతన పికింగ్‌లో అమెరికా రాయబార కేంద్రంపైగల అమెరికను పతాక వికృతంగా వాలిపోవడమూ, యోనాన్ కొండలపై రాంబందులు మూగడమూ, ప్రజా చైనా శాంతి కాముకత్వచిహ్నంగా కొంగలు స్వేచ్ఛగా ఆకాశంలో ఎగరడమూ మొదలైనవి.

తమకు అభిమానపాత్రమైన ప్రదేశాలు మొట్టమొదటిసారి రంగులో తెరమీద కనిపించగానే ప్రేక్షకులు అప్రయత్నంగా హర్షధ్వానాలు చేశారు. చిత్రంలో ప్రదర్శించబడిన కళా కౌశాలాన్ని కవులూ,

(40-వ పేజీ చూడండి)



యూవాపిక్చర్స్ 'టింగురంగా'లో నటిస్తున్న క్రొత్తనటి ఆశాలత.



# వేమూరివారి కోడలు

(16 వ పేజీ తరువాయి)

చుట్టిఉన్న రెండుకాయలు కోసుకొనిపోవటానికి?'

ఆమె కొక అనుమానము తోచి... రెండు మూడు క్షణములలో దృఢపడి పోయింది. ఆమె కోపారుణనేత్రాలలో నుండి రెండు అగ్నిబాణాలు నైఋతిదిశగా బయలు దేరినవి.

సుంకర చంద్రమ్మగారి కోడలికి రెండేళ్ళక్రిందట్న పుట్టిన కొడుకు కాక తిరిగి గర్భము నాలుగవ నెల. బహుశః ఏమిటే... తప్పకుండా ఆమెకు రుచిచూపటానికే ఈ కాయలు అపహరింపబడినట్లుగా కామాక్షమ్మ మనోవీధిన ఋజువయిపోయింది. దానికి తగిన పరిహారముకొరకు ఆమె మనసు అహోరాత్రాలు విద్యుద్వేగముతో పని చేయ నారంభించింది.

* * *

కామాక్షమ్మ వేమూరివారి కోడలు. నిండుమనసుతో- తీయటి కోరికలతో- సర్వాంగసుందరమయిన దేహముతో పదిహేనవఏట ఆమె అత్తవారింటికి వచ్చింది. సుంకరవారింటి కోడలు చంద్రమ్మా, వేమూరివారి కోడలు కామాక్షమ్మా పదిరోజులు తేడాగా అత్తవారిళ్లలో పాదము పెట్టారు.

ఆ గ్రామములో సుంకర రమణయ్య కరణమూ, వేమూరి భావయ్య భూస్వామీను. ఇద్దరూ అన్నదమ్ములలా ఉంటూ ప్రతివిషయానికీ ఒకరి నొకరు సంప్రతించుకుంటూ ఉండేవారు.

ఈ యింటికీ ఆ యింటికీ కోడళ్లు జంటగా రావటమువల్ల ఆ గ్రామములోని అంగనలు తీరిక దొరికినప్పుడూ, నీలాటిరేవులోనూ- కోడళ్ల చక్కదనాన్ని గురించీ - వారు తెచ్చిన సారెలను గురించీ సమీక్షలు చేయటము మొదలుపెట్టారు.

"కామాక్షమ్మ ముఖము చూస్తేనే కడుపు నిండుతుంది. కళ్లల్లో లక్ష్మి తాండవమాడుతున్నది." అని దీక్షితులగారి భార్య అనీఅనకముందే, "ఏం బాగుంది ఆ పిల్లముఖము? తెలుపయినా కంటికింపుగా ఉండద్దూ? చామనచాయలోకూడా కళగల ముఖము సుంకరవారి చంద్రమ్మది: నీ వెన్నన్నా అను, లక్ష్మిదేవి అడుగుపెట్టినట్టుగా పెద్ద ఎత్తులో సారె తెచ్చింది. గదిసామానులు కూడా బోలెడు తెచ్చింది," అని పదిమంది తోటిస్త్రీలూ కలిసి నిర్ణయముచేసేశారు.

మరునాటికల్లా సుంకరవారి కోడలు కలవారియింటి ఆడపడుచకనుక నలుగురి నోటా మంచిదయి, సుందరి అయి, గ్రామంలో పేరుపొందింది. వాయుప్రసారముతోపాటు ఈవార్తలు కామాక్షమ్మఅత్తగారిచెవులకు సోకినవి. అంతవరకూ కామాక్షమ్మ కాలిమట్టెల రవళితో రాగాలాపన చేసే అత్తమామల హృదయాలు మారి అసంతృప్తిఛాయలు వాళ్ల ప్రవర్తనలో, ద్యోతకమవుతూఉండేవి.

క్షణికపాటయినా విరామ మెరుగకుండా శరీరకష్టము చేసి చూసింది కామాక్షమ్మ. వినయ విధేయతలతో అత్తమామలకూ, భర్తకూ శుశ్రూషలు చేసింది. కాని ఎంత చేసినా వాళ్ల దృష్టిలో సుంకరవారికోడలు అందకత్తె- పెద్దఎత్తులో సారె తెచ్చినదీ- కామాక్షమ్మ అందవికారము గల పేదయింటి బాలికాను.

ఇట్లా ఉండగానే సుంకరవారి కోడలు కాపురానికి వచ్చిన రెండేళ్లకే పండువంటి పాపడు పాలబుగ్గలతో నట్టింట అంబాడుతూ జన ముద్దుబిడ్డడైనాడు.

"వస్తుసామగ్రితో అడుగుపెట్టిన కోడలు మనమలతో ఇల్లు కళకళలాడిస్తున్నది సుంకరవారి చంద్రమ్మ. మన పెద్దమ్మ చూడు వట్టి చేతులతో ఇంట ప్రవేశించింది ఇంతమటుకూ బిడ్డా లేదు, పాపా లేదు," అని దినానికి పదిసార్లయినా ఆ విషయాన్ని నెమరుకు తెచ్చుకొనేవారు- కామాక్షమ్మ అత్తమామలు. అడుగడుగునకూ తిట్లూ శాపనార్థాలు కామాక్షమ్మకు తగులుతూఉండేవి అప్పటినుండీ.

దైవికముగా తనపట్ల జరిగే పక్షపాతమునకు కామాక్షమ్మ ప్రారంభములో లక్ష్యపెట్టలేదు గాని, నానాటికి హైన్యదశను పొందుతున్న ఆమె దైనికజీవితము రాను రాను దుర్భరమయిపో నారంభించింది. అది మొదలు ఆ యింటి మట్టినేల కామాక్షమ్మ కాళ్లకు కాలిన ఇనుపరేకువలె చురచుర మండ నారంభించింది. శిరీషకుసుమకోమలమైన ఆమెహృదయము క్రమముగా రాటుదేలి జుగుప్సాసూయలకు ఆలవాలమైపోయింది. అమృతమయమై, అనురాగమునకు నిలయమైన ఆమెహృదయము విషసంకీర్ణమయిపోయింది.

కాలము నిర్మొగమాటి. కామాక్షమ్మ పరిస్థితులతో సానుభూతి చూపించకుండానే... నిర్దాక్షిణ్యముగా నడచిపోతునే ఉన్నది.

"తోటివారి అదృష్టము చూడు, మన అదృష్టము చూడు... ఏది ఎట్లా ఉన్నా కడుపున ఒక కాయ కాస్తేఅయినా బాగుండును," అని తలపోసి తలపోసి కామాక్షమ్మ మామగారు దాటిపోయినాడు.

మరుసంవత్సరము పంటలో నష్టము వచ్చింది! "ఇనుపగజ్జెల తల్లి- ఇంట ప్రవేశించినదగ్గరనుండీ అంతా తుడుపే," అంటూ అత్తగారు సాధించిపోసింది.

కామాక్షమ్మమనసు సాధింపులకు కాఠిన్యపడి శిలామయమయిపోయినది.

అత్తవారిళ్లలో అడుగుపెట్టటముతోనే ప్రతివిషయములోనూ పోటీలు రావటమువల్ల కామాక్షమ్మకూ- చంద్రమ్మకూ సన్నివేశాలూ- సమావేశాలూ కలుగనేలేదు. సుంకరవారికోడలిని ఉదయాస్తమానాలు పొగిడి పూజించినకొద్దీ... తన దురదృష్టానికంతకూ ఆమే కారకురాలన్న అపోహ బీజరూపమున కామాక్షమ్మఎదలో నాటుకొనిపోయి - నీరుచల్లిన నారువలె పెరుగ నారంభించింది. దీనికి పర్యవసానముగా చంద్రమ్మతో పరిచయములేని కామాక్షమ్మ చంద్రమ్మవిషయము రాగానే ఆడతాచువలె కస్సుమనటమూ- అపశ్రుతిగా మాట్లాడటమూ ప్రారంభించింది.

తరువాత కొద్దికాలానికే కామాక్షమ్మ గర్భము ధరించినా అత్తగారు చూచి ఆనందించే భాగ్యము కలుగలేదు. బిడ్డతల్లిఅయినా కామాక్షమ్మహృదయము మార్పు చెందలేదు.

పోయినంత పొడుగునా పెద్దమ్మవారి సాహచర్యము కామాక్షమ్మకు తప్పినట్లు లేదు! ఒక్కక్షణమయినా విడిచిఉండని ప్రేమకాబోలు! కామాక్షమ్మకూ చంద్రమ్మకూ కోడళ్లు వచ్చారు. ఈ తరములో

కూడా గెలుపు చంద్రమ్మదే! ఆమెకోడలే ముందుగా బిడ్డలతల్లి అయింది!

*    *    *    *

జామకాయల దొంగతనము జరిగిననాటి నుండీ కామాక్షమ్మ హృదయావేదన ప్రజ్వలిస్తూనే ఉన్నది. అక్కసుతోనే ఆమెకు కడుపు నిండిపోయింది.

చీకటిపాటున ఊరిబయట ఉన్న మాలశాయన్నను సలహా అడిగి- చంద్రమ్మ కోడలి గర్భము విచ్ఛిత్తి కావటానికి తుడుపు మంత్రాలతో గుమ్మడికాయను భూస్థాపితము చేయించింది గాని ఏమి పొరపాటు జరిగిందో మరి... నవమాసములు నిండిన తరువాత చంద్రమ్మకోడలు చక్కటి పిల్లవాడిని కన్నది!

అప్పటినుండీ తిరిగి నూతనోపాయాల కొరకు కబుర్లు మాలశాయన్నకు చేరుతూనే ఉన్నాయి. ఏవిధానగానీ చంద్రమ్మకు నష్టము కలగాలి- కామాక్షమ్మ నిద్రపోవాలి.

నాలుగురూపాయలు చేత వేసుకొని చేగడు గన్నేరుపప్పులు పంపాడు శాయన్న, తినే పదార్థాలలో నూరి కలిపితే ఆమె కోరికలు ఈడేరుతాయని.

ఈ యింటిమీద కాకి ఆ యింట వాలక ఎన్ని సంవత్సరాలయినదో! ఈ తినుబండారము వాళ్లకు చేరే మార్గమూ- పట్టుపడని విధమూ ఎంత యోచించినా కనబడక కొట్టుకుంటున్న కామాక్షమ్మ సుంకరవారి మనమడిని చాకలివాడు సాయంత్రపు వేళ ఎత్తుకొని బజార్లవెంట తిప్పటము గమనించింది. మరునాటి సాయంత్రము గారెలు చేసేటప్పుడు ప్రత్యేకముగా రెండు గారెలను గన్నేరుపప్పులు కలిపి చేసి సిద్ధముగా వాకిట నిలబడి ఎదురుచూస్తున్నది.

సుమారు ఆరుగంటలవేళ- తెల్లటి నుదుటి మీద నల్లటి చాదుచుక్క పెట్టుకొని, దోరమామిడిని మించిన తొక్కుపలుకులతో చూపరులను మురిపిస్తూ చాకలివాని చెయ్యి పట్టుకొని రెండేళ్ల బాలుడు ఆ వీధిన వస్తూ ఉండటము ఆమెకంట పడ్డది.

వెంటనే ఆమె అరుగుమెట్లు దిగి వాకిలి దాటి బాలుని సమీపించి "ఎంత ముద్దుగా ఉన్నావురా బాబూ! ఎత్తుకుంటాను వస్తావా!" అంటూ బలవంతముగా చంకపెట్టుకొన్నది.

చాకలివాడు వద్దంటూనేఉన్నాడు. పిల్లవాడు రానని మెలికలు తిరుగుతూనే ఉన్నాడు-ఆమె వేటినీ లక్ష్యపెట్టకుండా తిన్నగా వంటయింటిలోకి వెళ్లి- ప్రత్యేకముగా తీసిపెట్టిన గారెలకొరకు చూసింది. పాపిష్టిపిల్లి కాబోలు బోర్లించిన పళ్లెము మీదికి దూకినట్లున్నది- ప్రత్యేకంగా తీసిపెట్టిన గారెలు రెండూ గిన్నెలో ఉన్న గారెలతో కలిసిపోయినవి!

మానసికముగా బయలుదేరిన ఆందోళనను ప్రయత్నపూర్వకముగా తగ్గించుకొని...ఆ గిన్నెడుగారెలలోనుండి ఏరిఏరి రెండు గారెలను పిల్లవానిచేతి తినిపించి గ్లాసెడు నీళ్లు త్రాగించి 'వెళ్తావా బాబూ! అంటూ చాకలివానిచేతి కిచ్చింది.

తెల్లవారి ఎండ ఎక్కినా తల్లి లేవలేదు' కారణ మేమని కొడుకు చేతితో తట్టి లేపపోతే చల్లగా తగిలింది కామాక్షమ్మ దేహము.

ఆందోళనతో వైద్యుని పిలిపించి చూపించాడు.

"ఒక రాత్రి వేళ ప్రాణము పోయి ఉంటుంది. ముందుగా తెలిస్తే ఏదయినా ప్రయత్నము చేసేవాడిని," అన్నాడు వైద్యుడు.

"ఆమె కేమీ జబ్బులేందే ముందుగా ఎట్లా తెలపను? రాత్రి నాకు భోజనము పెట్టి- తాను గారెలు ఫలహారముచేసి పడుకొన్నది. ఎప్పటివలె లేస్తుందనుకున్నాను," అంటూ కొడుకు కంటతడిపెట్టాడు●



# బొమ్మరిల్లు


**బాలగేయం:**

## మా బడిబండారం

శ్రీ చెరుకుపల్లి కోటీశ్వరరావు

విన్నారండీ, మీ రీ విషయం ?
(వినకపోతే, వినండి చెప్తా)
వినండి, మా బడి బండార మ్మిది.
కుర్చీ ల్లేవూ, బెంచీ ల్లేవూ,
బొమ్మలు లేవూ, బంతులు లేవూ ;
కాని...మా బడి అంతా
బెత్తాల మయం,
చీకటి మయం,
పంతులు భయం,
నరకం నయం - ॥వినా॥
పాఠాల్లేవూ, పద్యా ల్లేవూ.
ఎక్కా ల్లేవూ, లెక్క ల్లేవూ;
నోటికి తాళం,
చేతులకు తాళం,
కాళ్లకు తాళం
వెయాల్సి.
ఒకటి కొచ్చినా, రెంటి కొచ్చినా,
కదలక, మెదలక, గుళ్లో దేవుడు
మల్లే అల్లా ఉండాల్సిందే.
॥విన్నా......
గుర్రుగుర్రు మని గురకలు పెడుతూ
కుంటి కుర్చీలో కునుకుతు, జోగుతు
కలలు కంటూ, కలవరిస్తూ,
పలకరిస్తే పళ్లు కొరుకుతూ,
ప్రళయ శివుడివలె తాండవించుతూ,
కపట మ్మెరుగని కసిగందులపై
విరుచుకపడి నలుచుకు తింటూ
ఈడు జోడు లేని చింతావారి
పెద్దమ్మాయితో 'పెళ్లి' చేస్తాడు,
మా పంతులు ॥విన్నా.....
ఆటలు లేవూ, పాటలు లేవూ,
గంట లేదు, గడియారం లేదూ,
గుర్రుపెట్టే పంతులు గారికి
మెలుకువ వచ్చి పంపందాకా,
చెంగుచెంగునా గంతులు వేస్తూ
ఇంటికి పోయే గతులూ లేవు.
మెతుకులు గతికే భాగ్యం లేదు.
॥విన్నా....
యమ లోకానికి బ్రాంచి మా బడి,
యముని గుమాస్తా మా బడిపంతులు
* * * * * *
విన్నారా, మా బడి బండారం?

బొమ్మరిల్లు సీరియల్:




మధ్యాహ్నం బడినుంచి విచారంగా యింటికి వచ్చిన టామ్‌కు పోలీపెద్దమ్మ ఎదురుపడింది. ఆవిడ ధోరణి చూస్తే మీద విరుచుకు పడేలా వున్నది.

"టామ్! నిన్ను చర్మం ఒలిచినా పాపం వుందిరా?"

"నే...నే...నే నేం చేశాను పెద్దమ్మా?" అని బిత్తరపోయి అడిగాడు టామ్.

నువ్వా? నన్ను తెలివితక్కువ దద్దమ్మని చేశావు. నువ్వు చెప్పిన కల నిజమని ఎల్లా నమ్మానో? తీరా జోహార్పర్ యింటికి వెళ్లి వాళ్లమ్మతో చెబుదను గదా, ఆవిడ దగ్గిర తల కొట్టేసినంత సిగ్గేసింది. నువ్విక్కడికి నిజంగా వచ్చి అదంతా చూశావని, జో ఆవిడతో చెప్పాట్ట. ఎంత భండాలుడివిరా నువ్వు?"

పెద్దమ్మతో కలని గురించి కోతలు కోసినప్పుడు, జో అనేవాడొకడున్నాడని, వాడి ద్వారా అసలు విషయం తెలియవచ్చనీ టామ్‌కి జ్ఞాపకం రాలేదు. తను చేసిన పనికి కుంగిపోతూ తల వంచుకున్నాడు.

"పెద్దమ్మా! నీతో అల్లా అబద్ధమాడటం తప్పే. అబద్ధమాడకూడదని అప్పుడు నాకు తెలవలేదు," అన్నాడు టామ్.

పెద్దమ్మ మళ్ళీ విరుచుకుపడింది.

"నీ కేమీ తెలియదురా పాపం! బుల్లి పాపాయివి. మేమొక మూాలలబో మని ఏడుస్తుంటే మమ్మల్ని చూసి నవ్వటానికి జాక్సన్ లంకనించి రావటం తెలుసుగాని అబద్ధమాడకూడదని తెలవదు, ఏం?"

"కాదు పెద్దమ్మా! నేను చేసిందంతా తప్పే కాని, మిమ్మల్ని చూసి నవ్వటానికి రాలేదు అవ్వాళ."

"మరెందుకు వచ్చావ్?"

"మేము మునిగిపోలేదని, మా కోసం ఏడవొద్దనీ చెప్పటానికి ఒచ్చాను."

"అదుగో మళ్ళీ అబద్ధాలు. అయితే మరిఆముక్క చెప్పలేదేం."

"ఎందుకనంటే, మీరు మా కర్మకాండని గూర్చి మాట్లాడుతుంటే, సరిగ్గా ఆదివారంనాటికి వచ్చి హఠాత్తుగా ఎదటపడి గమ్మత్తు చెయ్యాలని ఆలోచన తట్టింది. అంచేత ఆ తాటి మట్టని మళ్లా జేబులోనే పెట్టేసుకున్నాను," అన్నాడు టామ్.

"తాటి మట్టేమిటి?"

"అదేలే పెద్దమ్మా! మేము సముద్రపు దొంగతనాలు చెయ్యటానికి వెళ్లినట్టు తాటిమట్ట మీద రాసి నీ బల్లమీద వుంచడానికి తెచ్చా. నేను నిన్ను ముద్దుపెట్టుకున్నప్పుడే నువ్వు లేస్తే ఎంతో బావుండునని పిస్తోందిప్పుడు.

పెద్దమ్మ కోపం హఠాత్తుగ తగ్గింది.

"టామ్! నిజంగా నువ్వు నన్ను ముద్దుపెట్టుకున్నావురా?"

"నిజం పెద్దమ్మా!"

"ఒట్టేనా?"

"ఒట్టు. నీ తోడు."

"నన్నెందుకు ముద్దుపెట్టుకున్నావో చెప్పు."

"నువ్వంటే నాకంత ప్రేమ పెద్దమ్మా! నువ్వు ఏడుస్తూ పడుకునుంటే నేను చూడలేకపోయాను."

ఈ మాటలు నిజమే నేమో అనిపించింది పెద్దమ్మకి. "సర్లే. ఇక బళ్ళోకిపో," అని టామ్‌ని బడికిపంపింది.

టామ్ వెళ్ళగానే ఆమె టామ్ జాక్సన్‌ద్వీపానికి తోడుకున్న వెళ్ళిన చొక్కా వెదికి తీసింది. దాని జేబులో చెయ్యి పెడదామా వద్దా అని ఆలోచించింది.

"టామ్ అబద్ధాలకోరు అయినా వాడిందాక చెప్పిన అబద్ధం నాకు కాస్త మనశ్శాంతి నిచ్చింది," అనుకుంది. టామ్ మాటలు అబద్ధమని తేల్చుకోవటానికి ఆమెకి ధైర్యం చాలలేదు. అయినా చివరికి తెగించి జేబులో వెదికింది. అందులో టామ్ చెప్పిన తాటిమట్ట కనిపించింది. దానిమీద అక్షరాలు చదువుకుని," "వాడికి నేనంటే నిజంగా ప్రేమే! అనికన్నీళ్లురాల్చింది సంతోషంతో.

టామ్ బడికి వెళ్లేటప్పటికి మనస్సు తేలికపడి సంతోషంగా వున్నాడు. అందుచేత బెకీథాచర్ కనిపించగానే,

"బెకీ! పొద్దున నిన్ను అవమానం చేసినందుకు ఏమీ అనుకోకు. ఇంకెప్పుడూ అల్లా చెయ్యను. మనిద్దరం స్నేహంగా వుండొద్దూ," అన్నాడు.

బెకీ ఆగి అతనికేసి చూసి, అసహ్యంతో ఇలా అంది. "నీ స్నేహం కోసం ఇక్కడెవళ్లూ మొహం వాచిపోలా. నీకూ నాకూ ఇకనించీ మాటలు లేవు."

టామ్‌కి యీ మాటలు మొట్టికాయల్లా తగిలాయి. ఏమంటానికీ తోచలేదు. "మాట్లాడకపోతే నాకు దిగులా?" అందామనుకున్నాడు గాని అప్పటికి బెకీ వెళ్ళిపోయింది. బెకీగనక మొగపిల్లాడయితే తను ఎల్లా ఉతికేసివుండేవాడో ఆలోచించుకున్నాడు. బళ్లోకి వెళ్లేటప్పటికి బెకీ మళ్ళీ కనిపించింది. ఆమెని దాటిపోతూ పోతూ ఒకమాట అన్నాడు. దానికామె ఫెడీమని జవాబు చెప్పింది. టామ్‌కి మేష్టారు బెత్తం పెళ్లి ఎప్పుడు చేస్తారా అని ఎదురు చూస్తోం దామె. కాని ఇంతలో ఒక ప్రమాదం జరిగింది.

మేష్టారి పేరు డాబిన్స్. పాపమాయన చిన్నతనంలో తను గొప్ప డాక్టరు కావాలని ఆశలు పెట్టుకున్నాడు. కాని చివ్వరికి బడిపంతులు గతి పట్టింది. ప్రతిరోజూ బళ్ళో వున్నప్పుడు తన డ్రాయరులో నుంచి పెద్ద బైండుపుస్తకం తీసి చాటుగా పెట్టి చదివేవాడు. క్లాసులో పాఠాలు చెప్పటం అయిపోయింతరవాత రోజూ ఆయనకిదే పని. చివరికి పుస్తకాన్ని నిట్టూర్పులతో మూసేసి, డ్రాయర్లో పెట్టి, తాళం గట్టిగా బిగించేవాడు.

బళ్ళో పిల్లలు ఆ పుస్తకం ఏమిటో తెలుసుకోటానికి ఊరికే ఇదయ్యేవారు. కాని ఎప్పుడూ వీలు చిక్కేదికాదు. ఒకడు ఆ పుస్తకం మ్యాజిక్‌పుస్తకమనేవాడు. మరొకడు లెక్కల పుస్తకమనేవాడు. అంతేగాని అది ఫలానా పుస్తకమని ఏ ఇద్దరూ ఎప్పుడూ ఒప్పుకోలేదు.

అప్పటికింకా మేష్టారుగాని, పిల్లలుగాని ఇంకా ఎవళ్లూ రాలేదు. బెకీ అటు పోతూ పోతూ ఆ గదిలోకి తొంగిచూసింది. మేష్టారి డ్రాయరుకు తాళంచెవి పెట్టివుంది. ఆయన అది తీసుకువెళ్లటం మర్చిపోయాడు. ఆ పుస్తకం చూట్టానికిదే మంచి సమయం. మళ్ళీ అల్లాంటి సమయం రాదు.

మరొక క్షణంలో బెకీ చేతుల్లో ఆ రహస్యమైన పుస్తకం వుంది. అది వైద్యశాస్త్రంమీద రాయబడిన పుస్తకం. అందులో బొమ్మలు తిరగేస్తూవుంది బెకీ. ఇంతలో పుస్తకంమీద నీడపడింది. బెకీ తుళ్ళిపడి వెనక్కి చూసింది. టామ్ సాయర్ నవ్వుతూ నుంచున్నాడు. గబుక్కున పుస్తకం మూసెయ్యటంలో బొమ్మవున్న ఒక పేజీ పర్రున చిరిగింది. డ్రాయర్లో పెట్టి

తాళం వేసేసి చేతుల్లో మొహం కప్పుకుని ఏడవసాగింది బెకీ. ఆమె మొహం సిగ్గుతోనూ, అవమానంతోనూ కందగడ్డలా అయిపోయింది.

"టామ్‌సాయర్! నీకు సిగ్గు లేదూ ఇంకోళ్ల విషయాలు చూడటానికి?" అన్నది.

"నాకేం తెలుసు, నువ్వా పుస్తకం చూస్తున్నావని?" అన్నాడు టామ్.

"ఛీ, నాతో మాట్లాడబోకు. నాకు తెలుసు మేష్టారితో ఈ సంగతి ప్రితీ చెబుతావని. అమ్మో, నన్ను మేష్టారు కొట్టేస్తాడు. ఇంతవరకెప్పుడూ నేను బళ్ళో దెబ్బలు తినలేదు." అని ఏడుస్తున్నది బెకీ.

"సర్లే చెప్పుకో అనుభవిస్తాను. నీకూ తగుల్తాయిలే ఇవ్వాళ దెబ్బలు. ఆగు నీ తిక్క కుదురుతుంది.'' అని ఏడుస్తూ అవతలకు వెళ్ళిపోయింది.

టామ్ అక్కడే నిలబడిపోయాడు.

"ఎప్పుడూ దెబ్బలు తినలేదుట. పాపం భయపడిపోతోంది పిల్ల. ఏం దెబ్బలు తింటే ఒకసారి? ఈ ఆడపిల్లలు వట్టి పిరికి మొద్దులు. నేను బెకీ మీద ప్రితీలు చెప్పను. మేష్టారు ఆ పుస్తకం ఎవరు తీశారని అందర్నీ వరసగా అడుగుతాడు. బెకీని అడిగేటప్పటికి ఆమె మొహమే చెబుతుంది చేసిన పనిని. అప్పుడు మేష్టారు కొడతాడు," అనుకుంటూ టామ్ వరండాలోకి వెళ్లిపోయాడు.

కాస్సేపటికి మేష్టారు వచ్చారు. పిల్లలంతా ఎవళ్ల చోటులో వాళ్లు కూర్చున్నారు. బెకీని గురించే ఆలోచిస్తున్న టామ్‌కి మేష్టారి గద్దింపు వినబడింది. కాంపోజిషన్ పుస్తకం మీద సిరా మరక చూసి ఆయన టామ్‌ని పిలిచాడు.

బెకీ తన సంగతి కాస్సేపు మర్చిపోయింది. పాపం టామ్ దెబ్బలు తినబోతున్నాడు. అతడు సిరా పొయ్యలేదని, ఆల్ప్రెడ్ టెంపుల్ పోశాడనీ, లేచి చెబుదామనుకుంది. కాని, ఎల్లాగూ తనమీద టామ్ ప్రితీ చెబుతాడు కదా, అతని మీద కసి తీర్చుకోవద్దా, అనుకుని లేవలేదు.

టామ్ కిమిగా లేచాడు. కుయ్ కయ్ మనకుండా దెబ్బలన్నీ తిన్నాడు. తనే ఎప్పుడో అటూయిటూ గెంతుతూ సిరా ఒలకపోసి వుంటానని అనుకున్నాడు. అయితే బళ్లో ఆచారప్రకారం తను ఒలకపొయ్యలేదని మాత్రం అన్నాడు. ఎల్లాగూ దెబ్బలు తప్పవుగా.

ఒకగంటసేపు పాఠాలు చెప్పారు మేష్టారు. తరువాత ఆవులించాడు, వళ్లు విరుచుకుని, కళ్లు నులుపుకుని, డ్రాయరు తాళం తీశాడు. పుస్తకం చేత్తో పుచ్చుకుని తెరుద్దామా వద్దా అని తటపటాయించాడు. చివరికి తెరిచి చదవటానికి ప్రారంభించాడు.

టామ్ బెకీకేసి చూశాడు. వేటకాడి చేతిలో చిక్కిన లేడిలా గజగజ వణుకుతోంది ఆమె. టామ్ ఆమె మీద కోపమంతా మర్చిపోయాడు. ఏదో ఒకటి చేసెయ్యాలి త్వరగా...

మేష్టారు కుర్చీని వెనక్కి బర్రున తోసి ధన్‌మని నుంచున్నాడు. చింతనిప్పులవలె మండే ఆ కళ్లు చూసి అమాయికులుకూడా వణుకుతున్నారు. ఇంతలో ఒక గర్జన వినబడ్డది.

"ఈ పుస్తకం ఎవరు చింపారు?"

నిశ్శబ్దం. క్లాసంతా చీమ చిటుకుమంటే వినబడే నిశ్శబ్దం.

"బెన్ రోజర్స్ నువ్వేనా?"

"కాదు సార్."

"జోసెఫ్ హార్పర్-నువ్వా?"

"కాదు సార్."

మేష్టారు మొగపిల్లలందరినీ ఒకసారి పరకాయించి చూసి ఆడపిల్లలవేపు తిరిగాడు.

"అమీలారెన్సు?" అడ్డంగా తలవూపింది.

"గ్రేసీ మిల్లర్?"

ఉహూ.

"సుసాన్ హార్పర్?"

కాదు. పక్కనున్నది బెకీథాచర్.


"రెబెక్కాథాచర్! ఈ పుస్తకం నువ్వేనా తీసింది. తలెత్తు. నాకేసి చూడు. ఈ పుస్తకం తీశావా?"

టామ్ బెకీకేసి చూశాడు. ఆమె మొహంలో నెత్తురు చుక్కలేదు..

టామ్ హఠాత్తుగా లేచి అరిచాడు. "నేనే సార్ తీసింది," అన్నాడు.

పిల్లలంతా టామ్ ఇంత తెలివితక్కువపని ఎల్లా చేశాడా, అని తెల్లబోయి చూశారు. మేష్టారి బల్ల దగ్గరికి వెడుతూ టామ్ బెకీకేసి చూశాడు. తనని టామ్ రక్షించినం

(45-వ పేజీ చూడండి)



అనగనగా ఒక వూళ్లో ఒకడు కట్టెలు కొట్టుకుని జీవిస్తూవుండే వాడు. అతనికి ఒక మంచి భార్య వుండేది. వారికి ఒక కొడుకు, ఒక కూతురు. ఇలా వుండగా కొంత కాలానికి భార్య చనిపోయింది. రెండ పెళ్లి చేసుకొన్నాడు. ఈమె బలే గయ్యాళిది.

ఇలా వుండగా ఆ వూళ్ళో పెద్ద కరువు సంభవించింది. తింటానికి తిండి, కట్టకోటానికి బట్ట కరువైపోయాయి. పేదవాళ్లు ఆకు అలం తిన వలసివచ్చింది. నిరుపేదలు తమ భార్యల్ని, బిడ్డల్ని అమ్ముకుంటు న్నారు.

మన కట్టెల్ని కొట్టుకుని జీవించేవాని ఇంట్లో నాలుగు బస్తాల ధాన్యంమాత్రమే వుంది. ఆనాలుగు బస్తాలు అయిపోయినట్లయితే వారికి ధాన్యం దొరకదు. ఆ గయ్యాళిభార్యకు ఒక ఆలోచన తట్టింది., తన మారుటి కొడుకుని, కూతుర్ని హతమార్చితే తాము సుఖంగా బ్రతుకవచ్చునని, భర్తచెవిని ఇలుకట్టుకుని పదేపదే వేగించుకున్నది. కూతుర్ని, కొడుకుని కట్టెలు కొట్టటకు వెళ్ళినప్పుడు అడవిలో విడిచి వచ్చేద్దామని పోరింది. భార్యమీద వుండే మోహం చేత చివరికి అతడు ఒప్పుకోనక తప్పింది గాదు. వారి దురుద్దేశ్యాన్ని గ్రహించిన చెల్లెలు సంగతిఅంతా అన్నతో చెప్పి భోరున యేడ్చింది. "దిక్కులేనివారికి దేముడే దిక్కు, ధైర్యం తెచ్చుకో, మనకు దేవుడు తప్పక సాయం చేస్తాడు" అని అన్న, చెల్లెల్ని ఓదార్చాడు. అన్న ఏదో ఉపాయం పన్ని, చెల్లెలి చెవిలో నెమ్మదిగా చెప్పాడు. చెల్లెలు సంతోషంతో గంతులువేసింది.

మరునాడు కుట్రపన్నిన విధంగా కొడుకుని, కూతుర్ని వెంటబెట్టుకుని ఆ తలిదండ్రులు అడవికి బయలుదేరారు. బయలుదేరేముందు ఎవరికీ తెలియకుండా జాగ్రతగా కొడుకు జేబులనిండా ధాన్యంపోసుకున్నాడు. వారు వెళ్ళే దారిపొడుగునా ఒక్కొక్క ధాన్యపు గింజ జారవిడుస్తూ నడిచాడు. అడవిలో కట్టెలుకొట్టుకునే పని పూర్తిఅయ్యే టప్పటికి చాల ప్రొద్దుపోయింది. బాగా అలసటచెంది ఉండటంవల్ల అన్న, చెల్లెళ్లకు గాఢనిద్ర పట్టింది. వాళ్లకు మెలకువ వచ్చి చూసేసరికి తల్లిదండ్రులు కనపడలేదు. ఎటు చూసినా అరణ్యమే. జరుగబోయే సంగతి వారికి ముందుగానే తెలిసి ఉండటంవల్ల వారు గొల్లున ఏడ్వలేదు. చెల్లెలి చేయిపట్టుకుని, అన్న దారిపొడుగునా జారవిడుస్తూ వచ్చిన ధాన్యపు జాడల్ని అనుసరించి ఇల్లుచేరుకొనే వుద్దేశ్యంతో నడుస్తున్నాడు. కొంతదూరం వచ్చేసరికి ధాన్యపుగింజలు ఎటు చూసినా కనపడలేదు. పాపం అన్న వేసిన ధాన్యపుగింజల్ని అడవిలోని రకరకాల పిట్టలు వాలి ముక్కులతో పొడుచుకుని ఎత్తుకుపోయాయి. దారి తెలియక ఇద్దరూ అల్లాడి పోయారు. "నాన్నా, నాన్నా" అంటూ ఏడుస్తూ, కేకలువేస్తూ అడవిఅంతా అల్లాడిపోతున్నారు.

కాలం గడచిపోతూవుంది. కాని అక్కడనుంచి బైటపడే మార్గం వారికి కనపడలేదు. ఎలాగో ధైర్యం చిక్కబట్టి రోజులు గడుపుతున్నారు. పైగా క్రూర అడవిజంతువులు వారి జోలికి పోవటంలేదు. ఇలా వుండగ వుండగా ఒకరోజు వారికి ఆ అడవిలో ఒక ఇల్లు కనబడింది. 'ఈ నిట్టడవిలో ఇల్లువుండటమేమిటి. చుట్టుప్రక్కల ఎవరూ

లేరే' అని ఆశ్చర్యపోయారు. ఎలాగో ధైర్యం చిక్కబట్టుకుని ఆ ఇంట్లో ప్రవేశించారు. లోపలకు అడుగు వెయ్యగానే పంజరంలో బంధింపబడిన చిలక ఒకటి కిచకిచమని గోలపెట్టటం మొదలుపెట్టింది. "అరె! ఎందుకిలా అరుస్తూవుంది" అన్నాడు.

"పారిపోండి. అది వచ్చేవేళ అయింది. వెళ్లిపోండి" అని ఆ పక్షి స్త్రీకంఠస్వరంతో పలికింది.

"అరె! విచిత్రంగా వుందే! పక్షి యేమిటి మాటలాడట మేమిటి? పక్షిరూపంలో వున్న రాక్షసివి కావుగదా! నిజం చెప్తావా? లేదా?" అని గంభీరంగా అన్నాడు.

"నేనెవరినైతే నేం" మీ మేలు కోరే చెబుతున్నా. ఈ ఇల్లు ఒక పిశాచిది. మానవులు కనపడ్డారా వారిని మచ్చికచేసికొని పెంచి, చివరకు నిర్దాక్షిణ్యంగా చంపి తింటుంది. లేదా ఏ రాయిగానో, చెట్టుగానో, పక్షిగానో మార్చివేస్తుంది. ఇకనైనా ఆలస్యంచేయక పారిపోండి" అన్నది పక్షి.

ఈ మాటలకు చెల్లెలు కంపించిపోయింది. "ఈ పిశాచిబారి పడేకంటే ఏ పులో, పుట్టో మ్రింగివేసివుంటే బాగుండును" అన్నది కంటనీరు పెడుతూ. అన్న ధైర్యం వహించి పక్షితో "నీ మేలు మరిచిపోము. ప్రాణాలపై ఆశ వీడిన మాకు ఎట్టి భయమూ లేదు. ఇంతకీ నీవెవరో తెలిసికోవాలని ఆతృతగా వుంది. నీకు యేమైనా సాయం చేయగలిగితే తప్పక చేస్తాము" అన్నాడు.



"మీ ధైర్యసాహసాలకు, నాపై గల అభిమానానికి నమస్కారాలు. నేనొక రాజకన్యను. ఈ పిశాచి నన్ను ఎత్తుకుని వచ్చింది, కాని నా సౌందర్యాన్ని చూసి ముగ్ధురాలయి నన్ను చంపి తినలేక పక్షిగా మార్చి పెంచుకుంటూ వుంది" అని ఇంకా యేదో చెప్పబోయింది పక్షి.

ఇంతలోకే భయంకరమైన వికృతమైన నవ్వు వినిపించింది. చేతిలో వున్న కర్ర చప్పుడు చేసికొంటూ పిశాచి వచ్చింది. తెల్లటి దుస్తుల్ని ధరించింది. విరబోసుకున్న జుట్టు. నడుం వొంగివున్నది. చింతనిప్పుల వలె యెర్రని కళ్లు, ఆ వింత ఆకారాన్ని చూచి అన్న, చెల్లెలు భయపడ్డారు.

"ఏమి నాయనా, ఏమి తల్లి, అలా భయపడుతున్నారు? నేను మీ మామ్మను కదూ?. మీ ఇష్టమువచ్చినట్లు వుండండి నాయనా ఇక్కడ. మీరు అడవిలో వున్నట్లున్నారు. ఏమీ విచారపడకండి. మీకు కావలసినంత డబ్బు ఇస్తాను. ఇష్టమైన తిండి పెట్టాను. హాయిగా వుండండి. ఇదుగో ఈ గదిలో చూడండి, కోరిన ఆహారమల్లా దొరుకుతుంది. ఆ గదిలో చూడండి రత్నాల రాసులు. హాయిగా వుండండి" అని వారికి నచ్చజెప్పి అన్ని గదులూ చూపించింది. "అలాగే పెద్దమ్మా! మాకు తల్లి, తండ్రి, దైవము నీవే" అన్నాడు అన్న యుక్తిగా.

మనసులో సంతోషపడుతూ "అమ్మనక్కా! అమాయకులు. చెప్పి

నడుంతా నమ్మారు. వాళ్ళని ఇప్పుడు తిని ఏమి లాభం. చిక్కి శల్యాలైవున్నారు. బాగా మేపి, కండపుష్టి వచ్చిన తరువాత తింటాను" అని అనుకున్నది పిశాచి

ప్రతిరోజూ బావిలో నీళ్ళు తోడించేది పిశాచి అన్నతో. చెల్లెలితో అంట్లన్నీ తోమించి రకరకాల పిండివంటల్ని స్వయంగా చేసి వారిద్దరికీ కడుపారా పెట్టేది. చిలక వీలుదొరికినప్పుడల్లా 'పిశాచి మాయలో పడిపోతున్నారు జాగ్రత్త' అని హెచ్చరిస్తూవుండేది.

"అమ్మా, నాన్న కరువురోజుల్లో ఎలా అల్లాడిపోతున్నారో. మన మిక్కడ పంచభక్ష్యపరమాన్నాలు ఆరగిస్తూ కూర్చున్నాం. ఈ పిశాచిని ఎలాగైనా తప్పించుకు వెళ్ళిపోవాలి" అని అన్న విచారంతో ఎప్పుడూ చెల్లెలితో అనేవాడు.

ఒకరోజున అన్నకు ఒక ఉపాయం తట్టింది. చెల్లెలికి రహస్యంగా చెప్పాడు. ఇరువురి సంతోషానికీ మేర లేదు.

ఆ మర్నాడు యథారీతిగా అన్న బావిలోని నీళ్ళు తోడుతున్నాడు. బావిప్రక్కన కూర్చుని అంట్లు తోముతూ వుంది చెల్లి. పిశాచి వారిదగ్గరనుంచుని "త్వరగా పని పూర్తిచెయ్యండి. సృష్టిలో లేని చక్కని, తియ్యని ఫలహారాలు చేసి పెట్టాను" అని హెచ్చరిస్తూవుంది. "పెద్దమ్మా, పెద్దమ్మా నీవు ఇంతవరకూ చేసిన ఫలహారాలకన్నా నా? ఆహా! నీ వెంత బాగుంటావో ఫలహారాలు అంత బాగుంటాయి సుమా" అన్నాడు

"ఆ! నిజంగానా నాయనా. నేనంత అందంగా వుంటానా?" అన్నది ఉబ్బి, తబ్బిబ్బై పిశాచి.

"నిజమే, పెద్దమ్మా! ఇంతెందుకు నీవే మా చెల్లి ధరించిన ఆభరణాలవంటి ఆభరణాలు, చీరవంటి చీర కట్టుకునివుంటే, ఆహా హా, ఏమని చెప్పను, ఈ మూడులోకాలలోగూడ నీవంటి అందగత్తె వుండదని అంటే నమ్ము" అన్నాడు.

"నాయనా నీ మాటలు వింతగా వున్నాయి. నాకు తెలియని సౌందర్యం నాలో వుందంటావా?" అన్నది పిశాచి.

"పెద్దమ్మా నీ కెందుకు అనుమానం. నీ తెల్లటి చీర నాకు ఇవ్వు. నా దుస్తుల్ని నీకు ఇస్తాను. ఎంత అందంగా వుంటావో నూతిలోని ప్రతిబింబంలో చూద్దువుగాని" అని అన్నది చెల్లెలు. పిశాచి నిజమేనని నమ్మింది. ఇరువురు బట్టల్ని మార్చుకున్నారు. ప్రతిబింబం చూడాలని పిశాచి నూతిలోకి తొంగిచూసింది. అదను కనిపెట్టి అన్నా, చెల్లెలు కలసి పిశాచిని నూతిలోకి దొర్లించారు. పెద్ద అరుపు అరుస్తూ పిశాచి నూతిలో పడిపోయింది. ఇంతలోకే వారికి చక్కని సంగీతం వినపడింది. ఏమిటా, అని విస్తుపోయారు. నూతిపైన గాలిలో తేల్తూ ఒక అప్సరస ప్రత్యక్షమయింది. ఆశ్చర్యపోయారు.

"చిరంజీవులారా! ఈనాటికి మీ సహాయంవల్ల నాకు శాపవిముక్తి కలిగింది. నీ ధైర్య, సాహసాలకు తగిన వధువు అదుగో! నేను పక్షిగా బాధించిన రాకుమారి" అన్నది. రాకుమారిగా మారిన పక్షి సిగ్గుపడుతూ వచ్చి వారి వెనుక నుంచుంది. "నీ కేమి వరము కావాలో కోరుకో" అని అన్నది అప్సరస.

"మాకే వరమూ వద్దు. మమ్మల్ని మా తలిదండ్రులదగ్గరకు చేర్చితివా అదే పదివేలు" అని అన్నాడు. "అవిగో పాదుకలు. వాటిని ధరించి ఎక్కడికి వెళ్లాలంటే అక్కడికి కనురెప్పపాటులో వెళ్ళగలరు" అని చెప్పి మాయమైపోయింది. వారి ఎదుట మూడుజతల పాదుకలు ప్రత్యక్షమైనాయి.

అన్న పరుగుపరుగున వెళ్ళి చేతికందిన రత్నాలు జేబులనిండా నింపుకున్నాడు. ముగ్గురు పాదుకల్ని ధరించి ఒకరి చేయి ఒకరు పట్టుకుని కళ్ళు మూసుకుని మనసులో తలచుకున్నారు. కళ్ళు తెరచి చూచేసరికి ఎదురుగా వారి ఇల్లు కనపడింది చాల పాడుపడిపోయి వుంది. పడిపోయిన గోడలనిండా గడ్డి పెరిగిఉంది. ఇంటిముందు ఒక ముసలివాడు తెల్లటి గుడ్డపరుచుకొని డబ్బు అడుక్కుంటున్నాడు. వారికి ఆశ్చర్యంవేసింది. ముసలివాడు వీరిని పరికించి చూసి గుర్తుపట్టి భోరున ఏడ్చాడు. స్వార్థపరుడై స్వసుఖంకోసం కొడుకుని కూతుర్ని అడవులపాలు చేసినందుకు తగిన ప్రతిఫలం అనుభవిస్తున్నానని చెప్పాడు. తన అన్యాయానికి దేవుడు తగిన శిక్ష విధించాడని వాపోయాడు. మారుటితల్లి రోగిష్ఠియై వుందని తెలియజేశాడు. కొడుకుని, కూతుర్ని క్షమాపణ



# "ఈపొలం అందరిదీ"

బోరిస్ యవెఁల్యానోవ్

తెల్లవారింది. పెట్యా, వాస్యా లిద్దరూ లేచి వాళ్ల తాత మిఖాయిలొని చూట్టానికి పరిగెత్తుకు వెళ్లారు. తాత తోటకాపలావాడుగా ఉద్యోగం చేస్తున్నాడు.

పచ్చిక ఎత్తుగా పెరిగి వుంది. సూర్యు డప్పుడే ఉదయించాడు. రాత్రి కురిసిన మంచు పచ్చికమీద ఇంకా అల్లాగే వుంది. పిల్ల లిద్దరూ తాత వుండే కాపలాయింటిని చేరుకునేటప్పటికి వళ్లంతా తడిసిపోయింది. అయినా మంచి వుషారుగా వున్నారు.

తోటలోంచి పరిగెడుతూ వాళ్లు ఒక పిచ్చికని పట్టుకున్నారు. దోవలో దొరికిన ఒక పియర్ పండు, ఆపిల్ పండు తీసుకున్నారు. గజదొంగల్లాగా కన్నాలువేసి ఏది దొరికితే అది ఎత్తుకుపోయే పంది కొక్కు నొకదాన్ని పొంచిపొంచి పట్టుకున్నారు. ఆ పందికొక్కు నాలుగు ఆపిల్ పళ్లు ఒక్కసారిగా లంకించుకుని పోతోంది. ఇవన్నీ వాళ్లు గొప్ప ఘనకార్యాలకుమల్లే తాతకి చూపించారు. వాళ్లని ఎదురుగుండా పొగిడితే పిల్లలు బిరుసెక్కి పోతారు; అందుకని వాళ్లు చెప్పినదంతా విని తాత, "ఆ. అన్నీ వట్టిదే." అన్నాడు. కాని ఆపిల్ పళ్లనిమాత్రం వాళ్లని తినమని ఇచ్చాడు.

తాత బొగ్గులు తీసుకురావటానికి కొంచెం అవతలగా వెళ్లాడు. పెట్యా, వాస్యాలు ఎండలో కూర్చుని చలి కాగుతూ ఏం ఆట ఆడుకుందామా అని ఆలోచించారు.

అట్టే ఆలస్యం లేకుండానే ఒక మంచి ఆలోచన తట్టింది. తాత తిరిగివచ్చేసరి కల్లా ఆట మంచి రసపట్టులో వుంది.

"ఈ పొల మంతా నాది." అని వాస్యా తాతవుండే యింటి నించి ఒక ఆపిల్ చెట్టు దాకా కాలితో బిరి గీస్తూ అన్నాడు. "ఈ బిరి దాటావంటే చూసుకో. కొట్టేస్తాను," అనికూడా బెదిరించాడు.

పెట్యాకి కోపం వొచ్చి "నా పొలంలోకి వచ్చావంటే నేనూ ఊరుకోను. ఆపిల్ చెట్టు నీది. కాని ఈ పియర్ చెట్లన్నీ నావే," అని జవా బిచ్చాడు.

"ఆపిల్ చెట్లన్నీ నావే," అన్నాడు వాస్యా.

"నా పొలం వేపున ద్రాక్ష చెట్లున్నాయిగా !ఆయ్!" అన్నాడు పెట్యా.

"కాని నాకు గూస్‌బెరీపళ్ల చెట్లున్నాయిలేవోయ్."

"నీ పొలంవేపున మబ్బులు లేవు. నా పొలంమీద ఎంచక్కటి మబ్బు లున్నాయిగా."

"అవి నా వేపుకే వస్తున్నాయిలే."

"ఏమిటి."

---

వేడుకున్నాడు ఆ ముసలి తండ్రి. తండ్రిని ఓదార్చి, జరిగినదాన్ని గురించి విచారపడవద్దని చెప్పి, తాను తెచ్చిన రత్నా లన్నీ తండ్రికి సమర్పించాడు.

ఆనాటినుండి ఆ కుటుంబం పరోపకారమే ధర్మంగా, అతిథిసత్కారాలతో సుఖంగా జీవితం గడిపారు.

"మబ్బులు."

పెట్కా తలెత్తి పైకి చూశాడు. తెల్లటి మబ్బులు తెరచాప లెత్తుకున్న పడవల్లాగా కదిలి వస్తూ వాస్కా పొలంవేపు వెడుతున్నాయి. పెట్కా పెద్దమోసం జరిగిం దనుకున్నాడు. నేలమీంచి కర్ర తీసుకుని మబ్బులకేసే చూస్తూ వాస్కా పొలంలోకి నడిచాడు.

వాస్కా అతన్ని పట్టుకుని ఆపాడు. యుద్ధం జరక్క తప్ప దన్నట్టు కనిపించింది.

ఇంతలోకే తాత వచ్చాడు. ఇద్దర్నీ విడదీశాడు. ఆయన కనుబొమ్మలు చిట్లించి ఇద్దరి కేసీ తీవ్రంగా చూశాడు.

"ఏంచేస్తున్నారు మీరు? ఏమిటీ గోల?" అని అడిగాడు.

"నా పొలంలోకి పెట్కా ఎందుకు రావాలి?" అన్నాడు వాస్కా.

తాత కనుబొమ్మ లింకా చిట్లించాడు. "ఓహో, అదా! భూమిని మీ రిద్దరూ పంచుకున్నా రన్నమాట. భూమిని పంచుకోవటానికి మీకు ఎవరు అధికార మిచ్చారు? ఈ పొలాలు గ్రామంలో వాళ్లందరికీ చెందినవని మీకు తెలియదూ?"

పెట్కాకి ఈ మాటలు అవమానంగా తోచాయి. "మాకు తెలుసు ఆ సంగతి. మేము అచ్చంగా పంచుకోలేదు భూమిని. ఊరికే ఆటకోసం పంచుకున్నాం," అన్నాడు.

"మన రష్యా దేశాన్ని జార్ చక్రవర్తి పరిపాలించేటప్పుడు అంతా భూములు పంచుకొనే వాళ్లని ఒక పుస్తకంలో చదివాం. అది మాకు బలే ఆట అనిపించింది. అందుకని పంచుకున్నాం," అన్నాడు వాస్కా.

"భూములు పంచుకునేటప్పుడు నిజంగా పోట్లాటలు జరిగేవని కూడా మేం చదివాం," అని పెట్కా అందిచ్చాడు.

"ఓహో అందుకని మీరు సరదాగా పోట్లాటకి దిగా రన్నమాట. నేను సరిగ్గా సమయానికి రాకపోతే మీ దెబ్బలు నయంకావటానికి ఆస్పత్రికి పంపించాల్సి వచ్చేది. ఈ భూమి మనవూళ్లో వాళ్లందరిదీని. అక్కడ సూర్య చంద్రు లున్నంత దాకా దీన్ని ఎవ్వరూ పంచుకోగూడదు. తెలిసిందా? మనవూళ్లో వ్యవసాయం ఆఫీసులో గోడమీద ఒక కాగితం అంటించి వుంది చూడలేదా? ఈ భూమిని అచ్చంగా అందరికీ కలిపి యిచ్చినట్టు అందులో స్టాలిన్ రాశాడు."

"చూశాం తాతా! మేం దాన్ని చదివాం. ఇంకెప్పుడూ ఇల్లా చెయ్యం," అన్నాడు వాస్కా.

తాతకి కోపం తగ్గింది. తోట కంచె దగ్గిరికి వెళ్లి ఆలోచిస్తూ నుంచున్నాడు. ఆ తోట కవతల బాగా దిగువగా నది పారుతోంది. ఆ నది దాటితే మైళ్లకొలదీ ఎక్కడచూసినా సమష్టి పొలాలే.

తాత పక్కన పిల్లలిద్దరూ చేతులు పట్టకుని నుంచున్నారు.



తాత మెల్లిగా నవ్వాడు. ఏదో ఉషారైన సంగతి ఆయనకు తట్టివుంటుంది. పిల్లల్ని కంచెదగ్గిరగా లాగి ఇల్లా అన్నాడు.

"దూరంగా కనిపిస్తూందే కొండ. ఆ కొండ పక్కన నా పొలం వుండేది పూర్వం. పొలం గట్టు ఆ మూలనుంచి ఈ మూల దాకా వుండేది."

"ఎక్కడ?" అని ఇద్దరూ ఒక్కసారిగా కేకేసి గబాలున కంచెమీది కెక్కి కూర్చున్నారు. తాత పూర్వపు భూమిని చూడాలని వాళ్ల సరదా. కాని, తాతపొలం సమష్టిపొలంలో ఐక్యమయిపోయి ఎక్కడా ఒక్క గుర్తన్నా మిగల్లేదు.

"తాతా! నీ పొలం బాగా పెద్దదా?" అని అడిగాడు పెట్కా.

"పెద్దదీ? బలే ప్రశ్న. ఇప్పుడు మీ బామ్మ కూరగాయలు పెంచుతోందే, అంత భూమి మీద తొమ్మిది మందిమి బతికేవాళ్లం. నా పొలం కుడిపక్కన వ్లాసోవా అనే ఆవిడ పొలం వుండేది. ఎడమ పక్కన స్గిర్గిఇవాషిన్ అని నా స్నేహితుడో కాయన పొలం వుండేది."

"అప్పుడేం జరిగింది?" అన్నా రిద్దరూ కుతూహలంతో.

"మా జమీందారు పేరు లావ

రోవ్. నా పొలంలోను, సెర్గీ పొలంలోను బుర్రపిట్టలు నివసించేవి. బుర్రపిట్టల్లాంటి మంచి ఆహార పదార్థం మాలాంటి బీదవాళ్ల పొలాల్లో ఎందుకు పెరగాలీ, అని ఓర్వలేక జమీందారు మా పొలాల్లో కొంత భాగాన్ని లాగేసుకున్నాడు. అప్పుడు నేనూ, సెర్గీ మళ్లీ పొలాలు పంచుకుని కొత్త గట్లు పెట్టుకోవలసి వచ్చింది. కాని నా కెక్కువ భాగం రావాలని నేనూ, అతని కెక్కువ భాగం రావాలని అతనూ ఇద్దరం స్నేహితులమైనా పోట్లాడుకున్నాం. మమ్మల్ని విడదీసేటప్పటికి వూళ్లో వాళ్ల తల ప్రాణం తోకకు వచ్చింది." అన్నాడు తాత.

"అప్పుడు మీరు చిన్న పిల్లలా?" అని అడిగాడు వాస్కా.

"అబ్బే. పెద్దవాళ్లమే. అప్పటికి మాకు పెళ్లిళ్లుకూడా అయ్యాయి. అయినా చిన్నపిల్లలకంటే కనా కష్టంగా పోట్లాడుకున్నాం. మా భూము లన్నీ జమీందార్లవీ, పెద్ద ఆసాములవీ. మేము కమతగాళ్లం మాత్రమే. అయినా మాలో మా కెప్పుడూ తగాదా లొచ్చేవి. పైగా ఎప్పుడూ మాకు దరిద్రమే.

ఇప్పుడు చూడండి! ఈ పొలాలు ఏ ఒక్కళ్లవీ కావు; అందరికీ చెందిన సమష్టిపొలాలు. మన నాయకులైన లెనిన్, స్టాలిన్‌లు మనకీ పొలాలన్నీ అచ్చంగా యిచ్చేశారు. నీది, నాది, ఈ పోట్లాటలు రానేరావు ఇప్పుడు."

చల్లని గాలి పొలాలమీదగా వీచింది. ఎత్తుగా పెరిగివున్న పైర్లు తలలు వంచి ప్రజల్ని బీదతనం నుంచి కాపాడిన ఆ మహానాయకులకి దణ్ణం పెడుతున్నట్టు కనిపించాయి.

"ఇక పోదాం రండి, ఇంట్లోకి పోయి టీ తాగుదాం," అని తాత దారి తీశాడు.

పిల్ల లిద్దరూ తాతకంటే ముందుగానే ఎగురుకుంటూ పరుగెత్తుకెళ్లారు. తాత ఇందాకటి ఆపిల్ చెట్టు దగ్గిరి కొచ్చేటప్పటికి ఆట జోరుగా సాగుతోంది.

"ఈ భూమి అంతా మనదే." అంటున్నాడు పెట్కా.

"ఇం కెవరిదీ కాదిది, మన అందరిదీ." అంటున్నాడు వాస్కా.

"ఇది సమష్టి పొలానికి చెందిన తోట. అక్కడేమో సమష్టిపొలం వుండట. తాతవుండే ఇల్లు ఇల్లు కాదు. అది మాస్కో పట్టణంట. ఆ కంచె కవతల మన శత్రువు లున్నారు. మన భూమిలోకి వాళ్ల నెవర్నీ రానివ్వకూడదు. వాస్కా! నువ్వు వెళ్ళి కాపలా కాయి అక్కడ," అన్నాడు పెట్కా.

వాస్కాకి కాపలావాడుగా వుండటం బావుండక పోయినా, "సరే. కాపలా కాస్తాను. కాని నువ్వొక్కడివే ఆజ్ఞ లన్నీ యివ్వకోకు. నాకూ చాతవును ఆజ్ఞలివ్వటం. 'మార్చ్... లెఫ్ట్... లెఫ్ట్... లెఫ్ట్...' అంటూ వాస్కా ఒక కర్ర బుజాన వేసుకుని నుంచున్నాడు. పెట్కా అతని చుట్టూ సిపాయిలాగ అడుగులు వేస్తూ తిరిగాడు. ఇద్దరూ తాతకి ఎంతో యిష్టమైన,


'నా జన్మభూమి
ఎంతో విశాలం!
తరగని రత్నాల
కాలవాలం!"

అనే పాట పాడుతున్నారు. తాత ఆపాట వింటూ అల్లాగే నుంచుండి పోయాడు.

తూర్పున సమష్టి పొలాల్లోంచి పుట్టినట్టుగా సూర్యుడు పైపైకి జరుగుతూ వెచ్చని కాంతులు వెదజల్లుతున్నాడు.

(రష్యన్ కథకు తెలుగు)

బొమ్మరిల్లు:



# అడవికి రాజైన పిల్లి

అనగనగా ఒక యింట్లో ఒక పిల్లి చాలాకాలంనించీ నివసిస్తోంది ఆ యింటి యజమాని దాన్ని చాలా గారాబంగా తిండిపెట్టిపోషించేవాడు. కొంతకాలానికి ఆ యజమాని ముసలివాడై చచ్చిపోయాడు. ఆ యింట్లో కొత్తగా వచ్చిన యజమానికి పిల్లులంటే అసహ్యం. అందుకని ఆ పిల్లిని వెళ్లగొట్టేశాడు.

పాపం పిల్లిమామ తిండికి మొహంవాచిపోతూ అడవిలో తిరిగాడు. ఒకచోట ఒక చిన్న గుడిసె కనిపించింది. ఈ అడవిలోకి యీ గుడిసె ఎల్లా వచ్చిందా అని ఆశ్చర్యపోతూ, పిల్లిమామ తొంగిచూశాడు.

“ఎవరు నువ్వు?” అంటూ ఒక చిన్న ఆడనక్క ఎదురైంది.

“నే నిప్పుడే పట్నంనుంచి వస్తున్నాను. ఈ అడవిని పరిపాలిస్తూ జంతువులన్నీ సక్రమంగా ఉండేలాగ చూడటానికి వచ్చాను.” అని మీసాలు వడేస్తూ గర్వంగా చెప్పాడు పిల్లిమామ.

నక్క కొంచెం భయపడి, “రండి అయితే లోపలికి,’ అన్నది.

“ఇంట్లో ఏమన్నా వుందా తింటానికి?” అని మామ అడిగాడు.

నక్క వెంటనే ఫలహారాలు తయారుచేసి మామకి పెట్టింది. మంచి ఆకలిగా వున్నాడేమో మామ రెండునిమిషాల్లో విస్తరితో సహా అంతా కొట్టేశాడు.

మీకు పెళ్లయిందా, ఇంకా బ్రహ్మచారులుగానే వుంటున్నారా?” అని అడిగింది నక్క.

“పెళ్లి కాలే దింకా.”

అయితే నేనూ ఒంటరిగానే ఉంటున్నాను. నన్ను పెళ్లిచేసుకుంటారా?” అన్నది నక్క సిగ్గుపడుతూ.

ఓ తప్పకుండా.” అన్నాడు పిల్లిమామ.

ఇద్దరికీ ఒక మంచి ముహూర్తాన వైభవంగా పెళ్లిజరిగింది. పిల్లిమామ కోరటంవల్ల నక్క తన పెళ్లికి అడవిలోని చుట్టాల నెవర్నీ పిలవలేదు.

పెళ్లయిన మర్నాడు పిల్లిమామ ఇంట్లో కుర్చీమీద కూర్చుని, “ఒసే పెళ్లాం! ఆకలిగా వుందిగాని, తింటానికేమన్నా తీసుకురా,” అన్నాడు.

ఇంట్లో ఏమీ లేకపోవటంమూలాన నక్క అడవిలో ఏమన్నా దొరుకుతుందేమో నని బయల్దేరింది.

దోవలోతోడే లన్నయ్య కనిపించాడు.

“ఏమే చెల్లీ! ఎక్కడా కనిపించటమే లేదే యీమధ్య?” అని అడిగాడు అన్నయ్య.

“ఈమధ్య నాకు అడవిరాజుతో పెళ్లయిందిగా,” అన్నది నక్క.

తోడేలుఅన్నయ్య ఆశ్చర్యపడి, “అల్లాగుటే, మమ్మల్నెవ్వర్నీ పిలవకనేపోతివి నీపెళ్లికి? ఆనక వచ్చి మీ ఆయనను చూస్తాలే,” అన్నాడు.

“నీకు తెలియదులే అన్నాయ్! మా ఆయన మహాకోపిష్ఠి. చాలా భయంకరంగా వుంటాడులే ఆయన. ఆయన దగ్గిరకొచ్చేముందు ఏదన్నా కానుక తీసుకురావాలి. లేకపోతే ఆయన ఊరుకోడు.” అన్నది నక్క.

“ఏం తీసుకురమ్మంటావ్?”

“ఒక మేకపిల్లని తీసుకురా. కాని మాయింటి బయటనే దాన్ని వుంచి ఎక్కడన్నా దాక్కో. ఎదట పడితే ఆయనకి కోపం వస్తుంది.”

తోడేలు గజగజ వణుకుతూ మేకపిల్లిని వెదకటానికి వెళ్ళింది. నక్క సంతోషంతో గంతులువేస్తూ యింటిదోవ పట్టింది. ఇంతలో ఎలుగుబంటిబావ కనిపించాడు.

“ఏం మరదలా! ఎక్కణ్ణించి?” అన్నాడు.

"ఈమధ్య ఈ అడవిరాజుని పెళ్లిచేసుకున్నాగా. ఆయనికి మేకపిల్లని తింటానికి తెచ్చిపెట్టమని తోడేలన్నయ్యతో చెప్పివస్తున్నాను."

అడవిరాజును పెళ్ళిచేసుకున్నావా? నాకు తెలియదే. అయితే ఒకసారి వచ్చి చూడాలి మీ ఆయన్ని."

"వట్టిచేతుల్తో వస్తే ఆయనకి కోపం వస్తుంది. ఎద్దు నొకదాన్ని తీసుకురా, ఆయన సంతోషిస్తారు. కాని నువ్వు ఎదట నిలవగూడదు సుమా. ఎక్కడన్నా దాక్కోవాలి." అంది నక్క.

ఎలుగుబావకూడా వణికిపోతూ ఎద్దుని వేటాడటంకోసం బయల్దేరాడు.

కొంతసేపైనతరవాత తోడేలన్నయ్య, ఎలుగుబావ, పిల్లిరాజు ఇంటికి వస్తూ కలుసుకున్నారు.

"ఎక్కడికి కెడుతున్నావు ఎలుగుబావా?" అని తోడేలన్నయ్య అడిగాడు.

"నువ్వు వెళ్లేచోటికే లే. మా మరదలు అడవిరాజును పెళ్ళిచేసుకున్నదని విని ఈఎద్దును కానుకగా తీసికెడుతున్నాను." అన్నాడు ఎలుగుబావ.

"అయితే పద." అని యిద్దరూ భిక్కమొహంతో బయల్దేరారు. వెళ్ళేటప్పటికి యింటితలుపు వేసివుంది. ఎలుగుబావ ఎద్దునీ, తోడేలన్నయ్య మేకనీ ఆ తలుపుదగ్గిర దించారు. ఇంతలో తలుపు కిర్రుమంది. ఎలుగుబావ ఒక్క ఉరుకులో ఆ పక్కనున్న చెట్టెక్కాడు. తోడేలన్న ఒక పొదలో దూరాడు.

పిల్లిమామ పెళ్లాంతో బయటికి వచ్చి ఠీవిగా నుంచున్నాడు.

"అబ్బే, చాలా చిన్నజంతువే. మా మరదలు నన్ను హడలగొట్టింది," అనుకుంటూ ఎలుగుబావ చెట్టు దిగుతున్నాడు.

పిల్లిమామ ఎలుగును చూడకుండా చచ్చిన ఎద్దుమీది కెక్కి,

"ఏమి టిది, నాకేం చాల్తుంది యీ ఎద్దు? ఒక పంటికిందకి రాదిది. ఎవరు దీన్ని తెచ్చింది?" అని కోపంగా పెళ్లాన్ని అడిగాడు.

"బాబోయ్ నలుగురికి సరిపోయే ఎద్దు ఒక పంటికిందకి రాదంటున్నాడు ఇదేదో ప్రమాదమైన జంతువే," అనుకుని ఎలుగుబావ చడీ చప్పుడూ లేకుండా మళ్ళీ చెట్టెక్కి కూర్చున్నాడు.

ఇంతలో పొదలో కూర్చున్న తోడేలన్నయ్య గజగజా వణికిపోతున్నందున ఆకులు గలగలలాడాయి. పొదలో ఎలికలు తిరుగుతున్నాయనుకుని పిల్లిమామ "ఎన్నాళ్లయిందో ఎలికల్ని తిని" అని లోపల అనుకుంటూ ఎద్దుమీద నుంచి ఒక్క దూకు దూకాడు పొదమీదికి.

"అమ్మయ్యోవ్! నన్ను చూశాడల్లే వుంది," అనుకుని తోడేలన్నయ్య ఎగిరి గంతేసి పరుగులంకించుకున్నాడు. తోడేలును చూసి పిల్లిమామకు రాపుట్టింది. చంపేస్తుందేమోనని భయపడి పక్కనున్న చెట్టుకొమ్మమీదికి గెంతాడు

చెట్టుమీద ఎలుగుబావ వున్నాడుగా. "నన్ను కూడా చూశాడల్లే వుందిరా, దేముడా! ఏమిటి గతి," అనుకుంటూ ధమేలున చెట్టుమీంచి దూకాడు. పుచ్చకాయలా కిందపడి వెనక్కి తిరిగిచూడకుండా కాళ్లకి బుద్ధిచెప్పాడు.

తోడేలన్న, ఎలుగుబావ రెండు మైళ్ళు దూరంగా పారిపోయింతరవాతగాని ఆగలేదు. రొప్పుతూ, రోజుతూ, చుట్టూ చేరిన అడవిజంతువు లన్నిటికీ తమకి సంభవించిన ప్రమాదాన్ని గురించి చెప్పారు.

"అడవిరాజు, ఎల్లా వున్నాడనుకున్నావ్; ఏనుగంత శరీరం; తాటిచెట్టంత ఎత్తున్నాడు. బాబోయ్," అని తలుచుకుని ఇంకా వణుకుతున్నాడు తోడేలన్నయ్య.

"ఏనుగంతేమిటి? కొండంత వున్నాడు ఆయన. నేను ఎద్దుని తీసుకెడితే ఒక పంటికిందకి రాదన్నాడు. ఆవులించి ఈ అడవిలోని జంతువుల్ని అన్నిటినీ చప్పరించేసేటట్టున్నాడు," అని ఎలుగుబావ చెప్పాడు.

ఇది విని జంతువులన్నిటికీ కంగారుపుట్టింది, ఇక ఈ అడవిలో ఉండటం మెల్లాగా అని.

ఆ రోజునుంచీ జంతువు లన్నీ పిల్లిమామ యింటిబయట వేటాడిన ఆహారం తీసుకొచ్చి పడేసి పారిపోయేవి. పిల్లిమామ, నక్కపెళ్లాం కలిసి తిన్నంత తిని మిగతాది అవతల పారేస్తూ సుఖంగా గడిపారు.

(మోహన్)

## సినిమా

(24-వ పేజీ తరువాయి)

కళాకారులూ, రచయితలూ ప్రశంసించారు. "చైనా యావత్తూ విముక్తం కాకుండా అడ్డుకోగల శక్తి ప్రపంచంలో లేదని ఈ చిత్రం చూడగానే ప్రతివారికీ తెలిసిపోతుంది," అని మాఫాన్‌టువో కవి అన్నాడు.

చైనా ప్రజ ఈ చిత్రాన్ని చూసి ఆనందించడమే కాక గర్విస్తున్నారు. శిల్పం ప్రతిభా సమ్మిళితంగానూ, భావగర్భితంగానూ ఉండి, ఆధునిక చైనా చరిత్రను విస్పష్టంగా అవగాహన చేసుకున్నట్టు స్పష్టమవుతున్నది. ఈ చిత్రాన్ని తయారుచేసి డైరక్టుచేసిన లియోనిడ్ వార్లామోవ్‌కు ప్రజావిప్లవ సైనిక సమితి వారు చైనాతరఫున ఒక ప్రత్యేక పతకం బహూకరించారు.

చైనా మొదటి జాతీయ దినోత్సవంనాడు "చైనా ప్రజావిజయం" 15 నగరాలలో విడుదల అయింది. పికింగ్ నగరంలో ఒకేసారి 9 పెద్ద సినిమా థియేటర్లలో ప్రదర్శింపబడింది. రష్యాలో కూడా దీనికి విశేషమైన ఆదరం లభిస్తున్నది. చైనాలో ఇది చూపబడిన చోటనల్లా రికార్డు కలెక్షను వస్తున్నది. విడుదల అయిన మొదటివారంలో నే 10 లక్షలమందికి పైగా ఈ చిత్రాన్ని చూశారు.

ఈ చిత్రం పొందుతున్న అఖండవిజయం ఉభయదేశాలు (చైనా, రష్యాల) కళాకారుల సన్నిహిత సహకారానికి ప్రత్యక్ష నిదర్శనం. ఈ చిత్రంలో చూపబడిన అంతర్జాతీయ భావాలకు ఇదే తార్కాణం.

—"పీపుల్స్ చైనా"నుండి.



జెమినివారి 'మంగళ'లో మంగళపాత్రధారిణి భానుమతి.

# భారతి

**1951 జనవరి మొదలు భారతి చందారేట్లు దిగువరీతిని హెచ్చింప బడునని విన్నవించుచున్నాము.**

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | .... | రు. 12 లు |
| అర్ధ సంవత్సర చందా | .... | రు. 6 లు |
| విడి ప్రతి | .... | రు. 1 లు |

శ్రేష్ఠమైన ఆర్టు పేపరుమీద త్రివర్ణ ముఖచిత్రముతోను, ఆర్టు ప్లేట్లతోను, సుప్రసిద్ధ రచయితల వ్యాసములతోను ఉత్తమ తరగతి పత్రికగ వెలువడుచుండిన 'భారతి', ప్రచురణ వ్యయ భారమును గమనించి చందా రేట్లు హెచ్చింపవలసిన అగత్యత బహుకాలముగ ఏర్పడి యుండియు నేటివరకు రేట్లు మార్చకుండగనే యుంటిమి. కాని రానురాను కాగితము ధర, సమస్తమైన తదితర ముద్రణవస్తు సామగ్రి ధరలు విపరీతముగా పెరిగిపోయినవి. ఇంకను పెరుగుచున్నవి. ఈ పరిస్థితిలో రేట్లు హెచ్చింపక తప్పనిసరి అయినది.

భాషాభిమానులైన ఆంధ్రమహాజనుల మన్ననచే 'భారతి' గత 25 సం॥ల పైబడి నిరంతరాభివృద్ధినందుచు వచ్చినది. ఈ ఉత్తమ సాహితీపత్రిక ఇకముందునూ ఇదేరీతిని ఎల్లరి ఆదరాభిమాన పాత్రమై యుండగలదని విశ్వసించుచున్నాము.

చందాదార్లకు 1-1-1951 తేదీనాడు తమ లెక్కను జమయుండు మొత్తమువరకు క్రొత్తరేట్ల ప్రకారము చందాగడువు సవరింపబడునని ఇందుమూలముగ తెలియపరచుచున్నాము.

మానేజరు.

చిన్నకథ:

# మృత్యువూ - సిపాయీ


మూలం :
అలెగ్జాండర్ అఫనసీఫ్

అనువాదం:
నమూనా


అనగా అనగా ఒక సిపాయి ఉన్నాడు. పాతికేళ్ళు వరుసగా సేవచేసినా అతనికి విడుదల రాలేదు.

అతను ఆలోచించడం మొదలుపెట్టాడు నా రాత ఇట్లా ఉందేమా అని.

"ఏమిటి దీని అర్థం?" అన్నాడతను. "దేవుడినీ, జారునీ పాతికేళ్లు సేవచేశాను. ఎన్నడూ శిక్ష అనేది ఎరగను. నామీద ఒక్క చెడ్డ రిమార్కైనా లేదు. అయినా నాకు విడుదల రావడంలేదు. కాళ్ళల్లో సత్తువ ఉన్నంతవరకు పారిపోతే బాగుంటుందనుకుంటాను."

ఆలోచించాడు, ఆలోచించాడు, ఆఖరికి పారిపోయాడు. ఒక రోజంతా ప్రయాణం చేశాడు. మర్నాడు చేశాడు, మూడోరోజు దేవుణ్ణి కలుసుకున్నాడు.

దేవుడు అతన్ని అడిగాడు.

"ఎక్కడికి పోతున్నావు - సర్వీసు మీదనా?"

"ప్రభూ, నేను పాతికేళ్లు సత్యంతో, విశ్వాసంతో సేవచేశాను. నాకు విడుదల దొరికేటట్లు కనిపించలేదు. అందువల్ల పోగలిగినంత దూరం పారిపోతున్నాను."

"ఓహో, సరే, నీవు పాతికేళ్లు సత్యంతో, విశ్వాసంతో సేవచేశావు కాబట్టి స్వర్గానికి వచ్చి, స్వర్గరాజ్యంలో ప్రవేశించవచ్చు."

సిపాయి స్వర్గానికి వచ్చాడు. అక్కడ చెప్పరాని బ్రహ్మానందం చూసి అనుకున్నాడు, "అదీ బతికితే అట్లా బతకాలి." కాని అక్కడ కొంతసేపు అటూ ఇటూ తిరిగి స్వర్గస్థలాన్ని చూశాడో లేదో, పవిత్రఋషులదగ్గిరికి పోయి అడిగాడు :

"ఇక్కడ పొగాకు అమ్మేవాడు ఎవడూ లేడా?"

"ఇక్కడ ఏం పొగాకు దొరుకుతుందనుకుంటావు? ఇప్పుడు నీవు సైన్యంలో లేవు! ఇది స్వర్గరాజ్యం."

సిపాయి ఊరుకున్నాడు.

స్వర్గస్థలాలంతటా తిరిగాడు, తిరిగాడు, మళ్ళీ ఒకసారి పవిత్రఋషులదగ్గరకి పోయి అడిగాడు:

"సారాయి అమ్మే చోటే మీ ఈ ప్రాంతంలో లేదా?"

"ఓ, నువ్వా! ఇంకా సైన్యంలోనే ఉన్నాననుకుంటున్నావు! ఇక్కడ సారాయి అనేది ఎట్లా ఉంటుంది?"

"పొగాకు, సారాయి లేందే ఇది స్వర్గమెట్లా అవుతుంది?" అన్నాడు సిపాయి. ఆ క్షణం స్వర్గాన్ని విడిచిపెట్టి బయటికి చక్కాపోయాడు.

అతను భూమిమీద నడిచాడు, నడిచాడు. చివరకి దేవుణ్ణి కలుసుకున్నాడు అన్నాడు: "నువ్వు పంపించిన ఆ స్వర్గం ఏం దేశం బాబూ? అక్కడ పొగాకూ లేదు, సారాయీ లేదు!"

"సరే, ఎడమవైపుకు పో," నీకు అక్కడ అన్నీ దొరుకుతాయి." అని చెప్పాడు దేవుడు."

అట్లాగే సిపాయి ఎడమవైపుకు తిరిగి రోడ్డువెంబడే పోయాడు.

ఒక దయ్యం అటువైపే పరుగెత్తుతున్నది. అతన్ని అడిగింది: "దేనికోసం చూస్తున్నావు, సిపాయి?"

"ముందు మనం కూర్చుందుకు ఓ చోటు చూడు. తరువాత మాట్లాడుకుందాము," అన్నాడు సిపాయి.

అది సిపాయిని నరకానికి తీసికొని వెళ్లింది.

"ఇక్కడ మీదగ్గర పొగాకు ఉందా?" అని ఆ దయ్యాన్ని అడిగాడు అతను.

"ఓ, ఉంది, సిపాయీ."

"సారాయి?"

"ఆఁ, సారాయికూడా."

"ఏదీ, తలో కొంచెం ఇయ్యి."

ఆ దయ్యం అతనికి ఒక పొగగొట్టమూ, పొగాకు, ఒక సీసా సగం నిండుగా మిరియాల బ్రాందీ ఇచ్చింది.

సిపాయి తాగాడు, అటూ ఇటూ తిరిగాడు, పొగాకు కాల్చాడు, అతనికి హుషారు వచ్చింది.

"ఇదీ నిజమయిన స్వర్గం, బలే స్వర్గం!"

కాని కొంచెం అటూ ఇటూ తిరిగాక అతని చుట్టూ ఎన్నో దయ్యాలు మూగడం చూసి చీకాకుపడ్డాడు.

ఏం చెయ్యగలడు? అతనికి ఒక గమ్మత్తు విషయం తోచింది. ఒక 'సారెంక్' కొలుద్దామనుకున్నాడు. ఒక గజంబద్ద తయారుచేసుకున్నాడు; కొలవడం మొదలుపెట్టాడు.

అప్పుడు ఒక దయ్యం అతనిదగ్గరికి పరుగెత్తి అడిగింది: "ఏం చేస్తున్నావు, సిపాయీ?"

"గుడ్డిదానవా, చూడలేవూ? మఠం కట్టబోతున్నాను."

దయ్యం దాని తాతదగ్గరికి పరుగెత్తిపోయి చెప్పింది: "చూడు, తాతా, సిపాయి ఇక్కడ మఠం కట్టుదామనుకుంటున్నాడు."

తాత ఎగిరి గంతువేశాడు, సిపాయిదగ్గరకి పరుగెత్తాడు.

"ఏం చేస్తున్నావక్కడ?" అన్నాడు అతను.

"చూడడంలేదూ, మఠం కట్టబోతున్నాను." అని జవాబుచెప్పాడు సిపాయి.

తాత హడలిపోయాడు. తక్షణం నేరుగా దేవుడివద్దకు పరుగెత్తాడు.

"ప్రభూ, మాకు అటువంటి సిపాయిని పంపించావేం? మాకు మఠం కట్టిపెట్టుతానంటున్నాడు."

"సరి! దానితో నాకేం సంబంధం? మీరు ఎందుకు అట్లాంటివాళ్ళను రానిస్తారు?"

"ఇక్కడనుంచి మళ్ళీ అతన్ని వెనక్కి తీసేసుకో, ప్రభూ."

"నేనెట్లా అతన్ని వెనక్కి పిలుస్తాను? అతనే అక్కడికి పోతానన్నాడు!"

"అయ్యో! అభాగ్యులం అతనితో

మే మేం చేసేది?" అని గోలపెట్టాడు తాత.

"నువ్వు పోయి నీ చిన్న దయ్యాల్లో ఒక దాని తోలు తీసి, డోలుకట్టి వాయించు. అతను వెంటనే పోతాడు."

అట్లాగే తాత వెనక్కిపోయి ఒక చిన్న దయ్యాన్ని పట్టుకొని, దాని తోలుతీసి డోలు కట్టాడు.

"కాచిపెట్టుకుండండి," అని అతను దయ్యాలతో చెప్పాడు. "సిపాయి ఈ నరకంనుంచి పరుగెత్తగానే తక్షణం తలుపులు వేసేయండి. మళ్ళీ అతను లోపలికి రాకుండా గట్టిగా బిడాయించండి."

తాత గేటుబయటికి పోయాడు. బాజా వాయించాడు. సిపాయి బార్ - అ-బాన్-బాన్ అని బాజాచప్పుడు వినగానే పిచ్చెత్తినవాడిలా దయ్యాల నన్నింటినీ పొడలకొడ్తూ నరకంనుంచి పరుగెత్తి గేటు బయటికి ఎగిరిపోయాడు.

అతను బయటికి పోగానే గేటుపడిపోయింది: వాళ్ళు దాన్ని గట్టిగా బిడాయించేశారు.

సిపాయి అంతటా చూశాడు. ఎవరూ కనిపించలేదు. బాజామోత వినిపించలేదు. మళ్ళీ వెనక్కిపోయి తలుపుకొట్టాడు.

"త్వరగా తెరవండి. తీయకపోతే తలుపులు బద్దలు కొట్టివస్తాను." అని ఊరెగిరేట్లు అరిచాడు.

"ఊహుఁ, తియ్యం తమ్ముడూ, నీ యిష్టం వచ్చినచోటికి నువ్వు పోవచ్చు. నిన్ను లోపలికి రానియ్యం. నీకన్న మేమే బలవంతులం," అన్నాయి దయ్యాలు.

సిపాయి సలాంచేసి ఎటు కనిపిస్తే అటువైపు పోయాడు. తిరిగాడు, తిరిగాడు. మళ్ళీ దేవుణ్ణి కలుసుకున్నాడు.

"ఎక్కడికి పోతున్నావు, సిపాయీ?"

"ఏమో నాకే తెలియదు,"

"మరి, నిన్నెక్కడ ఉంచేదీ? స్వర్గానికి పంపిస్తే నీకు అది బాగుండలేదు. నరకానికి పంపిస్తే అక్కడ ఉండలేకపోయావు!"

"ప్రభూ, నీ గేటుదగ్గర కాపలా కాయనియ్యి."

"సరే, అట్లాగే ఉండు!"

దేవుడు సిపాయిని స్వర్గద్వారంవద్ద నిలబెట్టి ఇట్లా ఆజ్ఞాపించాడు.

"ఎవరూ లోపలికి రాకుండా చూడు."

"చిత్తం. ముసలి సిపాయికి నేర్పవలసిందేమీ లేదు."

సిపాయి కాపలా కాస్తున్నాడు. లోనికి ఎవరినీ రానియ్యడం లేదు.

అప్పుడు మృత్యువు అటు వచ్చాడు.

"ఎవ రక్కడ?"

"మృత్యువు?"

"ఎక్కడికి పోతున్నావు?"

"దేవుడిదగ్గరికి."

"దేనికి?"

"ఈసారి ఎవరిని చంపమంటాడో అడిగేందుకు."

"ఒక నిముషం ఉండు. నేను పోయి అడిగి వస్తాను.

"ప్రభూ, మృత్యువు వచ్చాడు. ఈసారి అతన్ని ఎవరిని చంపమంటావు?"

"వచ్చే మూడేళ్లూ ముసలివాళ్లనే చంపమని చెప్పు."

సిపాయి తనలో ఆలోచించుకున్నాడు: "అంటే మా అమ్మ మానాన్న చచ్చిపోతారన్నమాట. వాళ్లు ముసలివాళ్లేకదా - చూశావూ?"

వెనక్కిపోయి మృత్యువుతో చెప్పాడు:

"నువ్వు అడవిలోకి పోయి మూడేళ్లు బాగా ముసలి 'ఓక్' చెట్లని చంపివేయాలి."

మృత్యువు ఏడ్చాడు. అన్నాడు: "ఎందుకు ప్రభువు నామీద కోపంగా ఉన్నాడు. 'ఓక్' చెట్లని నరకడానికి పంపిస్తున్నాడు."

అరణ్యాల్లోకి వెళ్లిపోయాడు. మూడేళ్ల వరకు బాగా ముసలి 'ఓక్' చెట్లని నరికాడు. గడువు అయిపోయినతర్వాత కొత్త ఆజ్ఞలకోసం మళ్ళీ దేవుడిదగ్గరికి వచ్చాడు.

"మళ్లీ ఇటు వస్తున్నావేం?" అని సిపాయి అడిగాడు.

"ఆర్డర్లకోసం వచ్చాను - ప్రభువు నన్నెవరిని చంపమంటాడో?"

"ఓ నిముష మాగు. పోయి అడిగివస్తాను."

సిపాయి దేవుడిదగ్గరకు వెళ్లి అడిగాడు.

"మృత్యువు మళ్లీ వచ్చాడు. ప్రభూ, ఎవరిని చంపాలో తెలిసికోవాలిట."

"మూడేళ్లవరకు పడుచువాళ్ళను చంపమను."

సిపాయి ఆలోచించుకున్నాడు: "అంటే నా తమ్ముళ్ళని చంపుతా నన్నమాట." బయటికిపోయి మృత్యువుతో అన్నాడు.

"అరణ్యాలకి మళ్ళీపో, మూడేళ్లు చిన్న 'ఓక్' చెట్లని చంపు. అదే దేవుడి ఆర్డరు."

"ఎందుకు నామీద దేవుడికి ఇంత కోపం వచ్చింది?" అని మృత్యువు ఏడ్చాడు. మళ్ళీ అడవులకు పోయి మూడేళ్ళవరకు చిన్న 'ఓక్' చెట్లని నాశనం చేశాడు. టైము అయిపోగానే దేవుడిదగ్గరికి కష్టంతో కాళ్ళీడ్చుకుంటూ వచ్చాడు.

"ఎక్కడికి వెళ్తున్నావు?" అడిగాడు సిపాయి.

"దేవుడిదగ్గరికి - ఆర్డర్లకోసం - ఎవరిని చంపాలో?"

"ఒక నిముషం ఆగు. పోయి అడిగి వస్తాను."

మళ్ళీ అతను దేవుడిదగ్గరకు పోయి అడిగాడు: "ప్రభూ, మృత్యువు వచ్చాడు. అతన్ని ఎవరిని చంపమంటావు?"

"మూడేళ్లబాటు చిన్నపిల్లల్ని చంపమను."

సిపాయి ఆలోచించుకున్నాడు: నా తమ్ముళ్ళకి చిన్నపిల్లలున్నారు. మృత్యువు వాళ్ళని చంపుతాడన్నమాట."

తిరిగి వెళ్లి మృత్యువుతో అన్నాడు: మళ్ళీ అడవులకే పోయి మూడేళ్లు కనిపించిన చిన్న ఓక్ మొక్కల్ని నాశనంచేయి."

"దేవుడు నన్నిట్లా బాధిస్తున్నాడేం?" అని మృత్యువు ఏడ్చి, అరణ్యాలకు పోయాడు. మూడేళ్లు మిక్కిలి చిన్న ఓక్ మొక్కల్ని ధ్వంసం చేశాడు. అది గడచిన తర్వాత నడవలేక, నడవలేక ఎట్లాగో కాళ్ళీడ్చుకుంటు తిరిగి దేవుడిదగ్గరకు వచ్చాడు.

"ఇప్పుడు సిపాయితో పోట్లాడైనా దేవుడిదగ్గరకు పోయితీరుతాను. తొమ్మిదేళ్లు నన్ను ఇట్లా ఎందుకు శిక్షించాడో కనుక్కుంటాను."

సిపాయి మృత్యువు రావడం చూశాడు. అతనికేసి అరిచాడు:

"ఎక్కడికి పోతున్నావు?"

మృత్యువు మాట్లాడలేదు. మెల్లగా మెట్లెక్కుతున్నాడు. కాని సిపాయి అతని మెడ పట్టుకున్నాడు. లోపలికి రానీయడం లేదు.

వాళ్లిద్దరూ పెద్ద గలభా చేశారు. దేవుడది విని బయటికి వచ్చాడు.

"ఏమిటి ఇదంతా?" అని అడిగాడు.

మృత్యువు అతని పాదాలమీద పడ్డాడు.

"ప్రభూ, నీకు నామీద ఎందుకు అంత కోపం వచ్చింది? ఈ తొమ్మిదేళ్ళూ నేను అగచాట్లుపడుతున్నాను. అరణ్యాల్లో కొట్టుకుంటున్నాను. మూడేళ్లు పెద్ద ఓక్ చెట్లని నరికాను. మూడేళ్లు చిన్న చెట్లని నరికాను. మూడేళ్లు చిన్న ఓక్ మొక్కల్ని నాశనంచేశాను. కాళ్లీడ్చుకోడానికైనా సత్తువ లేదు.

"అదంతా నీపనేగామూ?" అని సిపాయితో అన్నాడు దేవుడు.

"చింతిస్తున్నాను, ప్రభూ" అన్నాడు సిపాయి.

ప్రభువన్నాడు: "ఇక్కడనుంచి వెళ్లిపో. తొమ్మిదేళ్లు మృత్యువును నీ బుజాలమీద మోయి."

అట్లాగే మృత్యువు సిపాయినడ్డిమీద కూర్చున్నాడు. ఇద్దరూ కలిసి వెళ్లిపోయారు

సిపాయి ఏమీ చేయలేకపోయాడు - మృత్యువును మోయాలి మరి. మోశాడు, మోశాడు అలసిపోయేవరకు మోశాడు. తన కొమ్ము పొడుంపెట్టె పైకితీసి పొడుం పీల్చడం మొదలుపెట్టాడు. మృత్యువు సిపాయి ఏదో వాసనచూడటం చూశాడు. అతనితో అన్నాడు. "సిపాయీ, నన్ను కూడా పొడుంపీల్చనియ్యి!"

"సరే, అట్లాగే. నా బుజంమీదనుంచి దిగి ఈపెట్టెలోకి పాకు. నీకు కావలసినంత పీల్చవచ్చు."

"సరే, పెట్టె తెరు!"

సిపాయి పొడుంపెట్టె తెరిచాడు. మృత్యువు అందులోకి పాకిన తక్షణం మృత్యువును లోపలనే ఉంచి మూతవేసేశాడు. దాన్నితన బూటులోపైకి దోపాడు.

తిరిగి తన పాతస్థలానికి వచ్చి కాపలా కాస్తున్నాడు.

ప్రభువు అతన్ని చూసి అడిగాడు: "మృత్యువేడీ?"

"నాతోనే ఉన్నాడు."

"ఎక్కడ - నీతోనా?"

"ఇదుగో, నా బూటులో పైన ఉన్నాడు."

"ఏడీ, నాకు చూపించు."

"లేదు, ప్రభూ. అతన్ని నీకు చూపించను. తొమ్మిదేళ్ళవరకూ అతను బయటికి రాకూడదు. మృత్యువును నడ్డిమీద తొమ్మిదేళ్ళు మోయడం అల్లాటప్పాపనికాదు. కాస్తకూస్త బరువు లేదు.

"నాకు అతన్ని చూపించు, నిన్ను క్షమిస్తాను!"

సిపాయి పొడుంపెట్టె బూటులోనుంచి పైకి లాగాడు. మూత తెరవగానే మృత్యువు అతని బుజంమీదకి ఎగిరి కూర్చున్నాడు.

"దిగరా అక్కడనుంచి. ఉండమన్న చోటే ఉండే జ్ఞానం నీకు లేకపోయింది." అన్నాడు ప్రభువు. మృత్యువు దిగివచ్చాడు.

"ఇప్పుడు నువ్వు సిపాయిని చంపివేయవచ్చు," అన్నాడు ప్రభువు. అని చక్కాపోయాడు. ఎక్కడికో దేవుడికే తెలుసు.

మృత్యువు సిపాయితో అన్నాడు: "సరే, సిపాయీ, ఏంచెప్పాడో విన్నావుకదూ? నిన్ను చంపడానికి ప్రభువు ఆర్డరు ఇచ్చాడు,"

"అందులో ఏముంది? ప్రతివాడూ ఎప్పుడోఅప్పుడు చావాలిసినదే కదా. కాని తయారయ్యేందుకు కాస్త టైము ఇయ్యి," అన్నాడు సిపాయి.

"సరే, తయారుకా."

సిపాయి శుభ్రమైన దుస్తులు వేసికొన్నాడు. ఒక 'కాఫిన్' (శవాలపెట్టె) తెచ్చుకొన్నాడు.

"తయారుగా ఉన్నావా?" అని అడిగాడు మృత్యువు.

"ఓ, తయారుగా వున్నాను."

"సరే, కాఫిన్‌లో పడుకో."

సిపాయి కాఫిన్‌లో బోరగిల పడుకున్నాడు.

"ఉఁహూఁ, అట్లా కాదు," అన్నాడు మృత్యువు.

"మరి ఎట్లా?" అని అడిగాడు సిపాయి. ఒకపక్కకు తిరిగాడు.

"ఉఁహూఁ, అట్లా కానేకాదు. అట్లా చచ్చిపోవడం నీకు బాగుండదు."

సిపాయి తిరిగి రెండోపక్క పడుకున్నాడు.

"అయ్యో వెర్రివాడా, ఏంమనిషివి నువ్వు? మనుష్యులు ఎట్లా చచ్చిపోతారో తెలియదూ నీకు? ఎప్పుడూ చూడలేదూ? లే, నేను చూపిస్తాను."

సిపాయి కాఫిన్‌నుంచి బయటకు వురికాడు. మృత్యువు అతని స్థానంలో పడుకున్నాడు. అప్పుడు సిపాయి కాఫిన్ మూత పట్టుకొని, గభీమని కాఫిన్‌మీద పెట్టివేశాడు. ఇనుపచీలలతో దాన్ని బిగించివేశాడు. మరుక్షణం దాన్ని బుజంమీదకు ఎత్తుకొని నదికి తీసుకుపోయాడు.

దాన్ని నదిలో దిగబెట్టి, మళ్ళీ యథాస్థానానికి వచ్చి కాపలా కాస్తున్నాడు.

దేవుడు అతన్ని చూసి అడిగాడు: "మృత్యువు ఏడీ?"

"అతన్ని నదిలో దిగబెట్టివచ్చాను."

అతడు ఆవైపు చూశాడు. దూరాన మృత్యువు నీళ్లలో ఈదుతూండడం చూశాడు. వెళ్లి అతన్ని ఒడ్డుకుచేర్చాడు.

"సిపాయిని ఎందుకు చంపలేదు?" అని అడిగాడు.

"అతను చాలా జిత్తులమారి. అతన్ని ఎవరూ ఏమీ చేయలేరు."

"అతనితో ఇకమీదట కబుర్లు పెట్టుకోకు. మాట్లాడకుండా పోయి వెంటనే చంపివేయి!"

మృత్యువు వెళ్లి సిపాయిని చంపేశాడని కొందరంటారు. కాని, అతను మళ్లీ మృత్యువును టోపీ వేశాడనీ, చాలాకాలం ప్రపంచంలో బతికి మొన్నమొన్ననే చనిపోయాడని కొందరు అనుకొంటున్నారు.

---

# నేటిప్రపంచం

(7-వ పేజీ తరువాయి)

ఉండటానికి బదులు దెబ్బతీస్తుందేమోనని ఒక భయం. ఈ రెండూకాక మరొక ప్రబలమైన భావం ఒకటున్నది. అమెరికా పెత్తనంకింద పశ్చిమజర్మనీ అస్త్రధారణ మొదలుపెడితే జర్మనీ విభజన శాశ్వతమైపోయి రెండు ప్రాంతాలమధ్యా వైరం ఏర్పడవచ్చు. ఇది ముఖ్యంగా సోషలిస్టులకూ, ప్రొటెస్టెంటులకూ ఎంతమాత్రం ఇష్టంలేదు; ఎందుకంటే వారిని అనుసరించేవారు ఉభయప్రాంతాలా ఉన్నారు.

పోలింగులో అత్యంత విశ్వాసంగల అమెరికా హైకమిషన్ కార్యాలయం అక్టోబరుమాసంలో పరిశీలన జరపగా అసంఖ్యాకులైన జర్మనులకు పునరాయుధధారణ ఇష్టంలేదని తేలింది!

ఉన్నదుండగా ఉపాకర్మ అన్నట్టు జర్మనీని తిరిగి యుద్ధసన్నద్ధం చెయ్యటానికి పాత ఒడంబడికలు ఒప్పవని అభ్యంతరపెట్టిఉండిన రష్యా, బ్రిటను ఫ్రాన్సులకు మరొక ఆక్షేపణ తెలిపింది. ఆదేశాలు తనతో చేసుకున్న 20 ఏళ్ల స్నేహఒడంబడికలకు అట్లాంటిక్ రక్షణ సేనల ఏర్పాటు వ్యతిరేకమని రష్యా అన్నది.

ఇదొక రాజకీయపు ఎత్తని అమెరికా తృణీకారభావం చూపింది. ఆమీదట రష్యా నిజమైన ఎత్తువేసింది. తూర్పు జర్మనీ పశ్చిమజర్మనీకి, జర్మనీ ఐక్యతను గురించి మాట్లాడదామని కబురుపంపింది. ఇది నిజంగా బ్రహ్మాస్త్రమే. జర్మనులీనాడు అన్నిటికన్న అధికంగా కోరేది ఐక్యత. ఇన్నాళ్లూ రష్యా పట్టుబట్టినది కూడా జర్మనీ ఐక్యతే. అందుచేత రష్యా అమెరికాను రాజకీయంగా ఓడించటానికి ఇదొక కొత్తఎత్తు ఎత్తిందనటానికి సావకాశంలేదు. జర్మనీ ఏకంకావటానికి గల అవకాశాలను తూర్పుజర్మనీ పశ్చిమ జర్మనీకి చూపగలిగితే పశ్చిమజర్మనీ అమెరికా చేతినుంచి జారిపోయే అవకాశం ఉన్నది. ఆ తరవాత అమెరికాకు యూరపులో ఆట్టే పని ఉండదు. —రావు

# వంచకులు

(21-వ పేజీ తరువాయి)

కొచ్చేవ్? (గదిస్తూ) నీ కళ్లు నెత్తికొచ్చేయ్. బ్రాహ్మలం ముట్టుకోరాదని తెలియదూ. ఇప్పుడు సచేల స్నానం చెయ్యాలి. (కోపంతో వాణ్ణి కొడతారు)

రాము : రచ్చించండి బాబియ్యా! నేరక గడ్డితిని యిడిపించినాను. మ రెప్పుడిలాటి తప్పు సెయ్యను బాబయ్యో (ఏడ్చును) (రంగమ్మ కేకలు విని బయట కొచ్చి)

"ఏవండోయ్! అదేవి టలా వాణ్ని బాదేస్తున్నారు?

కరణం : చూడు; మాలవెధవ! మమ్మల్ని ముట్టుకుంటాడూ? ఎలా ఏపేవను? మళ్లీ స్నానం చెయ్యాలి.

రంగ : అదేవి పొగ్రా! బాబు గార్నెందుకు ముట్టుకున్నావు?

రాము. (ఏడుపుతో) కొదండమ్మగోరు! అయ్యగోరు, పెదబుగతగోరు కలియబడుతుంటే యిడిపించినా, అంతే.

రంగ : బాగుంది. విడిపించినందుకా వాణ్ని బాదడం. మీ రిద్దరూ నడివీథిలో తన్నుకుంటూ ఉన్నా, చూస్తూ వాడూరకున్నాడు కాడు. తప్పే. ఇహ చాలు. రండి లోపలికి. (కరణం చురచుర చూస్తూ లోపలికి పోవును.)

పెదబుగత : ఈ వెధవపని పట్టిస్తా. (అందరూ నిష్క్రమింతురు.)

## 4 వ రంగం

ఊరుబడి. పొట్టిపంతులు కుర్చీమీద కూర్చునుంటాడు. ఒక చేతులో సిగరెట్టు; ఒక చేతులో బెత్తాం. ఎదురుగా పదిమంది పిల్లలు కూర్చునుంటారు.

పొట్టిపంతులు : (సిగరెట్టు పీల్చి పొగ ఒదుల్తూ) వెధవల్లారా! అ ఆ లేనా రావు. ఎలా ఏడిసేది. నేడో రేపో ఆ ఇనస్పెక్టరొకడు తగలడతాట్ట. ఊం. ఈ పాట పాడండి. నేను ముందూ మీరు తరవాత - "కాకి ఒకటి నీళ్లకూ".

పిల్లలు : "కాకి ఒకటి నీళ్లకూ."

పొట్టిపం. పం."కావు కావు మనుచును"

పిల్లలు : కావు కావు మనుచును.

పొట్టి : 'ఎగిరి ఎగిరి పోవుచు' (సిగరెట్టు పీల్చును. పిల్లలు పాట మాని సిగరెట్టువేపు చూస్తూ ఉంటారు.)

పొట్టి. పం : (కోపంతో) ఏవిట్రా ఆ చూపు, పాడ్డం మానేసి. (మళ్లీ సిగరెట్టు పీల్చును) ఒక పిల్లడు ప్రక్కవాడితో:— ఆనక నేనూ మేష్టారిలాగే సిగరెట్టు తాగుతాను. (అని ప్రక్క పడున్న ఒక సిగరెట్టుపీక లాగబోతాడు. పొట్టిపంతు లది చూస్తాడు.)

పొట్టి. పం: ఏవిట్రా ఆ చేతులోది?

పిల్లడు : ఏవీ లేదండీ.

పొట్టి : ఛా వెధవా! అబద్ధాలకోర్ చెప్తావా చెప్పనా? (బెత్తాం ఆడిస్తూ లేస్తాడు.)

(బారికరావుడు ప్రవేశం)

రాము : ఏ టయ్యగోరు! ఇయ్యాళ బరెట్టినారు. ఎప్పుడూ నేదు.

పొట్టి. పం : ఏంరా వెధవా! రోజూ బరి లేదురా?

రాము : (పళ్లిగిలిస్తూ) బరుందిగాని పిల్లల్లేరు, మీరు లేరు బాబియ్యా! నాను నూణ్ణేదా?

పొట్టి. పం : ఛా మాధచ్చోత్.

రాము : ఏటయ్యగోరోయ్! మాటలు తిన్నగా రానీ. ను వ్వెప్పుడయ్యా బరెట్టినావు? గవర్నమెంటోరు ఉత్తపున్నానికి నెల కేబై రూపాయ లిత్త్రను. నువ్వు కోళ్లు, గొర్రెలు కొనుక్కొని, నాబాలకమ్మకుంటూ, యువసాయం చేసుకుంటూ, కాలుమీన కాలేసుక కూకుంతావా? నా నినసపెక టేరితో ఈ నాటకవంతా సెప్పేనా? ఏటనుకున్నావో?

పొట్టి. పం : ఒరే రావుడూ! ఏదో తమాషా కంటే నీ కెందుకురా అంత కోపం. తరవాత కనపడు. నీకు మంచి తల గుడ్డిస్తాను.

రాము : అనాగే బాబియ్య, ఏదో తమగులాపోణ్ణి మరిసిపోకండి.— ఆఁ మాటల చందల్లో మరిసేపోనాను. పెదబుగతగోరు తిమర్ని నిలబడ్డపాటుగ రమ్మంతన్నారు.

పొట్టి. పం : పెదబుగతగారా? ఏవిట్రా సంగతి?

రాము : ఆఁ ఏటుంది? ఆ అప్పన్నగాడాయన్ని కొట్టేహండు. కే సెట్టడానికి, పోలీసోళ్లకి రిపోర్టు...

పొట్టి పం : ఓహోహో! పద; (పిల్లలతో) ఈవాళ కాపాట పాడుకోండి. పొండి. (అందరు నిష్క్రమింతురు.)

## 5-వరంగము

పెద్ద బుగతగారి చావిడి. బుగత వాలు కుర్చీమీద కూర్చొని చుట్ట తాగుతూ ఉంటాడు. ఎదురుగా నలుగురు రైతులు క్రింద కూర్చొని ఉంటారు. ముందొక బెంచి, దానిమీద తమలపాకుల పొందాను, పేకదస్తా, ఉంటాయి. పక్కని ఒక టేబిలు. దానిమీద కలం, సిరాబుడ్డి, తెల్లకాగితాలు ఉంటాయి. (పొట్టిపంతులు ప్రవేశం)

పె. బుగత : ఏవయ్యోయి పంతులు! మహా తీవ్రంగా పాఠాలు చెబుతున్నావే! ఏనిటి కథ?

పొట్టి. పం : ఆఁ ఏవుంది? రేపో ఎల్లుండో, మా మరిడమ్మ దిగబడుతుంది. అందుకని యీ గడబిడంతా—

పె. బుగత : ఉపారాలకి సరుకూ, జట్రా జాగ్రత్తపెట్టావా?

పొట్టి. పం : దాని కేవుంది లెండి, తమలాంటివాళ్లు చల్లగా ఉండాలిగాని.

పెద్ద. బుగత : ఈ నెలజీతం ముడుపేనా?

పొట్టి. పం : అంతతో తగలడుతే బాగే. ఇంకా సాద రెంతో?

పెద్దబుగత: దానికేంలే. మనవున్నాంగా?

పొట్టిపం : పెద్దలు; తమ దయ.

పెద్దబుగత : దానికేంగాని, ఓ చిన్న రాచకార్యం వుంది. అది నీ చేతిమీదుగా జరగాలి.

పొట్టి : తప్పకుండా; చెప్పండి.

పెద్దబుగత : మరేవీ లేగు. ఈ రైతువెధవలందరిమీద ఒక అర్జీ రాయాలి నా పొలం దురాక్రమణ చేసినట్టూ, నే నడ్డడానికి వెళితే కొట్టినట్టూ. (కన్ను గీటుతూ) ఈ నలుగురు రైతులు సాక్ష్యం. తెలిసిందా?

పొట్టిపం : బుద్ధిసూక్ష్మతంటే ఇలాగుండాలి. దీంతో వీళ్ళ పొగ రణుగుతుంది. మనిషికి పది, పాతికా వడ్డింపించి, ఆ జైని కోసకొట్టు చూపించాలి.

పెద్దబుగత : అదంతా నీ ప్రజ్ఞమీద ఆధారపడిఉంటుంది. కాని ఆ కరణం చిట్టన్నగాడు వాళ్లపక్షం కాస్తాడుసుమా.

పొట్టిపంతులు : ఆ కాయనియ్యండి నా బ్రహ్మాస్త్రం మజా చూడండి.

పెద్దబుగత : (పళ్లు బిగించి) ఆ చిట్టన్నగాడి భరతంపడితేగాని నా కసి తీరదు.

పొట్టిపం : అదెంత పని. కరణం గిరణం కాకుల మరణం. చిటికె.

ఒకరైతు : కరణంగోరేటిగాని బావో! ఆ అప్పన్నగోడి కో సురక తగనాల. ఆడా! ఆడిపని, మా యిపరీతం గుంది.

రెండవరైతు. ఇయ్యాళ పెంటకాడ ఎర్రికుక్కనాగ నామీద ఉరకబడి పోండు. ఎదవ నా సితకబొడిసుందును గాని......

మూడవ రైతు : ఒస్ ఆ డేట్రా! ఒట్టి ఎర్రోడు. ఆడి బావ సిల కలోడి కో గట్టి సురక తగనాల. ఎదవడు మా యిరగబడిపోతండు.

నాల్గవరైతు : ఈమద్య ఆ పాటపాటి చౌము సేఁందిలే సెరుకుమీద. అందుకే ఆ యిరగబాటు.

మొదటిరైతు : ఇరగబాటు. ఇరగబా

టొడుల్తాదినే ఈ పిటీహంతో. నానంట, తంతో పోటీకొచ్చేన్నంట.

పెద్దబుగత: పోటి ఏవిటి పోటీ. నాకెవడు హెచ్చు సొమ్మిస్తే వాడికే నా భూవిస్తాను. లేదు, నాభూమి నేను కొర్నుంచుకుంటాను. ఈ వెధవ కెందుకు?

(బారికరావుడు ప్రవేశం)

రాము: దండాలు బాబియ్యా!

పెద్దబుగత: ఏంరా? అలా రోజుకుంటూ ఒచ్చేవు? ఏవిటి కథ?

రాము: ఏటి బాబు! మా సెడ్డ సిక్కొచ్చింది. అప్పన్నగోడు రాయికేసి, తల కొట్టుకోని, రగతం కారుతుంతే పెదబుగత క్రుచ్చు కొక్కేటేహిమ్రని, కే సెట్టడానికి, పట్టం పరిగెఉతంను.

పెదబుగత: (రిచ్చపోయి) నిజవేన్రా?

రాము: బూదేవత సాచ్చి బావో! పెద్దోరు మీతో అబద్దం సెపుతానా? నా కళ్లార నాను సూత్తే.

పెదబుగత: అన్నా దౌర్జన్యం ముంటా కొడుకు.

రైతు: ఆ కరణంగోరే ఆ పన్నాగం, పన్నింతారు. నేకపోతే, ఆ యెదవ కంతపా టాలోసన.

రెండవరైతు: ఆ కరణంగోరు మా వక్కసిక్కలు.

పెద్దబుగత: ఏం పంతులు! ఏవంటావు?

పొట్టిపంతులు: ఇది కరణం దెబ్బే.

పెద్దబుగత: అయితే ఇప్పుడేం చేద్దాం?

పొట్టిపంతులు: ఆ అంత కంగారే వుందండి. అధికార్ల కింత మేత పారేస్తే సరి. కథ అడ్డంగా తిరుగుతుంది.

పెద్దబుగత: సరే; ఇప్పుడే బయల్దేరుదాం. శుభస్య శీఘ్రం. (రైతుల్తో) మీరూ రండి. ఎందుకైనా మంచిది.

(నిష్క్రమణం)

**6 వ రంగం.**

(ప్రవేశం చిట్టన్నపంతులు. పొట్టిపంతులూ)

చిట్టన్నపంతులు: ఏవిటండోయి మేష్టరుగారు! మహా తీరుబడిలేకుండా ఉంది మన పని. అర్జీలుమీద అర్జీలు రిపోర్టుల మీద రిపోర్టులు.

పొట్టిపం: మీరుమాత్రం సామాన్యులా మహాశయా! ఉత్త పున్నానికి రెండు వందలు కాజేసేరు.

చిట్టిపంతులు: దానికేంలే. ఇటూ అటూ కలిపి గుంజుదాం. నీకూ నాకూ చెరి సహాయస్వాహా ఏమంటావూ?

పొట్టిపం: పాలొల్లని పిల్లిగలదె పరికింపంగ—

(తెర)

# టామ్‌ సాయర్

(31వ పేజీ తరువాయి)

దుకు ఆమె కళ్లల్లో కృతజ్ఞత కనిపించింది. బెకీ కోసం తను త్యాగం చేస్తునందువల్ల టామ్ కిక్కురుమనకుండా దెబ్బలు తిన్నాడు. మేష్టారు బెత్తం విరిగేదాకా కొట్టి అలిసిపోయాడు.'

స్కూలు వదిలిపెట్టింతరవాత కూడా రెండు గంటలసేపు బెంచీ మీద నుంచోవాలని శిక్ష వేశాడు.

ఆ రెండు గంటలసేపు బడి అవతల తనకోసం ఒక అందమైన ఆడపిల్ల కనిపెట్టుకు నుంచుంటుం దని టామ్‌కి తెలుసు. అంచేత ఏమీ కష్టమనిపించలేదు ఆ శిక్ష.

ఆల్ఫ్రెడ్ టెంపిల్ మీద ఏ విధంగా కసి తీర్చుకోవాలో ఆలోచిస్తూ టామ్ ఆ రాత్రి పక్కమీద పడుకున్నాడు. కాంపోజిషన్ పుస్తకంమీద సిరా పోసింది ఆల్ఫ్రెడ్ అని బెకీ ఆ సాయంత్రమే చెప్పింది.

"టామ్, నువ్వెంత మంచివాడివి! నీ మేలు మరిచిపోనులే," అని బెకీ వెళ్లిపోతూ అన్నమాటలు చెవిలో రింగుమంటుండగా నిద్రపోయాడు టామ్.

## ఓ కంపోసిటర్ మహాశయా!

వ్రాయ డెందుకు కవిరాజుగా డొక్కడూ
వానికొరకు ప్రెస్సువాని కొరకు:
అతను రచనచూచు ఆద్యంత మంత్యాది
వాడులేక చదువు వాడె లేడు.

"వాణిమెలగు నేరి పాణి చలువకోరి?"
"అక్కరాలు ఎవని ఆటరాలు?"
"రాక్షసాల కెవడు రామభద్రుడు గాడు?"
అతడు అవును అన్న- అవను ఎవను.

అతను యొవ డటంచు ఆర్ద్రాగ్ని గోళాలు
వలదులెండి రూకవదులు కోండి...
మనకు వాడు గాక మరియొక డుండునా?
వాడె లెండి ప్రథమ పాఠకుండు:

ఎవడు నా గ్గలట్టి ఏకైకపరియితా
వాడెలెండి ప్రెస్సు వాడెసుండి;
కనుక వాడు మటుకు ఖచ్చితమ్ముగ జూచు
చెత్తకాని రచన కొత్తకాని.
ఆ మ్రదూ కృతాత్మ ఆత్మ సంతృప్తియే
నాదు కవిత కింక నాందికాగ,
వ్రాయుచుంటి లక్ష్య లక్షణస్ఫూర్తికి
ఆట విడుపు లాంటి ఆటవలది.

ఆద్యంత రహితా!
చదువుకో గదోయి చంద్రార్క శాశ్వతం
ప్రెస్సు వద్ద కైపు పేర్చువాడ!

"నన్నీ చిక్కులోనించి తప్పించగలరని అంటున్నారు. కానీ, అని ఏమిటో అన్నారు."

"ఆ. ఆ. జ్ఞాపకం వచ్చింది. మిమ్మల్ని ఈ చిక్కులోనించి తప్పించాలంటే ముందుగా మీరు ప్రేమించే ఆ యువతిని అతను పెళ్లిచేసుకోకుండా నిలిపివెయ్యాలి. డాంటే చచ్చిపోనక్కర్లేకుండానే పెళ్లి ఆపుచెయ్యవచ్చునని నాకు తట్టుతోంది."

"మృత్యువు తప్ప వాళ్ళమధ్య మరేదీ ఎడబాటు తేలేదు" అన్నాడు ఫెర్నాండో ఘంటాపథంగా.

"ఒట్టి తెలివిహీనుడిలా మాట్లాడుతున్నావోయ్" అన్నాడు కాడరూస్. "డాంగ్లర్‌ని చూడు, ఎంత మెలకువగా ఉంటాడో! అతని చాకచక్యం చూడు. నువ్వు పొరపడ్డావని ఇట్టే రుజువు చెయ్యగలడు. డాంటే చచ్చిపోనక్కర్లేకుండానే పని సానుకూలపడుతుందని చెప్పవోయ్ డాంగ్లర్. అయినా అతను చచ్చిపోవడమేమిటి? డాంటే చాలా మంచివాడు. అతనంటే నాకు చాలా ఇష్టం. డాంటే! నిన్ను ఆశీర్వదిస్తున్నాను."

ఫెర్నాండో ఆవేశంతో లేచి వెళ్లిపోడానికి ప్రయత్నించాడు.

డాంగ్లర్ అతన్ని ఆపుతూ, "అతని మాటల కేం లెండి. అతను తెగ తాగి మాట్లాడుతున్నాడన్న మాటే కాని, అతను చెప్పినదాంట్లోనూ నిజం లేకపోలేదు. ఎడబాటు కలిగించాలంటే చావే అవసరమని లేదు. ఇద్దరినీ దూరంచేస్తే సరిపోతుంది. కారాగారం ఇద్దరికీ ఎడబాటు కలిగించగల దనుకోండి?"

"అవును కలిగించగలదు. కాని ఖైదయితే అందులోనుంచి బైటపడ్డంకూడా ఉంటుందిగా?" అన్నాడు కాడరూస్. "ఖైదులోనించి బయటపడినప్పుడు, డాంటె స్థితిలో ఎవడున్నప్పటికీ పగ తీర్చుకోకమానడు. అయినా డాంటెని కారాగారాని కెందుకు పంపుతారు? అత నేం దొంగతనం చెయ్యడంలేదు; హత్య చెయ్యడం లేదు."

"చాల్లే నువ్వూరుకోవోయ్" అన్నాడు డాంగ్లర్.

"నే నూరుకోను. ఎందు కూరుకోవాలి? అసలు డాంటేని ఖైదు కెందుకు పంపాలో చెప్పండి నాకు? నాకు డాంటే అంటే చాలా ఇష్టం" అంటూ కాడరూస్ మరో గ్లాసు గడగడా తాగేగాడు. అతని ముఖంలో చైతన్యం మరింత అంతరిస్తుండడం గమనించి డాంగ్లర్ ఫెర్నాండోవంక తిరిగి అన్నాడు:—

"వాణ్ని హతంచెయ్యవలసిన అవసరం లేదన్న సంగతి గ్రహించారా?"

"నిజమే. కాని మీ రన్నట్టు అతన్ని అరెస్టుచేయించడం ఎల్లాగ? సాధనమేది?"

"వెతికితే సాధనం అదే కనిపిస్తుంది. అయినా ఈ వ్యవహారంలో నే నెందుకు తలదూర్చడం; నా కేమీ సంబంధం లేనప్పుడు?"

"డాంటేపట్ల మీకూడా క్రోధానికి ఏదో కారణముంది. సహించుకునే వ్యక్తి, ఇతరుల్లోని అసహ్యాన్ని సులువుగా కనిపెట్టగలడు." అన్నాడు ఫెర్నాండో.

"నాకా? డాంటేమీద నాకే కోపం, అసహ్యం లేవే! అందుకు కారణ మేమీ లేదే! మీ దుఃఖంచూస్తే నాకు జాలి కలిగింది అంతే. మీతోడు! నా కోపంకొద్దీ నేను చేస్తున్నానని మీరు భావిస్తే, ఇంక చాలు; సెలవు. మీ చిక్కు లేవో మీరే చూసుకొని పరిష్కరించుకోండి." అంటూ డాంగ్లర్ లేచి వెళ్లిపోడానికి ఉంకించాడు.

ఫెర్నాండో అతన్ని పట్టుకుని కూర్చోబెట్టి, "లేదు లేదు ఒక్క క్షణం ఉండండి. మీకు డాంటేమీద కోపం ఉంటేయేం, లేకపోతేయేం నాకెందుకు? అనవసరం. అతనంటే నాకు కక్ష అని గట్టిగా చెప్తున్నాను. మీరు సాధనం చెప్పండి. నేన నిర్వర్తిస్తాను. ఒక్కటి. డాంటేని చంపకుండా ఉంటే చాలు. అతనికే ముప్పు వచ్చినా మర్సిడా ఆత్మహత్య చేసుకునేమాట నిజం."

మేజాకి బుర్ర బోర్లెట్టి కూచున్న కాడరూస్ మందకొడిగా తలెత్తి మిత్రు లిద్దరినీ సంశయంతో చూశాడు: "ఏమిటీ" డాంటేని చంపడమా? అతనికి అపకారం తలపెడుతున్న వా రెవరు? అతన్ని చంపడం నాకిష్టంలేదు. అతను నా స్నేహితుడు. నాకివాళ ఉదయం అతను అప్పిస్తానన్నాడు—ఇదివరలో నే నతనికిచ్చినట్టే. డాంటేని చంపనివ్వను."

"వాణ్ని చంపాలని ఎవ రన్నారోయ్ చవటా?" అన్నాడు డాంగ్లర్. "అది ఊరికే వేళాకోళాని కన్నమాట. ఇంకోసారి వాణ్ని ఆశీర్వదించుకో. ఇదుగో ఇంకో గ్లాసు తాగు. మా మాట ఇంక మానివెయ్యి" అంటూ కాడరూస్ గ్లాసు నింపాడు.

"అవునవును" అంటూ కాడరూస్ ఆ గ్లాసుకూడా క్షణంలో ఖాళీచేశాడు.

"ఎల్లాగ? సాధనం ఏమిటి?" అన్నాడు ఫెర్నాండో. "ఇందుకు పూనుకుంటానని మీరు మాటిచ్చారు."

"అన్నాను నిజమే. స్పానిష్‌వాళ్లకంటె ఫ్రెంచివాళ్ల గొప్ప ఇక్కడే ఉంది. స్పానిష్ వాళ్లు విచారిస్తూ కూచుంటారు. ఫ్రెంచివాళ్లు మెదడు ఉపయోగించి మార్గాలు కనిపెడతారు."

"సరే. మార్గం కనిపెట్టండి" అన్నాడు ఫెర్నాండో ఆత్రంతో.

హోటల్ కుర్రవాణ్ణి పిలిచాడు డాంగ్లర్ "ఒక కలం, సిరా, కాగితం తెచ్చిపెట్టు."

మూడూ వచ్చాయి. కాడరూస్ కాగితాన్ని పట్టుకుని అన్నాడు "చూడవోయ్ చూడు. చాటునా మాటునా పొంచివుండి మనిషిని హత్య చేసేకన్న, అణిచెయ్యడానికి ఈ ఉపాయం ఎంత మంచిదో చూడు. కత్తి, పిస్తోలుకంటె నాకెప్పుడూ కలం కాగితం అంటే ఎక్కువ భయం."

"పైకి కనిపించినంతగా తాగలేదే! బలే టక్కరి. ఫెర్నాండో, వాడి కింకో గ్లాసు పొయ్యండి." అన్నాడు డాంగ్లర్.

ఫెర్నాండో గ్లాసునింపాడు. వెంటనే కాడరూస్ కాగితాన్ని విడిచిపెట్టి, గ్లాసు అందుకుని, క్షణంలో ఖాళీచేశాడు. దాంతో పూర్తిగా మత్తెక్కి వేళ్లు పట్టువొదిలి, కాడరూస్ గ్లాసుని మేజామీదికి జారవిడిచాడు.

డాంగ్లర్ అంగుకున్నాడు. "ఇదిగో. మాటవరసకి చెప్తున్నాను ఈ ప్రయాణమే ఉందనుకోండి. నేపుల్స్ నగరంనించి వస్తూ, ఎల్బా ద్వీపంవద్ద ఆగి, తరవాత ఇక్కడికి వచ్చాడు. వీడు బోనపార్టిస్టు గూఢచారి అని రాజోద్యోగులికి తెలియపరుస్తామనుకోండి."

"అవును. నేనే తెలియపరిచేస్తాను."

"అప్పుడు ఆ ప్రకటనకింద మీరే సంతకం పెట్టాలి. బాధ్యతంతా మీ దవుతుంది. అప్పుడు నేరస్థుణ్ని మీ సమక్షంలోకి తీసుకొస్తారు. వివరాలన్నిటినీ మిమ్మల్ని చెప్పమంటారు. నేరాన్ని స్థిరపరచడానికి కావలసిన సమాచారమంతా నే తెలుపుతాను. కాని, డాంటే ఎప్పుడూ ఖైదులోనే ఉండిపోతా డనుకో కూడదు.

ఎప్పుడో ఒకప్పుడు బైటపడతాను. అప్పుడు బైటపడుతుంది అతన్ని ఖైదుకి పంపినవాడి గతి."

"అదేం ఫరవాలేదు. నాకు కావలసినదల్లా ఒక్కటే; వాడు నాపైకి తగువుకి రావాలి అది చాలు."

"ఇదిగో, మనం ఏదైనా చెయ్యదల్చుకుంటే ఈ కలం కాగితం తీసుకుని, నేనిప్పుడు రాస్తున్నట్టుగా ఎడమ చేత్తో ఆకారంలేని ఉత్తరం రాయాలి; దస్తూరీ ఎవరిదో తెలియకూడదు" అంటూ డాంగ్లర్ ఈ క్రింది వాక్యాలను ఎడమ చేత్తో వ్రాశాడు:—"మహారాజు గారికి హితంకోరిన ఒక మిత్రుడు రాజశాసనాధికారికి [illegible] తెలియపరుస్తున్నాడు: స్మిర్నా నుంచి బయలుదేరి నేపుల్స్, ఫెరాజో రేవులగుండా ప్రయాణం చేసి, ఇవాళ ఉదయమే మార్సెల్స్ చేరిన ఫరావో నౌకలో మేట్‌గా పనిచేస్తున్న ఎడ్మండ్ డాంటే అనే ఒక యువకుడు, నేపుల్స్‌రాజు (నెపోలియన్ బోనపార్టి) వద్దనుంచి నెపోలియన్‌కు ఒక ఉత్తరం ఇచ్చి, పారిస్‌లో బోనపార్టిస్ట్ కమిటీకి ఇవ్వడానికి నెపోలియన్ వద్దనుంచి ఒక ఉత్తరం తీసుకువెళుతున్నాడు. ఆ యువకుని అరెస్టుచేసినట్లయితే, రుజువు దొరుకుతుంది. నెపోలియన్ [illegible] అతని వద్దకాని, అతని తండ్రి ఇంటిలోకాని, [illegible] అతని గదిలో కాని దొరుకుతుంది."

వ్రాత ముగించి డాంగ్లర్ [illegible]:—"ఇంక మీరు వేరే పగతీర్చుకో నక్కర్లేదు. మన తలపెట్టిన కార్యం సానుకూలపడిపోతుంది. [illegible] ఏమిటంటే, దీన్ని ఇలా మడతపెట్టి రాజశాసనాధికారికి పంపడమే. అంతే. దాంతో పనంతా అయిపోయినట్టే."

"అవును. అంతా అయిపోయినట్టే" అని అందుకున్నాడు కాడరూస. [illegible] వినడానికి అతనికి తన శక్తినంతా వినియోగించవలసి వచ్చింది. ఈ నేరారోపణవల్ల సంభవించగల అపకారం ఎటువంటిదో [illegible] గ్రహించాడు. "అవును. అంతా జరిగిపోతుంది [illegible] ఇది చాలా నీచమైన పని." అంటూ ఆ కాగితాన్ని తీసుకోడానికి చెయ్యి చాచాడు.

డాంగ్లర్ [illegible] చేసి అన్నాడు:—"అవును. ఇది నీచమైన పని [illegible] అంటున్నాను; వేళాకోళానికే [illegible] ఎందుకంటే, మన డాంటేకి ఎలాంటి హాని కలిగినా [illegible] నే [illegible]. ఇదిగో ఇలా చూడు" అంటూ కాగితాన్ని ఉండచుట్టి మేజాకి కొద్దిదూరంలో విసిరేశాడు.

"బాగా [illegible]" అన్నాడు కాడరూస. "డాంటే నాకు స్నేహితుడు. అతనికి అపకారం [illegible] నాకిష్టం లేదు."

"అతని కపకారం చెయ్యాలని ఎవరికిమాత్రం కోరికుంటుంది? నాకూ లేదు; ఫెర్నాండోకీ ఉండదు." అన్నాడు డాంగ్లర్. అని మెల్లిగాలేచి కాటలన్ యువకుని ముఖంవంక చూశాడు. అతడు కాగితపు ఉండపైనే చూపు నిలిపి నిశ్శబ్దంగా కూర్చున్నాడు.

"మరి అయితే ఇంకొంచెం ద్రాక్షసారాయం పుచ్చుకుందాం. మర్నాడాక్, డాంటేకి శుభాకాంక్ష ప్రకటిద్దాం" అన్నాడు కాడరూస్.

"ఇప్పటికి తెగ తాగావోయ్ తాగుబోతూ. ఇంకచాలులే." అన్నాడు డాంగ్లర్. "మనకి వేళ మించిపోయింది. రా వెడదాం" అంటూ అతనికి చెయ్యి అందించాడు.

"అవును వెడదాం. కాని, నన్ను నువ్వు లేవదియ్యనక్కర్లేదు. రావోయ్ ఫెర్నాండో. మాతో మార్సెల్స్‌కి నడిచి వస్తావా?"

"ఊహుం. రాను. నేను కాటలన్స్ గ్రామానికి తిరిగి వెళ్ళిపోవాలి. ఇప్పుడు మార్సెల్స్ వెళ్ళవలసిన పని నాకు లేదు."

"ఏమిటి? రావూ? పోనీలేవోయ్. ఎవరి ఇష్టం వాళ్ళది. రావోయ్ డాంగ్లర్. అతనిష్టంవచ్చినట్లు అక్కడికే వెళ్ళనీ"

కాడరూస్ డాంగ్లర్ భుజంమీద ఆనకునే నడవవలసి వచ్చింది. ఇద్దరూ మార్సెల్స్ దిక్కుగా నడిచారు. కాని ఫెర్నాండో తమ కళ్ళపడకుండా మార్సెల్స్ వెళ్ళదల్చుకుంటే, అలా వెళ్ళనివ్వడానికి వీలుగా, డాంగ్లర్ తీరం వెంబడి కాక, చుట్టుదారి పట్టాడు. ఇద్దరూ కలిసి కొన్ని గజాలమేర నడిచిన తరువాత, కాడరూస్‌ని చేత్తో పట్టుకుని, తాను వెనక్కు తిరిగి చూశాడు. ఫెర్నాండో ఒక అడుగు వేసి, కాగితపు ఉండని చటాల్న అంగుకుని జేబులో దాచుకోడం డాంగ్లర్ కనిపెట్టాడు. ఫెర్నాండో అది అందుకుని మార్సెల్స్ నగరానికి తీరం వెంబడి బయలుదేరి గబగబా నడిచాడు.

"అరె! చూడు? వాడేం చేస్తున్నాడో?" అన్నాడు కాడరూస్. "చూశావా మనతో అబద్ధం చెప్పాడు ఫెర్నాండో. కాటలన్స్ గ్రామానికి వెడుతున్నానన్నాడు. చూడు. మార్సెల్స్‌దారిని వెడుతున్నాడిప్పుడు. ఓయ్ ఫెర్నాండో ఇటురా!"

"పోనోయ్. నీ కసలు కన్ను కనిపించడంలేదు. అతను కాటలన్స్ గ్రామానికే వెడుతున్నాడు. సరిగ్గా చూడు" అన్నాడు డాంగ్లర్.


"నిజంగానా? కుడివైపు తిరిగాడనుకున్నాను. మద్యం ఎంత మోసం చేస్తుంది!"

---


ఒక సన్నపాటిమనిషి బస్సులో ఒక లావుపాటి ఆయన పక్కన కూర్చుని చాలా అవస్థపడుతున్నాడు.

"బరువునిబట్టి టిక్కెట్టురేటు నిర్ణయించే పద్ధతి వుంటే బాగుండును," అని వెక్కిరింపుగా అన్నాడతను.

"అలాగైతే నీకు జన్మలో బస్సెక్కే యోగం లేకపోను. నిన్ను చూసి బస్సు ఆపటంకూడా దండగే ననుకుంటారు," అని జవాబిచ్చాడు లావాటి [illegible].




మరొక నేపాలిబాబా! పంచదారను రేషన్ షాపుల్లోనే కాక, మామూలు బజార్లోకూడా అమ్మించటానికి ప్రభుత్వం నిశ్చయించింది. —(నేషనల్ హెరాల్డ్)




"గొప్ప ఫీటు" పరిశ్రమలమంత్రి హరికృష్ణ మెహతాబ్ ప్రతిపాదించిన వస్తువుల సప్లయి, ధరల బిల్లును పార్లమెంటు ఆమోదించింది. (నేషనల్ హెరాల్డ్)

Regd. No. M. 4479






Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, ThambuChetty St, Madras